thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 65 కరీంనగర్ శుక్రవారం, 16 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## స్వతంత్ర దేశంగా బలూచిస్థాన్!

న్యూఢిల్లీ : భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పాకిస్థాన్‌లోనే అతి పెద్ద ప్రావిన్స్(విస్తీర్ణం పరంగా) అయిన బలూచిస్థాన్.. పాకిస్థాన్ నుంచి విడిపోతున్నట్టు బలూచ్ నేతలు ప్రకటించారు. అంతేకాక బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని భారత్, ఐక్యరాజ్యసమితిని కోరారు. ఈ మేరకు బలూచిస్థాన్ నాయకుడు మీర్ యార్ బలూచ్ ఎక్స్‌లో పలు పోస్టులు చేశారు. రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్థాన్ ఏర్పాటును తన పోస్టుల్లో ప్రకటించారు. అలాగే, న్యూఢిల్లీలో బలూచిస్థాన్ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. తమను దేశంగా గుర్తించి.. కరెన్సీ, పాస్‌పోర్టు జారీ వంటి ప్రాథమిక అవసరాలకు నిధులు సమకూర్చాలని ఐక్యరాజ్యసమితిని అభ్యర్థించారు.

# రాష్ట్రపతి, గవర్నర్‌కు గడువు ఎలా విధిస్తారు? సుప్రీంకోర్టుకు ద్రౌపదీ ముర్ము ప్రశ్న..!

దిల్లీ: శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు ఇటీవల సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. దీనిపై ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తాజాగా స్పందించినట్లు తెలుస్తోంది. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ముర్ము ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**రాష్ట్రపతి అడిగిన ప్రశ్నలు ఇవే..** రాజ్యాంగంలోని రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీ చేయగలదు? సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను రాష్ట్రాలు కేంద్రానికి వ్యతిరేకంగా దుర్వినియోగం చేస్తున్నాయా? రాష్ట్రపతి, గవర్నర్‌కు కోర్టులు గడువు ఎలా నిర్దేశిస్తాయి? రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద బిల్లును సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలు ఏమిటి? ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి, ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణాధికారం ఉపయోగించడం న్యాయబద్ధమేనా?

**ఏంటీ తీర్పు..** తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.




దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి/గవర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది.

బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలనూ జత చేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది.




పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. పాక్, POKలోని తొమ్మిది ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అయితే దీనిపై ఆస్ట్రియన్ వార్ఫేర్ అనలిస్ట్ టామ్ కూపర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ గ్రాండ్ సక్సెస్ అయినట్లు పేర్కొన్నారు. పాకిస్థాన్ అణు స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయని తెలిపారు. ఓ నేషనల్ మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. " భారత్ దాడిలో పాకిస్థాన్ అణు స్థావరాలు ధ్వంసమయ్యాయి. అణు స్థావరాల ఎంట్రీ, ఎగ్జిట్లను భారత సైన్యం లేపేసింది. పాక్ వాళ్లు కూడా వాళ్ల అణు స్థావరాల్లోకి వెళ్లలేకపోతున్నారు. ఇండియా దెబ్బకు పాక్ గేమ్‌ఓవర్ అయ్యింది. వాళ్లు తమ అణు స్థావరాలు, ఎయిర్బేస్లను రక్షించుకోలేకపోయారు. దీన్నిబట్టి చూస్తే భారత్ గెలిచినట్లే కదా" అని టామ్ కూపర్ అన్నారు.

# కాళేశ్వరం ఆలయాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి



## సరస్వతి పుష్కరాల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి



కాళేశ్వరం: కాళేశ్వరం ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సరస్వతి పుష్కరాల్లో భాగంగా హారతి కార్యక్రమంలో సీఎం, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కాళేశ్వరం అభివృద్ధి కోసం రూ.200 కోట్లు అయినా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగాన్ని సీఎం అభినందించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం తొలిసారిగా టెంట్ సిటీ ఏర్పాటు చేశామన్నారు. "త్వరలోనే గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా రానున్నాయి. వచ్చే గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు కాళేశ్వరం క్షేత్రానికి వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం. గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహించే అదృష్టం నాకు కలగనుంది" అని సీఎం అన్నారు.

**సరస్వతీనది పుష్కరస్నానమాచరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు** : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సరస్వతీనది పుష్కరస్నానమాచరించారు. అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు.

గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. ఇవాళ వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు.

**సరస్వతి నవరత్న మాల హారతి..** ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. దీంతోపాటు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భక్తులు రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలికంగా టెంట్ సిటీని నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసింది. ప్రతిరోజు సగటున లక్షన్నర మంది వస్తారని దేవాదాయశాఖ అంచనా వేసింది.




## వృద్ధుల సంక్షేమం కోసం మరో ముందడుగు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం మరో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో వృద్ధుల కోసం డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒంటరితనంతో బాధపడుతున్న.. తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వృద్ధుల కోసం ఈ కేంద్రాలు ప్రత్యేకంగా రూపొందించనున్నారు. ఈ డే కేర్ సెంటర్లలో వృద్ధుల కాలక్షేపం కోసం అనేక సౌకర్యాలు కల్పించనున్నారు. ఇండోర్ గేమ్స్, యోగా, పుస్తకాలు, కథలు, ధ్యానం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా వృద్ధులు తమ వయసుతో సమానంగా ఉన్న తోటి వారితో కలిసి ఆనందంగా గడపడానికి అవకాశం ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు పది లక్షల మంది సీనియర్ సిటిజన్లు ఉన్నారని అంచనా వేయబడింది. వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఈ కొత్త పథకాన్ని ప్రారంభించబోతోంది. ఈ నిర్ణయం పట్ల సీనియర్ సిటిజన్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈ డే కేర్ సెం టర్లు వృద్ధుల జీవితాల్లో ఒక ముఖ్యమైన మార్పును తీసుకువ స్తాయి. ఒంటరితనం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి కి ఇవి ఒక పెద్ద సహాయంగా ఉంటాయి. డే కేర్ సెంటర్లను ఏర్పా టు చేస్తుండటంతో సీనియర్ సిటిజన్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




యాదగిరిగుట్ట, భువనగిరి: మిస్‌వరల్డ్ పోటీదారులు గురువారం సాయంత్రం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ గెస్ట్‌హౌస్ నుంచి బ్యాటరీ వాహనాల్లో చేరుకున్న సుందరీమణులు అఖండ దీపారాధన మండపంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు. అక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతను పర్యవేక్షించారు.

**పోచంపల్లిలో అందాల భామలు...** టూరిజం విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పోచంపల్లిని ఆఫ్రికా ఖండానికి చెందిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు.

వారికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇక్కత్ చీరల ప్రత్యేకత, తయారీ విధానాన్ని విదేశీ అతిథులు పరిశీలించారు. పలువురు భామలు స్వయంగా చీరలను నేసి సంబరపడ్డారు.




## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. సుప్రీం కీలక వ్యాఖ్యలు

దిల్లీ: హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది. కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.




భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాలు ప్రారంభమయ్యాయి. పుష్కరాలను మాధవానంద సరస్వతి స్వామి ప్రారంభించారు. పుష్కరిణి వద్ద మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి ఈ నెల 26 వరకు సరస్వతి నది పుష్కరాలు కొనసాగనున్నాయి. ఇక్కడికి వచ్చే భక్తుల కోసం ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇక్కడ తొలిసారి సరస్వతి పుష్కరాలు జరుగుతున్నాయి. రోజుకు లక్ష నుంచి లక్షన్నర మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. దీంతోపాటు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

భక్తులు రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలికంగా టెంట్ సిటీని నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసింది.




హైదరాబాద్ లో గురువారం ( మే 15 ) ఉదయం వర్షం దంచికొట్టింది.. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి.. ఆఫీసులకు వెళ్లే సమయం కావడంతో భారీగా ట్రాఫిక్ జాం అయ్యి జనం తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇవాళ కురిసిన వర్షపాతానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. అత్తపూర్, లాలాపేట్, మౌలాలి,సికింద్రాబాద్, షేక్పేట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ రాజేంద్రనగర్, శివరాంపల్లి, పఠాన్ చెరువు, బీహెచ్ఈఎల్ ,చార్మినార్,మేహిధిపట్నం,ఆషిఫ్ నగర్ లో 1 సెంటీమీటర్ వర్షపాతం నమోదైనట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా.. తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన వడ్లు పూర్తిగా నీటమునిగాయి. మండలంలోని గోగుపల్లి శివారులోని కొనుగోలు కేంద్రంలో సుమారు 150 మంది రైతులు తమ వడ్లను ఆరబోశారు. బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి తోడు కొనుగోలు కేంద్రానికి సమీపంలో ఉన్న ఊరవాగు ఉప్పొంగడంతో వడ్లు మొత్తం నీటిలో కొట్టుకుపోయాయి. వడ్లు లోడింగ్‌కు సిద్ధంగా ఉన్నప్పటికీ.. క్వింటాల్‌కు 10 కిలోలు తరుగు తీయాలని మిల్లర్లు చెప్పడంతో వడ్లను కేంద్రంలోనే ఉంచామని, వర్షం, వరద వల్ల మొత్తం బస్తాలు తడిసిపోయాయని కన్నీటిపర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క ఘటనాస్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. పంట నష్ట పరిహారం ఎంతైనా నేరుగా రైతుల అకౌంట్లలోనే జమ చేస్తుందన్నారు. ఆమె వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, కాంగ్రెస్ లీడర్లు ఇర్సవడ్ల వెంకన్న, రఘు, అప్సర్, చెన్నూరి బాలరాజు పాల్గొన్నారు. అలాగే తడిసిన వడ్లను జడ్పీ మాజీ చైర్మన్ బడే నాగజ్యోతి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మ వెంకట్‌రెడ్డి పరిశీలించి, రైతులను పరామర్శించారు.

## రూ. 8వేల కోట్ల 'ఫీజు' బకాయిలు.. తక్షణమే చెల్లించాలి: సీఎంకు బండి సంజయ్ లేఖ



హైదరాబాద్: తక్షణమే ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. "ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ. 8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి"అని లేఖలో పేర్కొన్నారు.




హైదరాబాద్: ఈనెల 17 నుంచి హైదరాబాద్ మెట్రో రైల్ ఛార్జీలు పెరగనున్నాయి. కనీస ఛార్జీ రూ.10 నుంచి రూ.12కి, గరిష్ఠ ఛార్జీ రూ.60 నుంచి 75కి పెంచుతున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ప్రకటించింది.

**పెరిగిన ఛార్జీల వివరాలు...** మొదటి రెండు స్టాప్‌లకు రూ.12, రెండు నుంచి 4 స్టాప్‌ల వరకు రూ.18, 4 నుంచి 6 స్టాప్‌ల వరకు రూ.30, 6 నుంచి 9 స్టాప్‌ల వరకు రూ.40, 9 నుంచి 12 స్టాప్‌ల వరకు రూ.50, 12 నుంచి 15 స్టాప్‌ల వరకు రూ.55, 15 నుంచి 18 స్టాప్‌ల వరకు రూ.60, 18 నుంచి 21 స్టాప్‌ల వరకు రూ.66, 21 నుంచి 24 స్టాప్‌ల వరకు రూ.70, 24 స్టాప్‌లు.. ఆపైన రూ.75.




## వెంబడించి.. గొంతు కోసి.. నాంపల్లిలో రౌడీషీటర్ దారుణ హత్య

హైదరాబాద్: నగరంలోని నాంపల్లిలో దారుణం చోటుచేసుకుంది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రౌడీషీటర్ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. చాంద్రాయణగుట్టకు చెందిన అయాన్ ఖురేషీ ఓ కేసు నిమిత్తం నాంపల్లి కోర్టుకు వచ్చాడు.

అనంతరం తిరిగి వెళ్తుండగా ఐదుగురు దుండగులు ఆయన్ను వెంబడించారు. క్యాన్సర్ ఆస్పత్రి వద్ద తొలుత బ్యాట్‌తో దాడి చేశారు. అనంతరం కత్తులతో గొంతు కోసి పొట్టలో పొడిచి చంపారు. హత్యకు ఉపయోగించిన బ్యాట్, కత్తులను ఘటనాస్థలంలోనే వదిలి పరారయ్యారు. సమాచారం అందుకున్న నాంపల్లి పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.




కుంటాల/జైపూర్ : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ నెల 16న ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. భూభారతి చట్టం అమలు కోసం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మంచిర్యాల జిల్లా భీమారం మండలం, నిర్మల్ జిల్లా కుంటాలలో పర్యటించనున్నారు. కుంటాలలో ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. రైతులతో నిర్వహించే బహిరంగ సభ, భూభారతి దరఖాస్తులు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలపై సూచనలు చేశారు. భీమారం మండలంలోని పోతనపల్లిలో మంత్రి పర్యటిస్తారని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.

ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ సదానందంతో కలిసి గ్రామంలోని ప్రైమరీ స్కూల్లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలో భూసమస్యల సంబంధిత దరఖాస్తులను స్వీకరించి, పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారని తెలిపారు.




హైదరాబాద్ : రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) షాక్ ఇచ్చింది.

దాదాపు 20 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు, మెజార్టీ ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు మెయిల్స్ పంపింది. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తవి కలిపి జిల్లాకు ఒక్కటి చొప్పున 33 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండగా, 28 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో ఏకంగా 90 శాతం కాలేజీలకు నోటీసులు జారీ కావడం గమనార్హం.

మెడికల్ కాలేజీల్లో మెయింటెనెన్స్ సరిగా లేదంటూ ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు పంపిన మెయిల్‌లో ఎన్ఎంసీ పేర్కొంది. ఇతర అనేక సమస్యలను నోటీసుల్లో ప్రస్తావించింది. వీటిపై వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది.




పర్వతాలతో కప్పేసిన జమ్మూకశ్మీర్‌లో ప్రయాణాలను వేగవంతం చేయాలన్న ప్రభుత్వ ప్రణాళిక పట్టాలెక్కింది. కట్రా–కాజీగుండ్ సెక్షన్‌లో కొత్తగా నిర్మించిన చీనాబ్ వంతెనపై ఒక ప్రత్యేక రైలు విజయవంతంగా ప్రయాణించింది. ప్రత్యేక బలగాలను తీసుకెళ్లిన ఈ రైలు పూర్తి భద్రతాపరమైన ఏర్పాట్ల మధ్య రౌండ్ ట్రిప్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉన్న వేళ ఈ రైలు అందుబాటులోకి రావడం అత్యంత కీలకమైన విషయం. కశ్మీర్‌తో ఇది కనెక్టివిటీని పెంచుతోంది. జమ్మూ–కశ్మీర్ మధ్య రైలు ప్రయాణాలను కొనసాగించాలన్న ప్రభుత్వ ప్లాన్‌పై సరిహద్దుల్లో సంక్షోభం ప్రభావం ఏమాత్రం పడలేదని ఇది నిరూపిస్తోంది. ఈ మార్గంలో అదనపు ట్రైల్ రన్ నిర్వహించిన విషయాన్ని నార్తర్న్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ హిమాన్షూ శేఖర్ ఉపాధ్యాయ్ ధ్రువీకరించారు. ఈ మార్గంలో చీనాబ్ వంతెన కశ్మీర్‌ను రైల్వేమార్గం ద్వారా మిగిలిన భారత్‌కు అనుసంధానం చేస్తోంది. కట్రా నుంచి ఉదయం 10 గంటలకు బయల్దేరిన ఈ రైలు.. రాత్రి 6 గంటలకు తిరిగి స్టేషన్‌కు చేరుకొంది. వాస్తవానికి ఈ రైలు మార్గాన్ని గత నెల ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా వచ్చి ప్రారంభించాల్సి ఉంది. కానీ, వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ పర్యటన రద్దైంది. తాజాగా వెళ్లిన స్పెషల్ రైలులో సెలవులు రద్దై తిరిగి విధుల్లో చేరుతున్న సైనికులు ఉన్నారు. ముఖ్యంగా జమ్మూకశ్మీర్‌కు పౌరవిమాన సేవలు రద్దు కావడంతో వారందరికి ఈ రైలే ఏకైక మార్గంగా ఉంది. ఇది కట్రా–కాజీగుండ్ వరకు మాత్రమే ఉంది. సాధారణంగా అయితే.. బారాముల్లా–కాజీగుండ్ వరకు ఉంటుంది. కశ్మీర్‌కు సైన్యం, ఆయుధాలు వేగంగా తరలించేందుకు ఇప్పుడు ఈ మార్గం ఉపయోగపడనుంది. ఇప్పటికే ఉన్న రోడ్డు, ఇతర మార్గాలకు ఇది అదనంగా సేవలు అందించనుంది.



## పాక్‌తో సరిహద్దు ఉన్న నగరాలకు పలు విమానాలు రద్దు

కాల్పుల విరమణ ఒప్పందం జరిగినప్పటికీ పాకిస్థాన్ ఇంకా దాడులకు యత్నిస్తున్నట్లే కన్పిస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో సోమవారం రాత్రి మళ్లీ డ్రోన్లు కనిపించినట్లు కథనాలు వచ్చాయి. దీంతో అక్కడి ప్రజలు మరోసారి భయాందోళనకు గురవుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశీయ విమానయాన సంస్థలు అప్రమత్తమయ్యాయి. పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న నగరాలకు పలు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ఎయిర్‌ఇండియా, ఇండిగో ప్రకటించాయి. “తాజా పరిణామాలు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జమ్మూ, లేహ్, జోధ్‌పుర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, చండీగఢ్, రాజ్‌కోట్ నగరాలకు మంగళవారం (మే 13) విమాన రాకపోకలు నిలిపివేస్తున్నాం. పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు ప్రకటిస్తాం” అని ఎయిర్ ఇండియా తమ ప్రకటనలో వెల్లడించింది. అటు ఇండిగో కూడా ఇదే విధమైన ప్రకటన చేసింది. “ప్రయాణికుల భద్రతే మాకు అత్యంత ప్రాధాన్యం. దీని వల్ల మీ ప్రయాణ ప్రణాళికలకు అంతరాయం ఏర్పడినప్పటికీ రద్దు చేయక తప్పట్లేదు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణ చెబుతున్నాం” అని కంపెనీ పేర్కొంది. శ్రీనగర్, లేహ్, రాజ్‌కోట్, చండీగఢ్, జమ్మూ, అమృత్‌సర్ ప్రాంతాలకు ఇండిగో (%×అస్త్రఅ+శీ%) విమాన సర్వీసులను నిలిపివేసింది. వాస్తవానికి సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు కాస్త సద్దుమణిగినట్లు అనిపించడంతో సోమవారం నుంచి 32 ఎయిర్‌పోర్టులను తిరిగి అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో విమాన సేవలను పునరుద్ధరించేందుకు ఎయిర్‌లైన్లు కూడా సిద్ధమయ్యాయి. అయితే, జమ్మూకశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో సోమవారం రాత్రి డ్రోన్ల కదలికలు కన్పించాయి. అటు పంజాబ్‌లోని జలంధర్‌లో ఓ నిఘా డ్రోన్‌ను కూల్చివేసినట్లు సైనిక బలగాలు ప్రకటించాయి. కలవరపడాల్సిందేమీ లేదని, పరిస్థితి పూర్తి నియంత్రణలోనే ఉందని వెల్లడించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో దిల్లీ నుంచి అమృత్‌సర్‌కు వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని కొంతదూరం వెళ్లాక తిరిగి వెనక్కి మళ్లించారు. అనంతరం విమాన సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ఇండిగో ప్రకటించింది. ఎయిర్‌ఇండియా కూడా ఇదే నిర్ణయాన్ని వెల్లడించింది.



## తొలి నెల నుంచే రూ.లక్ష జీతం!

బీఈ/బీటెక్ విద్యార్హతతో ఆర్మీలో సేవలందించే అవకాశం వచ్చింది. ఇంజినీరింగ్ పూర్తిచేసుకున్నవారు, చివరి ఏడాది చదువుతున్నవారిని టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు (టీజీసీ)ల్లోకి ఇండియన్ ఆర్మీ ఆహ్వానిస్తోంది. సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఇంటర్వ్యూతో నియామకాలుంటాయి. ఎంపికైనవారికి శిక్షణ సమయంలో స్టైపెండ్ చెల్లిస్తారు. అనంతరం లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. మొదటి నెల నుంచే రూ.లక్షకు పైగా వేతనం అందుకోవచ్చు. టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు (టీజీసీ) ప్రకటనను దాదాపు ఏటా ఆర్మీ విడుదలచేస్తోంది. వీటికి అవివాహిత పురుషులు అర్హులు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలి. దరఖాస్తు రుసుం లేదు. వచ్చిన దరఖాస్తులను బీటెక్ మార్కుల మెరిట్ ప్రకారం వడపోస్తారు. ఇందులో నిలిచినవారిని సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ), బెంగళూరు కార్యాలయంలో ఐదు రోజులపాటు రెండు దశల్లో సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీటిని సైకాలజిస్ట్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, ఇంటర్వ్యూయింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో చేపడతారు. తొలిరోజు స్టేజ్-1 స్క్రీనింగ్ (ఇంటలిజెన్స్) పరీక్షలు ఉంటాయి. ఇందులో అర్హత సాధించినవారినే స్టేజ్-2కి ఎంపిక చేస్తారు. వీరిని నాలుగు రోజులపాటు పలు విభాగాల్లో పరీక్షించి, అందులో రాణించినవారికి వైద్య పరీక్షలు నిర్వహించి, శిక్షణకు తీసుకుంటారు. ఇంటర్వ్యూకు హాజరైనవారికి ప్రయాణ ఖర్చులూ చెల్లిస్తారు.

**శిక్షణ:** కోర్సులోకి ఎంపికైనవారికి ఇండియన్ మిలటరీ అకాడెమీ, దేహ్రాదూన్‌లో జనవరి, 2026 నుంచి సుమారు ఏడాది శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెలా రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారిని లెఫ్టినెంట్ హోదాతో శాశ్వత ప్రాతిపదికన విధుల్లోకి తీసుకుంటారు. ఉద్యోగంలో చేరిన తర్వాత లెవెల్-10 రూ.56,100 మూలవేతనంతోపాటు రూ.15,500 మిలటరీ సర్వీస్ పే అందుతాయి. వీటికి డీఏ, ఇతర ప్రోత్సాహకాలు అదనం. అందువల్ల తొలి నెల నుంచే సుమారు రూ.లక్షకుపైగా జీతం అందుకోవచ్చు. తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయి హోదాలు సొంతం చేసుకోవచ్చు. రెండేళ్ల సర్వీసుతో కెప్టెన్, ఆరేళ్లు కొనసాగితే మేజర్, 13 ఏళ్ల సేవలతో లెఫ్టినెంట్ కల్నల్ కావచ్చు. ఇవి పూర్తికాల పోస్టులు. పదవీ విరమణ వయసు వరకు విధుల్లో కొనసాగవచ్చు. అనంతరం జీవితాంతం పింఛనూ అందుకోవచ్చు.

**ఖాళీలు:** 30 విభాగాలవారీ: సివిల్, అనుబంధ విభాగాల్లో 8, కంప్యూటర్ సైన్స్ 6, ఎలక్ట్రికల్ 2, ఎలక్ట్రానిక్స్ అనుబంధ విభాగాల్లో 6, మెకానికల్ 6, ఇతర విభాగాల్లో 2 ఉన్నాయి.

**అర్హత:** నిర్దేశిత/ అనుబంధ బ్రాంచీల్లో ఇంజినీరింగ్ పూర్తిచేసుకున్నవారు, ప్రస్తుతం చివరి ఏడాది కోర్సుల్లో ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ సైన్స్ పోస్టులకు ఎమ్మెస్సీ సీఎస్/ ఐటీ విద్యార్హతలతోనూ పోటీ పడవచ్చు. అన్ని ఖాళీలకూ అవివాహిత పురుషులే అర్హులు.

**వయసు:** జనవరి 1, 2026 నాటికి 20 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. జనవరి 2, 1999 - జనవరి 1, 2006 మధ్య జన్మించినవారు అర్హులు.

**ఆన్‌లైన్ దరఖాస్తులు:** మే 29 మధ్యాహ్నం 3 వరకు స్వీకరిస్తారు.




## ఊపందుకున్న ‘బాయ్‌కాట్’ తుర్కియే నినాదం

పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ ను భారత్ చేపట్టగా.. ఆ సమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. దీంతో ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై మనదేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి.

‘బాయ్‌కాట్ తుర్కియే’ పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా ‘బ్యాన్ తుర్కియే’ అంటూ పలువురు వ్యాపారులు కూడా ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను విక్రయించేందుకు నిరాకరిస్తున్నారు. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో బాయ్‌కాట్ తుర్కియే నినాదం ఊపందుకుంది. ఈ క్రమంలో తాజాగా పుణెలోని వ్యాపారులు కూడా ఆ దేశం యాపిల్‌లను బహిష్కరిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్‌లో అవి కనిపించకుండా పోతున్నాయి. స్థానికులు కూడా ఇతర ప్రదేశాల నుంచి దిగుమతయ్యే పండ్లను తీసుకుంటున్నారు.

**ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..** పుణెలో మార్కెట్‌లో తుర్కియే యాపిల్‌ల సీజన్ టర్నోవర్ రూ.1000 నుంచి 1200 కోట్ల వరకు ఉటుందని అంచనా. దీంతో వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ వర్తకులు మాత్రం.. దీన్ని ఆర్థిక నిర్ణయంగా మాత్రమే కాదని, ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా చూస్తున్నామని పేర్కొంటున్నారు. యాపిల్‌లను అక్కడ నుంచి దిగుమతి చేసుకునే బదులు హిమాచల్, ఉత్తరాఖండ్, ఇరాన్, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. మరోవైపు, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత కుల్‌దీప్ సింగ్ రాథోడ్ కూడా తుర్కియే తీరుపై ఇటీవల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2023లో భీకర భూకంప సమయంలో ‘ఆపరేషన్ దోస్త్’ ద్వారా భారత్ ఆ దేశానికి ఎంతో సాయం చేసిందని, అయినప్పటికీ ఆ దేశం దౌత్య ద్రోహానికి పాల్పడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అక్కడి దిగుమతులపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు.

**భారత్‌పై ద్వేషం..** ఇదిలాఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సైనిక విమానాలు, యుద్ధనౌకను తుర్కియే పంపించినట్లు వార్తలు వచ్చాయి. ఆ ఆయుధాలనే భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగిస్తోందని సమాచారం. పహల్గాం దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్ బైజాన్ మాత్రమే పాక్‌కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేక సార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్‌పై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే.

# కమలనాధులు... ఇలాగే సర్దుకుపోవాల్సిందే!



ఏపీలో కమలనాధులు పూర్తి నైరాశ్యంలో కూరుకుని పోయారని అంటున్నారు. మూడు పార్టీల పొత్తుతో ఏపీలో అధికారంలోకి వచ్చామన్న ఆనందం వారికి ఎక్కడా లేకుండా పోయింది అని అంటున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వంలో పెద్దన్నగా టీడీపీ ఉంటే జనసేన రెండవ ప్లేస్ లో ఉంది. ఇక బీజేపీ విషయం తీసుకుంటే జూనియర్ పార్టనర్ మాదిరిగా ఉంది అని అంటున్నారు. నామినేటెడ్ పదవుల పంపిణీలో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోంది అని అంటున్నారు. మేజర్ షేర్ ఎటూ టీడీపీకి వెళ్ళినా ఆ తరువాత జనసేనకు రావాల్సిన వాటా దక్కుతోందని ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ముగ్గూరు ఎంపీలు ఉన్న బీజేపీకి దానికి తగిన వాటా అయితే దక్కడంలేదు అని అంటున్నారు. ఇప్పటికి అనేక విడతలుగా పదవుల పంపిణీ జరిగింది. కానీ బీజేపీ నుంచి ఆశావహులకు మాత్రం పెద్దగా దక్కలేదు అని చెబుతున్నారు. తాజాగా డీసీసీబీ డీసీఎంఎస్ చైర్మన్ల పోస్టుల భర్తీ విషయం తీసుకున్నా ఇతర కీలకమైన నామినేటెడ్ పదవుల తీరు చూసినా బీజేపీ దాకా వచ్చేసరికి ఒకటీ అరా పదవులు ఇస్తున్నారు అని అంటున్నారు. దానికి కారణం ఉందని అంటున్నారు. కేంద్రంలో బీజేపీకి కావాల్సిన రాజ్యసభ ఎంపీల పదవులు ఇస్తున్నారు. అలాగే టీడీపీ ఎంపీల మద్దతుతో కేంద్ర ప్రభుత్వం నడుస్తోంది. దాంతో కేంద్ర పెద్దలను సంతృప్తి పరిస్తే చాలు అని భావిస్తున్నారు అని అంటున్నారు. దాంతో ఏపీలో లోకల్ లీడర్స్ కి ఏ పదవులూ దక్కడంలేదు అని అంటున్నారు. ఇక ఈ విషయంలో కేంద్రం ప్రత్యేకంగా జోకయం చేసుకుంటేనే తప్ప ఎవరికైనా పదవులు దక్కుతాయి తప్ప ఏపీలో కూటమిలో బీజేపీ ఉంది అన్నది మాత్రం ఎవరికీ తెలియకుండా పోతోంది అని అంటున్నారు. పదవుల కోసం ఆశలు పెట్టుకున్న మాజీ ఎంపీ జీవీఎల్ నరసిం హారావు, అలాగే విష్ణు వర్ధన్ రెడ్డి లాంటి వారి విషయం తీసుకుంటే ఇపుడు పూర్తిగా సైలెంట్ మోడ్ లోకి వెళ్ళారని అంటున్నారు. ఏడాది కూటమి పాలనలో ప్రాధాన్యతలు ఎవరికి ఏమిటి అన్నది బాగా తెలిసిందని అంటున్నారు. దాంతో కేంద్రంలో బీజేపీకి ఏపీ కూటమి పార్టీలతో అవసరాలు ఉన్నాయని అలాగే ఏపీ కూటమి నేతలు తమ వద్ద ఉన్న పదవుల విషయంలో తమ అవసరాలను చూసుకుంటూ ఎంపిక చేస్తున్నారు అని అంటున్నారు. దాంతో ఏపీ బీజేపీ నేతలు ఇక పదవుల మీద పెద్దగా ఆశలు అయితే పెట్టుకోవడం లేదు అనే అంటున్నారు. మరో విషయం ఏమిటి అంటే బీజేపీలో గట్టిగా నిలబడి పదవులు కావాలని అడిగే నాయకుడు కూటమి పెద్దలను ఒప్పించే వారు రాష్ట్ర స్థాయిలో లేకపోవడం కూడా ఒక లోటుగా ఉందని వాపోతున్నారు. మొత్తానికి ఇలాగే సర్దుకుపోవాల్సిందే అన్న ఆలోచనకు కమలనాధులు వచ్చేసారని టాక్.

## పాక్ ఆర్మీ ఆయువుపట్టుపై కొట్టిన ఐఏఎఫ్ చీఫ్ వ్యూహం

పాక్ మిలిటరీకి కుంభస్థలం వంటిది రావల్పిండి సమీపంలోని చక్లాలా స్థావరం. ఇక్కడి ఆర్మీ చీఫ్ ప్రధాన కార్యాలయంతోపాటు.. వాయుసేన బేస్ కూడా ఉంది. దీనికి అత్యంత సమీపంలోనే కీలకమైన న్యూక్లియర్ ప్లానింగ్ కమాండ్ కూడా ఉంది. ఇలాంటి చోట భారత వాయుసేన దాడి చేసి.. పాక్ నైతిక స్థైర్యాన్ని తుత్తునియలు చేసింది. రావల్పిండిలోని నూర్‌ఖాన్ వైమానిక స్థావరంపై దాడికి సంబంధించిన ప్లానింగ్‌ను ఎయిర్ ఫోర్స్ చీఫ్, ఎయిర్ చీఫ్‌మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ (ఏపీ సింగ్) స్వయంగా పర్యవేక్షించారట. ఆయన ప్లానింగ్‌కు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. ఈ దాడికి వ్యూహాన్ని అమలు చేయడానికి అవసరమైన పైలట్లను ఏపీ సింగ్ స్వయంగా ఎంపిక చేశారు. ఇక దాడికి సంబంధించిన నియమనిబంధనలు వారికి స్పష్టంగా వెల్లడించి దాడికి పంపారట. శనివారం అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో పాక్ సైనిక నగరమైన రావల్పిండి పేలుళ్లతో కంపించిపోయింది. క్షిపణులు, విమానాల హోరుతో అక్కడున్నవారు కంపించిపోయారు. ఇక్కడ మొత్తం మూడు ప్రదేశాలపై భారత్ క్షిపణులు, డ్రోన్లు విరుచుకుపడినట్లు



ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారని ఆంగ్ల వార్తా సంస్థ రాయిటార్స్ కథనంలో పేర్కొంది. రెండు భవనాల పైకప్పులు, ఓ రీఫ్యూయలర్ ట్యాంకర్ హ్యాంగర్‌ను క్షిపణులు తాకినట్లు చెబుతున్నారు. ఆ సమయంలో అక్కడి విమానం గాల్లో ఉందని అంటున్నారు. ఈ దాడి జరిగిన ప్రదేశానికి పాక్ న్యూక్లియర్ ప్లానింగ్ విభాగం కేవలం మైలు దూరం మాత్రమే ఉంది. భారత వాయుసేన ఈ దాడికి బ్రహ్మోస్ క్షిపణిని వినియోగించి ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ దాడి తీవ్రతకు పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్ బంకర్‌లో మూడు గంటలపాలు తలదాచుకోవాల్సి వచ్చిందట. ప్రస్తుతం ఆయన అధికారిక నివాసాన్ని కూడా ఓ సేఫ్ హౌస్‌కు మార్చుకోవాల్సి వచ్చిందని ప్రచారం జరుగుతోంది.

**- అమర్‌ప్రీత్‌కు ఘనమైన చరిత్ర...** 1964లో జన్మించిన అమర్ ప్రీత్ సింగ్ 1984లో వాయుసేనలో పైలట్‌గా చేరారు. ఆయన నేషనల్ డిఫెన్స్ అకాడమీ, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్, నేషనల్ డిఫెన్స్ కాలేజీల్లో విద్యాభ్యాసం చేశారు. ఆయన క్వాలిఫైడ్ ఇన్‌స్ట్రక్టర్. అంతేకాదు టెస్ట్ పైలట్‌గా కూడా పనిచేశారు. మొత్తం 5,000 ఫ్లయింగ్ అవర్స్ అనుభవం ఆయన సొంతం. వాయుసేనలో ఆయన 40 ఏళ్ల కెరీర్‌లో వివిధ రకాల కీలక బాధ్యతలను నిర్వహించారు. మాస్కోలో చేపట్టిన మిగ్-29 విమానాల అప్‌గ్రేడ్ ప్రాజెక్టులో కీలక భూమిక పోషించారు. ఇక తేజస్ విమానాల పరీక్షల సమయంలో నేషనల్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు.

## మిస్ వరల్డ్: నిమిషాల్లో చీరకట్టులో మారి.. అచ్చ తెలుగు అమ్మాయిలుగా!

అందాల పోటీలు అంటే.. అందాల ఆరబోత.. అవయువాల షోకేస్ చేయటమే తప్పించి ఇంకేమీ లేదన్న స్టీరియో టైప్ ఆలోచనలకు చెక్ చెప్పాల్సిందే. అందం అంటే.. కనిపించే రూపమే కాదు.. అంతకు మించిన టాలెంట్.. మహిళల సత్తా చాటే పోటీలుగా చూడాల్సిన అవసరం ఉంది. మనకు సదూరాన జరిగే అందాల పోటీల గురించి వినటం.. ఈ పోటీలకు వ్యతిరేకించే వాదనలని ఇంతకాలం విన్నాం. కానీ.. గడిచిన కొద్దిరోజులుగా తెలంగాణలో జరుగుతున్న అందాల పోటీల (మిస్ వరల్డ్) నిర్వహణ చూస్తున్న వేళలో.. ఇప్పటివరకు ఉన్న భావనలకు చెక్ చెప్పేలా ఉందని చెప్పాలి. 108 దేశాలకు చెందిన అందాల భామలు (ఆయా దేశాల్లో అందగత్తెలుగా మిస్ కిరీటాన్ని సొంతం చేసుకున్న వారు) తుది పోటీలకు తెలంగాణకు వచ్చారు. వారు వచ్చింది మొదలు నిత్యం అంతర్గతంగా జరిగే పోటీల్లో తమ సత్తా చాటటంతో పాటు.. ఇక్కడి కల్చర్ ను.. ప్రజల జీవన విధానాన్ని..



ఇక్కడ పర్యాటకానికి సంబంధించిన విశేషాల్ని తెలుసుకునేందుకు వారు చూపిస్తున్న ఆసక్తి.. ఆ సందర్భంగా వారి నుంచి వస్తున్న సానుకూలత చూసినప్పుడు అందాల పోటీల్ని చూడాల్సిన కోణాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్న భావన కలుగుతుంది. బుధవారం ఉమ్మడి వరంగల్ లోని పలు దర్శనీయస్థలాల్ని చూసేందుకు వెళ్లిన 30 దేశాలకు పైనే అందాల భామలు.. ఆయా ప్రాంతాల్లోని విశేషాల గురించి విని విస్మయానికి గురయ్యారు. అన్నింటికి మించి రామప్ప దేవాలయంలోని కళా సంపదకు అచ్చెరువు పొందారు. రామప్ప ఆలయానికి వెళ్లే వేళలో.. వారి ప్రాశ్చాత్య వస్త్రాల్ని వదిలేసి.. సంప్రదాయ చీరకట్టులోకి మారిపోయారు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే వీరంతా చీరకట్టులోకి మారిపోవటం.. నుదిటిన బొట్టు పెట్టుకొని.. జడలు వేసుకొని.. పూలు అలంకరించుకోవటంతో పాటు.. చేతులకు గాజులు వేసుకొన్న వైనం చూసినప్పుడు ప్రపంచ అందాలన్ని తెలుగు అందాలుగా మారిపోయిన వైనం కనిపిస్తుంది. ప్రపంచ సుందరీమణులు చీరలు కట్టుకోవటానికి వీలుగా.. వారికి సాయం చేసేందుకు 11 మంది కాస్ట్యూమ్ డిజైనర్లను సిద్ధం చేసి ఉంచారు. వారంతా అతిథులకు తగ్గట్లు చీరకట్టు అలంకారాన్ని సిద్ధం చేశారు. ఇందుకోసం మొత్తం టీం 30 నిమిషాల వ్యవధిలోనే చీరలు కట్టుకొని.. పూర్తి అలంకరణతో అచ్చ తెలుగు అమ్మాయిలుగా మారిన వైనం ఆసక్తికరంగానే కాదు.. అందరిని అకట్టుకునేలా చేసిందని చెప్పక తప్పదు.

చురకలు

## సంపాదకీయం

### ఇంతకూ జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజార్ ఎక్కడ?

మంచోళ్లతో స్నేహం చేస్తే మంచే వస్తుందని.. అదే చెడ్డోళ్లతో చేస్తే చికాకులు తప్పవంటూ మన పెద్దోళ్లు చెబుతుండేవారు. దాయాది పాక్ తాజా పరిస్థితి చూస్తే ఈ మాటల్లో నిజం ఎంతన్న విషయం ఇట్టే అర్థమవుతుంది. అర్థం లేని ఆవేశాన్ని.. అంతకు మించిన కుతంత్రాల్ని వండి వార్చే పాక్ కు తోడైన వినాశకారి జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజార్. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంలో జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజార్ గురించి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి కర్త.. కర్మ.. క్రియ అతడే. అతగాడి మూర?త్వం అతనికి ఆశ్రయం ఇవ్వటంతో పాటు.. అతని సలహాలను అమలు చేయటం ద్వారా పాకిస్తాన్ ఇప్పుడు కోలుకోలేని దెబ్బకు కారణమయ్యారన్నది మర్చిపోకూడదు. ఉగ్రవాదులకు.. ఉగ్ర క్యాంపులకు కేరాఫ్ అడ్రస్ గా పాక్ ను మార్చేసిన.. ఆ దేశ పాలకుల్ని తన గుప్పిట్లో పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరించే ఈ జైషే మహమ్మద్ చీఫ్ దెబ్బకు పహల్గాం ఉగ్రదాడి.. అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్... దీనికి ప్రతిగా పాక్ సైన్యపు దాడులు చేపట్టటం.. ఈ నేపథ్యంలో దాయాదికి తగిన రీతిలో గుణపాఠం చెప్పేందుకు వీలుగా భారత్ ప్లాన్ చేసింది. అనుకున్నట్లే తాము వేసుకున్న అంచనాలకు తగ్గట్లే పాక్ ఎయిర్ బేస్ మొదలుకొని పాక్ లోని పలు కీలక ప్రాంతాల్లో దాడులను చేపట్టింది భారత్. అయితే.. రోజులు గడుస్తున్న కొద్దీ పాక్ మీడియా మొదలుకొని అంతర్జాతీయ మీడియా వరకు పాక్ పైన భారత్ దాడులు ఎంత తీవ్రంగా ఉన్నాయన్న విషయాన్ని స్పష్టం చేశాయి. ఇదంతా ఒక ఎత్తు అయితే.. పాక్ పంచాయితీలకు అసలుసిసలు సొల్యూషన్ పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్ కు అప్పగించటమే. అయితే.. ఈ పంచాయితీ ఇప్పట్లో తెగేది కాదు. ఇంతవరకు బాగానే ఉన్నా..తాజా పరిణామానికి కారకులు ఎవరన్న ప్రశ్నకు ఎవరైనా చెప్పే సమాధానం జైషే మహమ్మద్. పాకిస్తాన్ ఎదుర్కొంటున్న తాజా దుస్థితి ఇతడి కారణంగా వచ్చిందన్నది తెలిసిందే. అతడ్ని వెనకేసుకొచ్చి.. అతను పన్నిన విష వ్యూహానికి అడ్డంగా బుక్ అయ్యింది ఆ దేశ ప్రజలు.. ప్రభుత్వమే. సైన్యం చేతిలో బొమ్మలా ఆడే పాక్ ప్రభుత్వం ఇంతకు మించి చేయగలిగింది కూడా ఏమీ ఉండదు. ఆపరేషన్ సిందూర్ లో భారీగా నష్టపోయిన జైష్ ఎ మహమ్మద్ చీఫ్ మసూద్ అజార్ వ్యక్తిగతంగా తన కుటుంబాన్ని పోగొట్టుకోవాల్సి వచ్చింది. వందకు పైగా దళ సభ్యుల్ని భారత సైన్యం జరిపిన దాడుల్లో మట్టుబెట్టాయి. కాకుంటే.. అతను మాత్రం ఈ దాడుల నుంచి తప్పించుకున్నాడు. అప్పటి నుంచి అతడి ఆచూకీ మీద ఎలాంటి వార్తలు రావట్లేదు. మరి.. అతను ఎక్కడ ఉన్నట్లు? ఏం చేస్తున్నట్లు? లాంటి ప్రశ్నలకు సమాధానాలు లేవు. ఇలాంటి వేళ.. అతను ఎక్కడ ఉండే అవకాశం ఉందన్న విషయం పై కొన్ని వర్గాలు జరిపిన శోధనలో తేలిందేమంటే.. జైష్ ఎ మహమ్మద్ ప్రధాన కార్యాలయం వెనుక భాగంలోని బంకర్ లో సురక్షితంగా ఉన్నట్లుగా చెబుతున్నారు. భారత సైన్యం జరిపిన వైమానిక దాడుల్లో అతని భార్య.. సోదరి.. ఆమె భర్త.. మేనల్లుడు.. మరో మేనకోడలు.. తన ఐదుగురు పిల్లల్ని పోగొట్టుకోవాల్సి వచ్చింది. ఇతడి కోసం వేట ప్రారంభించిన భారత ప్రభుత్వానికి దొరక్కుండా ఉండేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం అతను పాక్ లోని బహావల్పూర్లో ఉన్నట్లుగా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అయితే.. దీన్ని ఖరారు చేసే అధికారిక సమాచారం అందుబాటులో లేదు. పహల్గాం ఉగ్ర ఘటన అనంతరం ప్రధానమంత్రి మోదీ ప్రసంగిస్తూ.. ప్రపంచంలో ఏ మూలన దాక్కున్నా ఉగ్రదాడికి కారణమైన వారిని పట్టుకొంటామని.. వేటాడి మట్టుబెడతామంటూ హెచ్చరిక చేయటం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతడి వేట ఇప్పటికే కాదు.. అతన్ని నిర్మూలించే వరకు సాగుతుందని మాత్రం చెప్పక తప్పదు.కాకుంటే.. అందుకు ఎంత సమయం పడుతుందన్నదే అసలు ప్రశ్న.

## అలుపెరుగని కమ్యునిస్టు పోరాట యోధుడు మృత్యుం జయుడు - మే 16...పేరేప మృత్యుంజయుని వర్ధంతి




యజుర్వేద శాఖీయులు అయిన పేరేప వంశజులు శ్రీకాకుళానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని పేరేవ గ్రామ పరిసరాలలో పురోహితులుగా కాక, దేవాలయ ప్రతిష్ఠలు, కళ్యాణాలు చేయించే వేద పండితులుగా పేరెన్నిక గన్నారు. అలాంటి సనాతన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, పక్కా కమ్యూనిస్టుగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పేరేప మృత్యుంజయుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ త్యాగమూర్తి వర్ధంతి సందర్భంగా, లభ్యం అవుతున్న సమాచారం ఆధారంగా గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. పేరేప మృత్యుంజయుడు (అక్టోబర్ 5, 1914 - మే 16, 1950) భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో పేరేప వెంకట సుబ్బయ్య, మహా లక్ష్మిలకు 1914, అక్టోబర్ 5 న జన్మించారు. ఆచంటలో మాధ్యమిక పాఠశాల చదువయ్యాక ధవళేశ్వరం వెళ్లి మేనమామ మొక్కపాటి శేషయ్య ఇంట్లో ఉంటూ రాజమండ్రి ప్రభుత్వ మోడల్ సెకండరీ స్కూలులో చదివి, చదువయ్యాక (1933- 34లో) పి.డబ్ల్యు.డిలో రోజు కూలికి మేస్త్రీగా పని చేశారు. 1925 ప్రాంతంలో భానుమతి (1917)ని వివాహ మాడారు. 1936 లో నెక్కంటి నరసింహారావు, మీరా లతో పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న మీరాతో పాటు బస్సు కార్మికులను సంఘటిత పరచే కార్యక్రమం చేపట్టారు. 1941-42 ప్రాంతంలో యంవియన్ కపర్దీని కూడా మోటారు కార్మిక సంఘ నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. 1937-39 కాలంలో కాళీపట్నం రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సత్య నారాయణ రాజు, ఉద్దరాజు రామం లతో కలిశారు. 1940-42 కాలంలో చినమల్లం గ్రామం వద్ద 60- 70 మంది పార్టీ కార్యకర్తలకు మృత్యుం జయుడు ప్రిన్సిపాలుగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైద్ధాంతిక శిక్షణతో బాటు, ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో కొంత మిలటరీ శిక్షణ కూడా యిచ్చారు. మృత్యుం జయుడు...వ్యవసాయ కూలీలతో ఆచంట నుంచి నరసాపురం తహశీల్దారు కార్యాలయానికి 1940లో ఆకలి యాత్ర నిర్వహించారు. 1940-42 మధ్య కొంత కాలం ఆయన జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఏలూరులో జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచి వారు ఆయనను అరెస్టు చేసి, స్థానిక జిల్లా సబ్ జైలులో 15 రోజులు రిమాండులో వుంచారు. 1944 - 45లో జైలు నుంచి విడుదల అయినాక పాలకొల్లులో కాపురం పెట్టారు. నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా వుంటూ, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా ఉన్నారు. అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామ మూర్తి, చలం మొదలగు కళాకారులను ప్రజానాట్య మండలిలోకి తెచ్చింది మృత్యుంజయుడే. నెక్కల పూడి సుబ్బాయమ్మ గారితో కలిసి అన్నా చెల్లెలు పాట (బెంగాలులో కరువు) వేదికల మీద పాడే వారు. చావుకు వెరవకురా అన్న పాట తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ తదితరులు చెపుతుండే వారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య లతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పోరాటానికి సహాయం కూడ గట్టడానికి పి.సి.జోషి, పుచ్చలపల్లి సుందరయ్యలు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు. మృత్యుంజయుడు నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజుల్లో బెంగాల్ లో భీకరమైన కరువు, తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల కటకట, దొంగ నిల్వలు, దొంగ రవాణా నివారణకు కృషి చేస్తూ, ఆకలి యాత్రలు నిర్వహించారు. బెంగాలు కరువు, తెలంగాణ పోరాటం గురించి అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం మొదలగు కళాకారులతో కలిసి, ప్రజానాట్య మండలి ప్రదర్శనలు ఇచ్చేవారు. నెక్కల పూడి సుబ్బాయమ్మతో కలిసి "అన్నా చెల్లెలు" పాట (బెంగాలులో కరువుకు సం బంధించి) వేదికల మీద పాడే వారు. "చావుకు వెరవ కురా" అన్న పాట వేదికల నుంచి గంభీర స్వరంతో పాడడమే కాక, తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ చెప్పేవారు. నిజంగా జీవితంలో కూడా ఆయన "చావుకి వెరవని" వ్యక్తి. 1945-46లో పాల కొల్లులో మునిసిపల్ కార్మికుల సమ్మె జయప్రదంగా జరగతంలో ఆయన పాత్ర ఉంది. 1946లోనే సాధారణ ఎన్నికలు జరిగిన క్రమంలో, పార్టీ అభ్యర్థి తరపున పోలింగు ఏజెంటుగా మోటారు సైకిలు మీద నరసాపురం అసెంబ్లీ నియో జకవర్గం అంతా తిరిగారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య తెలంగాణ పోరాటానికి సహాయం కూడగట్టడానికి వెళ్ళిన సందరంగంలో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత, పి.సి.జోషి, పి.సుందరయ్యలు ప్రత్యేకంగా ఆయనతో చర్చలు జరిపారు. అంతకుముందు "ప్రజాశక్తి" వార పత్రిక, ద్వైవార పత్రికానున్న సందర్భంగా విరాళాలకి ప్రకటన వచ్చింది. ఆయన తనకి పెళ్లికి అత్తవారిచ్చిన వెండి మరచెంబు, కంచం అమ్మి పంపించారు. 1946లోనే మళ్లీ రహస్య జీవితం మొదలయింది. 1948లో గాంధీజీ హత్య తర్వాత మళ్లీ కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం జరిగింది. విజయవాడలో కమ్యూనిస్టు, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగగా, అరెస్టు అయి కైకలూరు సబ్ జైలులో దాదాపు 3 నెలలున్నాక తప్పించుకొని మళ్ళీ రహస్య జీవితంలోకి వెళ్ళారు. 1948లో పోలీసు చర్య తర్వాత తెలంగాణ లోనే కాక వెన్నుదన్నుగా వున్న కోస్తా ఆంధ్ర జిల్లాలలోనూ కమ్యూనిస్టు శ్రేణులు ఆత్మరక్షణ చేసుకొనే స్థితిలో పడ్డాయి. పార్టీ ఆదేశం ప్రకారం కామ్రేడ్స్ ఇతర ప్రాంతాలకి తరలి వెళ్ళారు. మృత్యుంజయుడు, సంకు అప్పారావు, మరి కొందరు, ఒరిస్సా వెళ్లేందుకు రాజమండ్రిలో ఒక రహస్య స్థావరానికి చేరారు. ఇంతలో స్థావరం యిచ్చిన వ్యక్తి ప్రభుత్వం యిచ్చే పారితోషికానికి ఆశపడి పోలీసులకి ఆచూకీ యిచ్చాడు. సుందరయ్య 'వీర తెలంగాణ విప్లవ పోరాటం- గుణపాఠాలు" ప్రకారం మిగతా వారిని పంపించి ఆయన ఖమ్మం ప్రాంతంలో పోరాట శ్రేణుల్లో చేరవలసి వచ్చింది. పట్టుబడిన వారందరూ చిత్ర హింసలకి గురయ్యారు. మృత్యుం జయుడు పట్టుబడిన కబురు తెలిసి అందరూ స్థావరం మార్చుకున్నారు."మా స్థావరం ఆయనకు తెలుసు, వచ్చి మమల్ని కలుసుకోవలసి వుంది. ఆయన ఆ బాధలు భరించినందువల్ల మే బతికిపోయాం" అని రాజేశ్వరరావు, సుందరయ్య చెప్పేవారు. 1950 మే 16 బొమ్మూ రు మొట్ట దగ్గర చనిపోయినట్లు పత్రికల సమాచారం ఇచ్చాయి. కాల్చిన యస్.ఐ తనికెల సుబ్బారావు రిటైరైన తర్వాత... ఫొటోగ్రాఫర్ భూషణ్‌ను కలిసి, కానిస్టేబుళ్ళు మృత్యుంజయుని కాల్చడానికి నిరాకరించగా తాను కాల్చవలసి వచ్చిందని, ఆఖరి గుండు పేల్చే వరకూ ఆయన జయజయ నినాదాలు చేస్తూ నిలబడి వున్నారని చెప్పినట్లు సమాచారం. అప్పటి సహచరులు, కొరియరులు ఎందరో తమ పిల్లలకు మృత్యుంజయుడు అని పేరు పెట్టు కున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర రిక్షా కార్మికులు తమ కాలనీకి మృత్యుంజయ నగర్ అని పేరు పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపు రంలో "మృత్యుంజయ నగర్ కాలనీ", గ్రంధాలయం ఏర్పడ్డాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ జర్నలిస్ట్... 9440595494**

## మే 16... మానవ రహిత అంతరిక్ష నౌక వీనస్-5 శుక్ర గ్రహపు ఉపరితలంపై అడుగుపెట్టిన దినం

మే 16, 1969%ూ% శుక్రగ్రహంపై మానవరహిత నౌక వీనస్-5 విజయ వంతంగా అడుగుపెట్టిన ఆ రోజు, అంతరిక్ష పరిశోధన చరిత్రలో ఒక చారిత్రాత్మక మైలురాయి లాగా నిలిచింది. భూమికి సమీపంగా ఉండే శుక్ర గ్రహం గురించి శాస్త్రీయంగా లోతైన సమాచారాన్ని పొందాలన్న మానవ ఆశయానికి ఇది ప్రతిఫలంగా నిలిచింది. సోవియట్ యూనియన్ అంతరిక్ష పరిశోధనలో చేపట్టిన వీనస్ ప్రోగ్రాంలో భాగంగా రూపొందించిన వీనస్-5 మిషన్, శుక్రగ్రహ ఉపరితలంపై దిగిన రెండవ విజయవంతమైన మిషన్‌గా గుర్తింపు పొందింది. 1969 జనవరి 5న బైకోనూర్ కాస్మోడ్రోమ్ నుంచి ప్రయాణాన్ని ప్రారంభించిన వీనస్-5 నౌక, సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణం తర్వాత మే 16న శుక్రగ్రహ వాతావరణంలోకి ప్రవేశించింది. ఈ మిషన్‌కు ప్రధాన లక్ష్యంగా శుక్ర గ్రహ వాతావరణాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయడం ఉండగా, పరికరాలుగా బారోమీటర్, థర్మోమీటర్, గ్యాస్ అనలైజర్, మరియు రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థలు అమర్చ బడ్డాయి. వీనస్-4 నుంచి వచ్చిన సమాచారాన్ని అధిగమించేలా, మరింత అధునాతనంగా వీనస్-5 తయారు చేయబడింది. ప్రధాన నౌక నుంచి విడిపోయిన తరువాత దాదాపు 405 కిలోల బరువు గల ల్యాండింగ్ మాడ్యూల్ ఒక పారాచూట్ ఆధారంగా శుక్రగ్రహ వాతావరణంలోకి ప్రవేశించి, దాదాపు 53 నిమిషాలపాటు శుక్రగ్రహ వాయు గోళంలో యాత్ర కొనసాగించింది. ఆ సమయంలో వాతావరణం లోని వివిధ పొరల నుంచి విలువైన డేటాను భూమికి పంపింది. క్రమంగా ఉష్ణోగ్రత



పెరగడం, వాయు పీడనం తీవ్రమవడం వంటి అంశాలను ఇది నిక్షిప్తంగా నమోదు చేసింది. వీనస్-5 ద్వారా సేకరించిన ముఖ్యమైన సమాచారం ప్రకారం, శుక్ర గ్రహ వాతావరణం 97 శాతాలకు పైగా కార్బన్ డయాక్సైడ్‌తో నిండి ఉన్నదని, ఉపరితల ఉష్ణోగ్రత సుమారు 460 నుంచి 470 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండొచ్చని, వాతావరణ పీడనం భూమిపై ఉన్నదానికంటే సుమారు 60 రెట్లు అధికంగా ఉండే అవకాశం ఉన్నదని స్పష్టమైంది. ఈ భారీ వాతావరణ ఒత్తిడి మరియు తాప ఉష్ణోగ్రతల వలన ల్యాండర్ తుది ఉపరితలాన్ని చేరిన తర్వాత ఎక్కువసేపు పనిచేయ లేక పోయింది. అయితే, వీనస్-5 అందించిన 53 నిమిషాల డేటా ద్వారా శుక్రగ్రహం మీద మనకు ఉన్న అవగాహనను విస్తరించడంలో గణనీయమైన పురోగతి సాధించబడింది. భవిష్యత్ శుక్రగ్రహ మిషన్ల రూపకల్పనకు ఇది మార్గదర్శకంగా నిలిచింది. ఈ మిషన్ విజయం సోవియట్ అంతరిక్ష సాంకేతికతను అంతర్జాతీయంగా గుర్తింపుకు నడిపించడంతో పాటు, మానవ నిర్మిత నౌకలు తీవ్రమైన గ్రహ వాతావరణాల్లో పనిచేసే సామర్థ్యాన్ని స్పష్టంగా నిరూపించింది. వీనస్-5 మిషన్ కేవలం శాస్త్రీయ పరిశోధనకు పరిమితమైనదేగాక, అంతరిక్ష పరిశోధనలో సాంస్కృతిక, రాజకీయ విభాగాలకు కూడ విలువను చేకూర్చింది. ల్యాండర్‌తోపాటు సోవియట్ జాతీయ చిహ్నం మరియు లెనిన్ బాస్-రిలీఫ్‌ను శుక్రగ్రహ ఉపరితలంపై ఉంచడం దీన్ని ఒక రాజకీయ ప్రాతినిధ్య ప్రకటనగా కూడా మార్చింది. ఈ మిషన్ ద్వారా మానవ జిజ్ఞాస శుక్రగ్రహ దాకా విస్తరించ గలదని సాక్షాత్కరించ బడింది. ఇది కేవలం ఒక అంతరిక్ష ప్రయోగం కాదు, ఒక శాస్త్రీయ విజయగాథ. గ్రహాంతర అన్వేషణలో మానవ చరిత్రలో చెరగని ముద్ర వేసిన ఘట్టం. వీనస్-5 ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా తీసుకుని మానవుడు గ్రహాల వైపు చేసే ప్రయాణాన్ని మరింత శాస్త్రీయంగా, గంభీరంగా తీర్చిదిద్దుకునే దిశగా అడుగులు వేసాడు. మే 16, 1969 అనే తేది శుక్ర గ్రహం మీద మానవ అన్వేషణ తొలి వలయాలను వేసిన ప్రత్యేకమైన దినంగా నిలిచి పోయింది. అంతరిక్ష పరిశోధన చరిత్రలో ఈ ప్రయోగం చిరస్థాయిగా చెరగని ముద్ర వేసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## కమ్యూనికేషన్ రంగానికి మూలస్తంభంగా నిలిచిన శాస్త్రవేత్త డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్ - మే 16...డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్ జయంతి

మానవ స్వరాన్ని ప్రపంచ దూరాలకు శబ్దంగా పరిచయం చేసిన సంఘటన విజ్ఞాన చరిత్రలో ఓ మైలురాయి. ఈ శబ్ద విప్లవానికి మార్గం వేసిన ఆవిష్కరణ మైక్రోఫోన్. శబ్దాన్ని విద్యుత్ సంకేతాలుగా మార్చే ఈ అద్భుత పరికరాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి చేసిన విజ్ఞాన శిల్పి డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్. ఆయన కమ్యూనికేషన్ రంగానికి మూలస్తంభంగా నిలిచిన శాస్త్రవేత్త. పేటెంట్ హక్కుల ఊహలకు అతీతంగా, పరిశ్రమలకు తన ఆవిష్కరణలు ఉచితంగా అందించాలన్న ఉదారత ఆయనను విశ్వ విజ్ఞాన మాధ్యమాల్లో చిరస్మరణీయుడిగా నిలిపింది. 1831 మే 16న బ్రిటన్‌లో జన్మించిన డేవిడ్ హ్యూస్ చిన్ననాటి నుంచే సంగీతంపై మక్కువ చూపించాడు. పియానో, మాండలిన్ వాయిద్యాల్లో ప్రావీణ్యం సాధించిన అతను, శబ్ద తరంగాల స్వభావంపై ఆసక్తితో శాస్త్రీయ అధ్యయనానికి పయనమయ్యాడు. 1838లో కుటుంబంతో కలిసి అమెరికాకు వలస వెళ్లిన హ్యూస్, కెంటుకీలోని సెయింట్ జోసెఫ్స్ కళాశాలలో సంగీత ప్రొఫెసర్‌గా స్థిరపడ్డాడు. అయితే సంగీతంలోని శబ్దతత్వం ఆయనను ఎలక్ట్రిక్ విజ్ఞాన ప్రక్రియల వైపు ఆకర్షించింది. 1855లో అభివృద్ధి చేసిన టైప్-ప్రింటింగ్ టెలిగ్రాఫ్ పరికరం హ్యూస్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది. టెలిగ్రాఫ్ ద్వారా వచ్చిన సంకేతాలను తక్షణమే అక్షరాలుగా ముద్రించ గలిగే ఈ పరికరం కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పుకు కారణమైంది. ఇది ఫ్రాన్స్, ఇటలీ, రష్యా వంటి దేశాలలో అధికారికంగా ఉపయోగించ బడింది. 1878లో హ్యూస్ రూపొందించిన కార్బన్ మైక్రోఫోన్ ఆధునిక టెలిఫోన్ వ్యవస్థకు మౌలిక పునాదిగా నిలిచింది. శబ్ద తరంగాలను విద్యుత్ ప్రవాహ మార్పులుగా మార్చే ఈ పరికరం, మానవ స్వరాన్ని కిలోమీటర్ల దూరానికి పంపించ గలిగే సామర్థ్యం కలిగింది. ఆసక్తికరమైనది ఏమంటే, హ్యూస్ తన మైక్రోఫోన్ ఆవిష్కరణకు పేటెంట్ దాఖలు చేయలేదు. శాస్త్రీయ విజ్ఞానాన్ని వ్యక్తిగత లాభానికి ఉపయోగించకుండా, సమాజానికి అందించిన ఉదారత ఆయన గొప్పతనానికి నిదర్శనం. వైర్‌లెస్ కమ్యూనికేషన్ పై కూడా హ్యూస్ విశేష ప్రయోగాలు నిర్వహించాడు. 1879లో 500 గజాల దూరానికి వైర్‌లెస్ సంకేతాలను ప్రసారం చేయగలిగిన ఆయన, హర్ట్స్, మార్కోని కంటే ముందే రేడియో తరంగాలను ప్రయోగాత్మకంగా అన్వేషించాడు. కానీ, ఈ పరిశోధనలకు తగినంత శాస్త్రీయ ప్రామాణికత అందలేదన్న కారణంతో, ఆ కీర్తి ఆయనకు దక్కలేదు. అయినా ఆయన అభివృద్ధి చేసిన ఇండక్షన్ బ్యాలెన్స్ పరికరం ఆధారంగా భవిష్యత్తులో మెటల్ డిటెక్టర్లు రూపొందించ బడ్డాయి. తన ఆవిష్కరణలకు గుర్తింపుగా హ్యూస్ 1880లో బ్రిటన్ రాయల్ సొసైటీ ఫెలోగా ఎంపికయ్యాడు. 1885లో రాయల్ మెడల్‌తో సత్కరించ బడ్డాడు. ఫ్రాంక్లిన్ ఇనిస్టిట్యూట్ సహా అనేక అంతర్జాతీయ శాస్త్రీయ సంస్థల నుంచి గౌరవాలు అందుకున్నాడు. అయినప్పటికీ, శాస్త్రానికి సేవ చేయాలన్న లక్ష్యం ఒక్కటే ఆయన్ని నడిపించింది. 1900 జనవరి 22న హ్యూస్ లండన్‌లో పరమ పదించాడు. ఆయన సాధించిన విజ్ఞాన పునాదులు టెలి కమ్యూనికేషన్, రేడియో, టెలివిజన్, మైక్రోఫోన్, డిజిటల్ ఆడియో వ్యవస్థల్లో నేటికీ ప్రాణంగా కొనసాగుతున్నాయి. శబ్దాన్ని విద్యుత్ భాషలో మార్చిన ఆయన సృష్టి, మానవ సంభాషణలకి సుదూర సంబంధాలే కాదు - సమాజానికి శాశ్వతమైన శబ్ద సంబంధాన్ని అందించిందని చెప్పడంలో సందేహమే లేదు.



**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## డెంగ్యూ గురించి అవగాహన అవసరం - మే 16...జాతీయ డెంగ్యూ దినోత్సవం




ప్రతి సంవత్సరం మే 16న భారత దేశంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం దేశవ్యాప్తంగా ప్రజల్లో డెంగ్యూ జ్వరం గురించి అవగాహన పెంచడం, నివారణ చర్యలను ప్రోత్సహించడం, అలాగే ఈ వ్యాధి యొక్క ప్రమాదకర తీవ్రతను గుర్తించి సకాలంలో చికిత్స తీసుకోవాలన్న సందేశాన్ని కలిగించడం. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించ బడతాయి. డెంగ్యూ, డెంగ్యూ వైరస్ వల్ల కలిగే వైరల్ జ్వరం. ఇది ముఖ్యంగా ఏడిస్ ఈజిప్టి మరియు ఏడిస్ ఆల్బోపిక్టస్ అనే దోమల ద్వారా వ్యాపిస్తుంది. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత నీటి నిల్వలు పెరిగిన నేపథ్యంలో ఈ దోమల ఉత్పత్తికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడి, డెంగ్యూ వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఇటీవల జనాభా పెరుగుదల, వాతావరణ మార్పుల కారణంగా దేశ వ్యాప్తంగా డెంగ్యూ కేసులు ఏడు రోజూ పెరిగి పోతున్నాయి. ఇది ఇప్పుడు ఒక పెద్ద ప్రజా ఆరోగ్య సమస్యగా మారింది.

డెంగ్యూ లక్షణాలలో అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక భాగంలో నొప్పి, శరీరంలో ఎరుపు మచ్చలు, వాంతులు, రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటాయి. కొంతమందిలో ఈ జ్వరం తీవ్రమైన రూపంలోకి మారి, రక్తపోటు తక్కువ కావడం, అంతర్గత రక్తస్రావం వంటి పరిస్థితులకు దారి తీయగలదు. అంతుచిక్కని ముప్పుగా మారే ఈ వ్యాధిని ఎదుర్కోవాలంటే ముందుగానే గుర్తించడం, జాగ్రత్త చర్యలు తీసుకోవడం చాలా అవసరం. డెంగ్యూ నివారణకు వ్యక్తిగత, కుటుంబ, సామాజిక స్థాయిలో చర్యలు అత్యంత అవసరం. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమలు ఉత్పత్తి అయ్యే తాత్కాలిక నీటి నిల్వలను తొలగించడం, వారానికి ఒక రోజు డ్రై డే పాటించి నీటి పాత్రలను ఖాళీ చేయడం వంటి చర్యలు చాలా ప్రభావ వంతంగా ఉంటాయి. దోమల కాటు నుండి రక్షణ కోసం పూర్తిగా శరీరాన్ని కప్పే బట్టలు ధరించడం, దోమలు నివారించే కాయిల్‌లు, క్రీములు వాడటం, దోమ తెరలు ఏర్పాటు చేయడం వంటి ప్రతిరక్షణ చర్యలు కూడా కీలకం. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల్లో డెంగ్యూపై చైతన్యం కలిగించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ముఖ్యంగా పోస్టర్లు, కరపత్రాల పంపిణీ, ప్రజలతో సమావేశాలు, ర్యాలీలు, డెంగ్యూ నివారణపై ప్రదర్శనలు జరుగుతాయి. ఆరోగ్య శాఖ డెంగ్యూ పట్ల ముందస్తుగా చర్యలు తీసుకునేలా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తోంది. ఈ సంవత్సరం జాతీయ డెంగ్యూ దినోత్సవం థీమ్ "%ూష్ ఝుతీశ్రీఎ, ్రాతీవజవత్ ణవఅస్త్రబవ: జశ్రీఝఅ ాబతీతీశీబఅస-ఱఅస్త్రం, ఎఝశ్రీష్ట్రఎ ాఱజఱఅస్త్ర%"గా ప్రకటించ బడింది. దీని ద్వారా ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు పాటించడం, తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన జీవన శైలిని పాటించడం ద్వారా డెంగ్యూను నివారించ గలమన్న సందేశం నొక్కి చెబుతోంది. డెంగ్యూ నివారణ ప్రభుత్వది మాత్రమే బాధ్యత కాదు. ప్రతి ఇంటి స్థాయి నుంచి సామూహిక స్థాయికి, ప్రతి వ్యక్తి నుంచి సమాజం వరకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించి నప్పుడే డెంగ్యూపై విజయం సాధించగలం. మే 16న జరిగే జాతీయ డెంగ్యూ దినోత్సవం కేవలం ఒక ఆరోగ్య దినోత్సవంగా కాకుండా, సమిష్టిగా తీసుకోవాల్సిన కార్యాచరణ దిశగా మారాలని ఆశిద్దాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చురకలు

శుక్రవారం 16 మే 2025

# ఇసుకాసురులు ఇష్టారాజ్యం

జమ్మికుంట: మానేరు పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోతుంది. జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలోనే నెలకు 20 నుంచి 30 ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొంటున్నా.. యజమానులు, డ్రైవర్లలో మార్పు రావడంలేదు. అక్రమార్కులపై కేసులు పెట్టినా దందా ఆపడంలేదు. జిల్లా ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తే తప్ప ఈ రవాణాను కట్టడి చేయలేరని పలువురు చర్చించుకుంటున్నారు.

**నిత్యం వందల ట్రాక్టర్లలో..**

మానేరు పరీవాహక ప్రాంతంలో ఇసుక సులువుగా లభించడంతో అక్రమార్కులు వ్యాపారంగా మలుచుకున్నారు. జమ్మికుంట మండలం విలాసాగర్‌లో ఇసుక రవాణాను జీవనోపాధిగా మలుచుకున్నారంటే విస్మయాన్ని కల్గిస్తుంది. ఉదయం 3 గంటల నుంచే ట్రాక్టర్లలో నింపిన ఇసుకను జమ్మికుంట మీదుగా తరలిస్తున్నారు. సెల్‌ఫోన్ల ద్వారా సమాచారాన్ని చేరవేసుకుంటూ అధికారుల కదలికలపై డ్రైవర్లు అప్రమత్తమవుతున్నారు. ఉదయం పరిమితికి మించిన వేగంతో ఇచ్చే ట్రాక్టర్లతో వాకర్స్ ఆందోళన పడుతున్నారు.

**దూరాన్ని బట్టి ధర**హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మండలం విలాసాగర్, తనుగుల, గండ్రపల్లి, శంభునిపల్లి, వావిలాల, నాగారం, వీణవంక మండలం చల్లూరు, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, పోతిరెడ్డిపల్లి, కొండపాక, హుజూరాబాద్ మండలం కందుగుల, చెల్పూర్‌తోపాటు తదితర ప్రాంతాల నుంచి నిత్యం 300 నుంచి 700 ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిపోతుంది. ట్రాక్టర్ ఇసుకకు రూ.2,500 నుంచి రూ.5 వేల దాకా తీసుకుంటున్నారని



నిర్మాణ యజమానులు చెబుతున్నారు.

**ప్రభుత్వ నిర్మాణాల సాకు చూపి**

ప్రభుత్వ భవన నిర్మాణాలకు ఇసుకను తరలిస్తున్నట్లుగా ట్రాక్టర్‌కు పలువురు ఫ్లెక్సీలు కట్టుకొని దందా సాగిస్తున్నారు. విలాసాగర్ మానేరు ప్రాంతంలో సోమవారం జమ్మికుంట తహసీల్దార్ రమేశ్‌బాబు దాడులు నిర్వహించి 5 ట్రాక్టర్లను పట్టుకొన్నారు. వీణవంక మండలం మల్లారెడ్డిపల్లిలోనూ ఇదే పరిస్థితి. వావిలాల మానేరు ప్రాంతాన్ని ఇటీవల ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పరిశీలించారు. అక్రమ రవాణా కాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిఘా కఠినతరం చేస్తే దందాకు తెరపడనుందని భావిస్తున్నారు.

**నిఘా పెడుతున్నాం**

విలాసాగర్ మానేరు ప్రాంతం నుంచి అధికంగా రవాణా జరుగుతుంది. పోలీసులు, అధికారులు ప్రభుత్వం అనుమతి లేని ట్రాక్టర్లను పట్టుకొని కేసు పెట్టినా పరిస్థితిలో మార్పు రావడంలేదు. ఇటీవల విలాసాగర్ మానేరు ప్రాంతంలో సిబ్బందితో దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నా.. మరలా రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి తీసుకువచ్చింది. క్షేత్రస్థాయి నుంచి నిఘాను కట్టుదిట్టం చేసి అరికట్టేలా చూస్తాం. రమేశ్‌బాబు తహసీల్దార్, జమ్మికుంట

# సర్కారు బడి పిలుస్తోంది

పెద్దపల్లి : శిథిలావస్థలో భవనాలు.. పెచ్చులూడుతున్న గోడలు.. అస్తవ్యస్తంగా విద్యుత్తు వ్యవస్థ.. తాగునీటి ఎద్దడి.. ఒంటికి, రెంటికి ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి.. ఇలాంటి సమస్యలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. ఏటా రూ.కోట్లలో నిధులు మంజూరవుతున్నా పనుల్లో ప్రగతి కనిపించడం లేదు. ప్రస్తుత విద్యాసంవత్సరం ముగిసి వేసవి సెలవులు ఆరంభమైన నేపథ్యంలో తిరిగి తెరిచేనాటికైనా మౌలిక వసతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దాదాపు ఒకటిన్నర నెలల పాటు సెలవులుండగా ఈలోగా పనులు చేపడితే విద్యార్థుల వెతలు తీరనున్నాయి.

**ఏళ్ల తరబడి అసంపూర్తిగానే..**

కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణం మూడేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. నిధులు లేకపోవడంతో పనులను వదిలేశారు.

ఓదెల మండలం పొత్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్ల పనులను అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద నామమాత్రంగా చేపట్టడంతో ఇబ్బందులు నెలకొన్నాయి.

పాలకుర్తి మండలం జయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాలలో కిచెన్ షెడ్డు పనులు ఏడాదిగా సా..గుతున్నాయి.

జిల్లాలో 498 పాఠశాలల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు చెబుతుండగా ఎక్కడా అందుబాటులోకి రాలేదు.

విద్యార్థులు లేకపోవడంతో 29 పాఠశాలలు తెరచుకోవడం లేదు.



సమీప ప్రాంతాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు.

**రూ.50 కోట్లకు పైగా బకాయిలు**

జిల్లాలో నాలుగేళ్ల క్రితం 'మన ఊరు, మన బడి'లో ఎంపికైన 191 పాఠశాలల్లో పనులు చేపట్టగా చాలా చోట్ల ఇప్పటికీ పూర్తి కాలేదు. ఉపాధిహామీలో మంజూరైన మరుగుదొడ్లు, ప్రహరీ, కిచెన్ షెడ్ల పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ఉన్నత పాఠశాలల్లో భోజనశాలలు నిర్మించినా డ్యూయెల్ బెంచీలు సరఫరా చేయకపోవడంతో వృథాగా మారాయి. రూ.50 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. 583 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో రూ.25 కోట్లతో పనులు అసంపూర్తిగా మిగిలాయి. రూ.15 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. సెలవుల్లో మేల్కొంటేనే విద్యార్థులకు వెతలు తీరనున్నాయి.

**ప్రాధాన్యతా పనులు చేస్తున్నాం**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనులకు బిల్లులు నిలిచిపోయాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రాధాన్యతా పనులు చేస్తున్నాం. మాధవి, జిల్లా విద్యాధికారి

# కల్వలకు గండి.. మరమ్మతులకు ఎన్నాళ్లండి ?

శంకరపట్నం: శంకరపట్నం మండలం కల్వల ప్రాజెక్టు ద్వారా శంకరపట్నం, వీణవంక మండలాలకు సాగు నీరందుతోంది. ఈ ప్రాజెక్టు కింద 2040 ఎకరాలు సాగవుతాయి. ప్రాజెక్టు ఎగువ, దిగువన అనధికారికంగా సుమారు 10 వేల ఎకరాలకు సరిపడా సాగు నీటి లభ్యత ఉంటుంది. 2023 జులైలో కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వరద పోటెత్తడంతో మత్తడి వద్ద భారీ గండి పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు మరమ్మతులపై యంత్రాంగం దృష్టి సారించడం లేదని.. వచ్చే నెలలో వర్షాలకు కురిస్తే తమ ఆయకట్టు పరిస్థితి ఏంటని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పూడ్చుకుంటే మళ్లీ కన్నీరే**

గండి పడిన తర్వాత రూ.7 లక్షల నిధులతో తాత్కాలిక రింగ్‌బండ్ నిర్మాణం చేపట్టినా వరద ధాటికి తెగిపోయింది. ఆయకట్టు రైతులు తమ భాగస్వామ్యంతో సాగు నీటి అవసరాల కోసం రూ.6 లక్షలు వెచ్చించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ముందుకు సాగారు. వరి పైర్లు చివరి దశలో ఉన్న సమయంలో ఎస్సారెస్పీ నీరు ప్రాజెక్టులోకి భారీగా చేరటంతో రింగ్‌బండ్ మళ్లీ ధ్వంసమైంది. ఆ సమయంలో పంటలను కాపాడుకోవటానికి రైతులు అనేక కష్టాలు పడ్డారు.

శాశ్వత మరమ్మతు పనుల కోసం అధికారులు చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. రెండేళ్లు గడచినా.. ప్రజాప్రతినిధులు ప్రాజెక్టును క్షేత్ర స్థాయిలో సందర్శించినా నిధులు మాత్రం మంజూరు కాలేదని రైతులు వాపోతున్నారు. ఈ వేసవిలో శాశ్వత మరమ్మతు పనులు పూర్తవుతాయని రైతుల ఆశపడినా.. ఆ దిశగా అడుగులు పడకపోతుండటం రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. వర్షాలు పడితే వరద ఉద్ధృతికి ప్రాజెక్టు పరిస్థితి ఏంటని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అవసరమైన నిధులు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన శాశ్వత మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రాజెక్టు మరమ్మతు పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించామని చిన్ననీటి పారుదలశాఖ డీఈఈ కవిత పేర్కొన్నారు. శాశ్వత పనులకుగాను సర్వే చేపట్టి నివేదించామని.. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే పనులు జరిగేలా శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాగుకు ఇబ్బందులు

ప్రాజెక్టు నిర్మాణం తర్వాత సాగునీటి కొరత చూసిన సందర్భాలు లేవు. గండి పడటంతో పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు వేసవి కాలం ముగియక ముందే గండి పూడ్చివేతపై దృష్టి సారించాలి. చుంచు సమ్మయ్య, రైతు, కల్వల

రైతుల్లో ఆందోళన రెండుసార్లు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా పూర్తి స్థాయిలో పంటలు సాగుకు నోచుకోలేదు. నీరు నిల్వ లేక సాగు, తాగు నీటి కష్టాలు తప్పడం లేదు. ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నా నిధులు రాకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ముద్దం మల్లయ్య, రైతు, కల్వల

# మేల్కొనకపోతే కష్టాలే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని నగరాలు.. పట్టణాల్లో చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది.. ప్రతి రోజు టన్నుల కొద్దీ వెలువడుతున్న వ్యర్థాలతో డంపింగ్ యార్డులు నిండిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఇవన్నీ ప్రమాదకర స్థాయికి చేరితే పరిస్థితి ఏమిటో తెలియని ఆందోళన నెలకొంది. కరీంనగర్‌లో అయితే డంపింగ్ యార్డులో చెత్త పోసేందుకు కూడా స్థలం లేదు.. పైగా ఎండ వేడికి, గాలి దుమారానికి మంటలు అంటుకొని పొగ వ్యాపిస్తుండటంతో సమీప కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారు.. యార్డును ఇక్కడి నుంచి తరలించాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేస్తున్నారు. నగరానికి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ స్థలాల్లో చెత్త నిల్వలు తరలించేందుకు ప్రయత్నిస్తే.. ఆ ప్రాంతవాసులు అడ్డుకుంటున్నారు.. రోజూ వస్తున్న చెత్తను ఎక్కడ నిల్వ చేయాలో తెలియక అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

**వివిధ పట్టణాల్లో ఇలా..**

కరీంనగర్ నగర పరిధిలో డంపింగ్ యార్డులో చెత్త పేరుకుపోయి పరిస్థితి దారుణంగా మారడంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు ప్రారంభించారు. రెండు నెలలుగా 31వ డివిజన్‌లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించేలా కార్మికులతోపాటు ఇంటి యజమానులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ ఆటోల ద్వారా వేరుగా సేకరించి తరలించేలా తనిఖీలు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా అపార్టుమెంట్లు, హోటళ్ల నుంచి తడి, పొడి వేరు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. రామగుండం నగరపాలికలో డంపింగ్‌యార్డు నిండుతుండగా, పొడి చెత్తను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగిస్తున్నారు.

పెద్దపల్లిలో చెత్తంతా తీసుకెళ్లి గుట్టల పక్కన ఉన్న డంపింగ్ యార్డులో పోస్తున్నారు. బయోమైనింగ్ పని చేయకపోగా, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ జరగడం లేదు.

జగిత్యాలలో బయో మైనింగ్ చేస్తున్నా, తడి, పొడి చెత్త వేరు చేయడం లేదు.

కోరుట్ల, సిరిసిల్లలో తడి, పొడి చెత్త వేరు చేయడంతోపాటు బయోమైనింగ్ ద్వారా చెత్తను వేరు చేసి తరలిస్తున్నారు. తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేస్తున్నారు.

జమ్మికుంట, హుజూరాబాద్‌లో తడి, పొడి వేరు చేస్తుండగా పొడి చెత్త డంపింగ్ యార్డుకు, తడితో ఎరువు తయారీకి వినియోగిస్తున్నారు.

వేములవాడలో డంపింగ్ యార్డు గుట్టల మధ్యన ఉండగా చెత్త అంతా అక్కడికే తరలిస్తున్నారు.

మెట్‌పల్లిలో రెండు డంపింగ్ యార్డులు ఉండగా పొడి వస్తువులను వేరు చేసి మిగతాది యార్డులో నిల్వ చేస్తున్నారు.

**ఇలా సేకరిస్తేనే..**

ఇంటి యజమానులు తడి, పొడి చెత్త వేరుగా ఇవ్వడం, చెత్త ఆటోల ద్వారా అలాగే తరలించడం ద్వారా వ్యర్థాలు ఎక్కువ పేరుకుపోకుండా చూసుకోవచ్చు.

తడి చెత్తను కంపోస్టుగా తయారు చేయడం ద్వారా సద్వినియోగం చేసుకోవచ్చు.

పొడి చెత్తలో ప్లాస్టిక్ వస్తువులు, అట్టలు, కాగితాలు, ఇనుప ముక్కలు, ఇతరత్రా వస్తువులన్నీ వేరు చేసి విక్రయించుకునేలా ప్రోత్సహించాలి.

# చేపల కొలను.. ఉపాధికి దన్ను



చొప్పదండి: గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి కూలీలకు చేతినిండా పని కల్పించడంతోపాటు మత్స్యకారులకు ఏడాది పొడవునా చేపలను పెంచుతూ ఉపాధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకంలో చేపల కొలనుల తవ్వకాలు చేపడుతోంది. దీంతో చెరువులు, కుంటల శిఖం భూమి పరిరక్షణకు దోహదపడటంతో పాటు కూలీలకు, మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. జిల్లాలో అనువైన చెరువులు, కుంటల సమీపంలో శిఖం భూములు, నీటిని తరలించేందుకు వీలున్న ప్రాంతాలను అధికారులు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో జిల్లాలో ఈ ఏడాది మొదటి విడతలో భాగంగా 260 చెరువుల్లో పనుల ప్రారంభానికి అనుమతులు వచ్చాయి. దీంతో వాటిని వెంటనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేస్తున్నారు.

**రూ.291.45 చొప్పున కూలీ**

జిల్లాలోని 16 మండలాల పరిధిలో 83,215 జాబ్‌కార్డులు ఉండగా 1,27,644 మంది కూలీలున్నారు. చేపల కొలనుల నిర్మాణానికి 12 లక్షల పని దినాలను కేటాయించారు. చెరువులకు 100 నుంచి 300 మీటర్ల దూరంలో 25 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల లోతుతో తవ్వుతున్నారు. ఒక్కో కొలను నిర్మాణానికి రూ.6.5 లక్షల నుంచి 8 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇందులో పనిచేసిన కూలీలకు ప్రతీ క్యూబిక్ మీటరుకు రూ.291.45 చొప్పున కూలీ ఇవ్వనున్నారు. ప్రధాన చెరువులోని నీరు చేపల చెరువులోకి రాకుండా నాలుగు వైపులా కట్టలు నిర్మిస్తున్నారు.

భూగర్భ జలాల వృద్ధి

రానున్న వర్షాకాలంలో వాన నీటిని నిల్వ చేసుకోవడానికి చేపల కొలనులు దోహదపడతాయి. నీరు నిలువ ఉండడంతో భూగర్భ జలాల వృద్ధి పెరుగుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో ఈ నీరు సాగుకు ఎంతో ఉపయోగపడతాయి. కొలనులోని మట్టిని పొలాల్లో వేసుకోవడంతో భూసారం పెరుగుతుంది. చేపల పెంపకంతో మత్స్యకారులకు అదనపు ఆదాయంతోపాటు మార్కెట్‌లో డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా పెరుగుతుంది. చెరువుల శిఖం భూములు అన్యాక్రాంతం కాకుండా ఉంటాయి. సద్వినియోగం చేసుకోవాలిజిల్లాలో ఉపాధి పనుల్లో భాగంగా చేపల కొలనులను విస్తృతంగా చేపడుతున్నాం. పనులు పురోగతిలో ఉన్నాయి. ఇవి పూర్తయితే మత్స్యకారులకు ఎంతో ఉపయుక్తంగా ఉండనున్నాయి. సద్వినియోగం చేసుకోవాలి.

వేణుమాధవ్‌రెడ్డి, ఇన్‌ఛార్జ్ డీఆర్డీవో

# దాయమ్మా.. ఇదేం పనమ్మా..?

రెడ్‌హిల్స్ : ఆమె చారిత్రక నిలోఫర్ ఆసుపత్రిలో దాయమ్మగా పని చేసే శాలిని. ప్రస్తుతం లిఫ్ట్ ఆపరేటర్‌గా చేస్తోంది. రెండు పెద్ద సంచులతో విధుల్లోకి వచ్చింది. లిఫ్ట్‌లో వెళ్లే క్రమంలో ఆమె ప్రవర్తనను గమనించిన ఆసుపత్రిలో విధుల్లో ఉండే పోలీసులకు అనుమానం వచ్చింది. ఆమెను అడ్డుకొని ప్రశ్నించారు. వారిపైనే చిందులు తొక్కింది. పోలీసులు మహిళా భద్రతా సిబ్బందిని పిలిపించి సంచులను తెరిచి చూశారు. రూ.6 వేలు, రూ.7 వేల ఖరీదు చేసే ఇంజెక్షన్లు, సిరంజీలు, ఖరీదైన మందులు బయటపడ్డాయి. మరో సంచిలో కరెన్సీ నోట్లు కనిపించాయి. మందులు ఎక్కడివని ప్రశ్నిస్తే కోఠి నుంచి కొనుక్కొని వచ్చానని చెప్పింది. శాలిని వద్ద దొరికిన



మందులన్నీ ఆసుపత్రిలోనివేనని వైద్యాధికారులు, పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళలో ఆసుపత్రికి వచ్చే రోగులకు కొన్నిసార్లు మందుల్లేవని బయటకు పంపిస్తుంటారని రోగుల తాలుకు బంధువులు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మందులకు మెడికల్ షాప్‌కు వెళ్లి వచ్చేసరికి సమయం మించిపోతోంది. అలాంటి వారిని లక్ష్యంగా చేసుకొని, రెట్టింపు డబ్బులు తీసుకొని మందులు అమ్ముతున్నట్లు కొందరు చెప్పారు. డ్యూటీ ఆర్‌ఎంఓ ఒకరు ఈ ఘటనపై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్పష్టంగా లేదని పోలీసులు చెప్పినట్లు సమాచారం. ఆమె దగ్గర దొరికిన మందులను స్వాధీనం చేసుకున్నారు. సూపరింటెండెంట్ ద్వారా ఫిర్యాదు పంపించాలని పోలీసులు సూచించినట్లు తెలిసింది.

# ముంపు ముప్పు.. ఏమేరకు ఉండొచ్చు..?

కొత్తగూడెం: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ అంశం మరోసారి చర్చనీయాంశమవుతోంది. ఈ ప్రాజెక్ట్ వెనుక జలాల (బ్యాక్ వాటర్) వల్ల ముంపు ముప్పును అంచనా వేయటానికి తృతీయ పక్ష సర్వేకు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ) అంగీకరించింది. పోలవరం ప్రాజెక్ట్ వెనుక జలాల ముంపు ప్రభావాన్ని అధ్యయనం చేయాలని కేంద్ర జలసంఘానికి తాజాగా లేఖ రాసింది. తృతీయపక్ష సర్వేకు ముందే హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ల బృందం భద్రాచలంలో పర్యటించనుంది. 'పోలవరం' ప్రభావం తెలంగాణపై ఏమేరకు ఉంటుందో తేల్చాలని.. భద్రాచలం రామాలయానికి ఏర్పడే ముప్పుపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఈఏడాది జనవరిలో అధికారులను ఆదేశించారు. ఏటా వర్షాకాలంలో గోదావరి వరదల వల్ల భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం మండలాల ప్రజలు భయం గుప్పిట్లో జీవనం సాగిస్తుంటారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే ముంపు ముప్పు ఏమేరకు ఉంటుందనే దానిపై ఐఐటీ ప్రొఫెసర్ల బృందం అధ్యయనం చేయనుంది.

**సమగ్రంగా అధ్యయనం చేస్తేనే..**

ఇటీవల పీపీఏ భేటీలో తెలంగాణ తరఫున నీటిపారుదలశాఖ అధికారులు వాదనలు వినిపించారు. ప్రధానంగా పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యంపై ప్రస్తావించారు. కిన్నెరసాని, ముర్రేడువాగు ఇతర ప్రవాహాలతో పాటు భద్రాచలం, బూర్గంపాడు పట్టణాలపై పోలవరం వెనుకజలాల ప్రభావం, రామాలయం వద్ద నీటిమట్టం, మణుగూరు భారజల ప్లాంట్ వద్ద నీటి నిల్వపై సమగ్రంగా అధ్యయనం చేయాలని అథారిటీని కోరారు.

పోలవరం ప్రాజెక్ట్ ఎత్తును 45.72 మీటర్లు (150 అడుగులు)గా రూపొందించారు. దీని నీటి విడుదల సామర్థ్యం 50లక్షల క్యూసెక్కులు. తెలంగాణ ప్రాంత నాయకులు ఈ ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించాలని కోరుతున్నారు. తద్వారా భద్రాచలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ముంపు ముప్పును తగ్గించవచ్చునని చెబుతున్నారు.

**తెరపైకి భిన్నవాదనలు**

భద్రాచలం ముంపునకు పోలవరం ప్రాజెక్ట్ కారణం కాదని కొందరు వాదిస్తున్నారు. గోదావరి నది సహజ భౌగోళిక స్థితి, పాపికొండల వద్ద గోదావరి నది వెడల్పు తగ్గటం, శబరి నది సంగమం వల్ల ముంపు ముప్పు ఏర్పడుతుందని చెబుతున్నారు. పోలవరం వెనుక జలాలు భద్రాచలం వద్ద వరద తీవ్రతను పెంచవచ్చునని, 1986 కంటే ఎక్కువ ముంపు ఉండవచ్చునని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈనేపథ్యంలో పోలవరం ప్రాజెక్ట్ వల్ల ముంపు సమస్య ఏమేరకు ఉంటుందనేదానిపై అధికారులు సమగ్ర సర్వే నిర్వహించాలని, వెనుక జలాలతో ఏర్పడే ముప్పుపై వాస్తవ వివరాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

# పాలనలో పారదర్శకత.. అభివృద్ధికి పెద్దపీట

కొత్తగూడెం : పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు. వాటి పురోగతితోనే అభివృద్ధి సాధ్యం. గ్రామాల స్వయం సమృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో 'నూతన పంచాయతీరాజ్ చట్టం-2018' మార్పులు తెచ్చింది. సంస్కరణల్లో భాగంగా అధికారాలు, బాధ్యతలతో పాటు ప్రత్యేక నిధులు దక్కడంతో సర్పంచులు కీలకంగా మారారు. జిల్లాలోని వివిధ గ్రామాలు ఉత్తమ పనితీరుతో అవార్డులను సాధించాయి. నేడు 'పంచాయతీరాజ్ వ్యవస్థాపక దినోత్సవం' సందర్భంగా ఆయా విశేషాలపై ప్రత్యేక కథనం. గల తండాలు, గూడేలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. 274 నుంచి 478కి సంఖ్య ఎగబాకింది. రాష్ట్ర ప్రభుత్వ, ఆర్థిక సంఘం నిధుల్ని నేరుగా కేటాయిస్తుండగా, మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. జనాభా ప్రతిపాదికన గ్రామానికి రూ.5 లక్షలకు తక్కువ కాకుండా బడ్జెట్ విడుదలవుతోంది. బాధ్యతల్లో విఫలమైనా, నిధులు దుర్వినియోగమైనా సర్పంచుల్ని బాధ్యుల్ని చేయటం ద్వారా పాలనలో పారదర్శకత పెరిగింది. స్థానిక స్టాండింగ్ కమిటీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. వీధి దీపాలు, వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డుల నిర్వహణ,పారిశుద్ధ్యం, హరితహారం కార్యక్రమాలకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటవగా, వీటి పర్యవేక్షణ పాలకవర్గాల్లో పారదర్శకతను పెంచింది.

పౌర బాధ్యతలు ప్రతి కుటుంబం తమ ఆవరణలో కనీసం ఐదు మొక్కలు నాటాలి. చెత్తను రహదారులు, కాల్వల్లో వేయొద్దు. అనుమతి లేకుండా ఇష్టానుసారంగా చెట్లను నరికివేయొద్దు. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయొద్దు. నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలి.

అనుభవజ్ఞుల భాగస్వామ్యంజిల్లా, మండల పరిషత్, పురపాలికల తరహాలో కొత్తగా కో-ఆప్షన్ సభ్యుల్ని నియమిస్తున్నారు. ఈ పాత్రలో విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు, గ్రామ సమాఖ్య మహిళా సంఘాల అధ్యక్షులు, ఎన్నారైలు, ఇతర ప్రముఖులు గ్రామాభివృద్ధికి పునరంకితమవుతున్నారు.

ఇదీ సంగతి..మండలాలు: 21 గ్రామ పంచాయతీలు: 478 వార్డులు: 4,232 జనాభా: 8,38,153 (2011 జనాభా లెక్కల ప్రకారం)

చురకలు



# ఏటా హరిత లక్ష్యం సంరక్షణలో నిర్లక్ష్యం

సారంగాపూర్ : ఏటా లక్ష్యాన్ని నిర్దేశించుకొని మొక్కలు నాటడంలో చూపుతున్న శ్రద్ధ.. సంరక్షణలో మాత్రం చూపకపోవడంతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది. జిల్లాలోని 380 పంచాయతీల్లో 37.44 లక్షలు(2025-26) నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. కొన్నేళ్లుగా జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా దాదాపు 27,972 ప్రాంతాల్లో సుమారు మూడు కోట్ల మొక్కలు నాటినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఏటా లక్ష్యం నిర్దేశించడంతో స్థలాలు లేకపోవడంతో నాటిన ప్రాంతాల్లోనే మళ్లీ నాటాల్సి వస్తోంది. కొన్ని నర్సరీలలో మొక్కలు అలాగే ఉండిపోయి ఏపుగా పెరిగి వృక్షాలుగా మారుతుండగా వాటిని తొలగించి మళ్లీ మొక్కల పెంపకం చేపట్టాల్సి వస్తోంది. నాటేందుకు లక్ష్యం విధించకుండా నాటిన మొక్కలను సంరక్షించినప్పుడే వన మహోత్సవం విజయవంతం కానుంది.

**ప్రజాధనం వృథా**

నర్సరీలలో మొక్కల కోసం విత్తనాలు విత్తినప్పటి నుంచి పెంపకం వరకు నిర్లక్ష్యం కనిపిస్తోంది. నర్సరీలలో అవసరమైన మొక్కలు పెంచకపోవడంతో పక్కన పడేయాల్సి వస్తోంది. నిబంధనలకు అనుగుణంగా కూలీలు గుంతలు తవ్వినప్పుడే మొక్క ఎదుగుదల ఉంటుంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధి సిబ్బంది గుంతలను ఇష్టానుసారంగా తవ్వుతున్నారు. కమ్యూనిటీ, ప్లాంటేషన్, హరిత వనాలలో గుంతను 0.45 సెం.మీ. లోతు, వెడల్పు ఉండాలి.



రహదారుల వెంట 2 ఫీట్లు(0.6 సెం.మీ) గుంత తప్పకుండా తవ్వాలి. కూలీ ఒక గుంత తవ్వినందుకు రూ.23, మొక్క నాటినందుకు రూ.15 చెల్లిస్తున్నారు. ఇంత మొత్తం వ్యయం చేసినా నిబంధనలకు అనుగుణంగా ఉండడంలేదన్న విమర్శలున్నాయి. ఏటా విద్యుత్తు తీగల కింద మొక్కల నాటడంతో ఎదిగిన మొక్కలను తొలగిస్తున్నారు. మళ్లీ అదే ప్రాంతంలో నాటడంతో ప్రజాధనం వృథా అవుతోంది.

**కోతుల ఆహార ప్రాంగణాలు ఎక్కడ..?**

గతంలో కోతుల కోసం ఆహార ప్రాంగణాలు, పల్లె ప్రజలకు ఆహ్లాద వాతావరణం కోసం పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి వనాలు, రహదారుల వెంట ఉన్న మొక్కలు కనిపిస్తున్నా.. మిగతా హరిత వనాలు, కోతుల ఆహార ప్రాంగణాలు ఎక్కడా కనపడకుండా పోయాయి. పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి ఇంటికి అయిదు మొక్కల చొప్పున లక్ష్యం కోసం అందిస్తున్నారే తప్పా.. వారికి అవసరమైన మొక్కలను అందించకపోవడంతో తీసుకున్న వెంటనే పక్కన పడేస్తున్నారు. ఇంటి ఆవరణలో స్థలం లేనప్పటికీ మొక్కలు అందించడంతో వృథా అవుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

# మహిళా సంఘాలకు భరోసా

మెట్‌పల్లి : మహిళా సంఘాల అభ్యున్నతికి గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోంది. సంఘాల్లోని సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తోంది. ఇది వరకే రూ.కోట్ల రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులు వివిధ వ్యాపారాల్లో రాణిస్తున్నారు. వారిలో వ్యాపార నైపుణ్యాన్ని పెంపొందించి ఆర్థికాభివృద్ధి సాధించడానికి మరింత భరోసా కలిగేలా సెర్ప్, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) ద్వారా స్టాండర్డ్ విలేజ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్(స్వెప్) కార్యక్రమం అమలుకు జిల్లాలో మూడు మండలాలను ఎంపిక చేశారు.

రుణాలు పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలనేది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. కిరాణం, టైలరింగ్, బ్యూటీపార్లర్, దుస్తుల విక్రయ కేంద్రం, పిండి గిర్ని, పాడి పశువుల పెంపకం తదితర జీవనోపాధికి అవసరమైన యూనిట్లను మహిళలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా మహిళా శక్తి కింద క్యాంటీన్లు, ఇతర సూక్ష్మ పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. వ్యాపారాలను విస్తృతపర్చడంలో అనుకున్నంత ముందంజ వేయలేకపోతుండడంతో గ్రామీణ మహిళల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు కనిపించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో వ్యాపార రంగంలో మహిళలకు మరింత నైపుణ్యం, మార్కెటింగ్ మెలకువలపై అవగాహన పెంపొందించి ఆర్థికాభివృద్ధి చెందేలా ఎన్ఆర్ఎల్ఎం ద్వారా స్వెప్ కార్యక్రమం అమలు చేయడానికి నిర్ణయించారు. జిల్లాలో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాలను ఎంపిక చేసి బ్లాక్‌గా ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో



స్వెప్ కార్యక్రమం అమలు చేస్తూ మహిళలకు సేవలందించేందుకు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఎంటర్‌ప్రెన్యూర్(సీఆర్పీ ఈపీ)ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల మెట్‌పల్లిలో వీరి ఎంపికకు అవసరమైన గ్రూప్ యాక్టివిటీ, చర్చ, పరీక్షలను నిర్వహించారు.

**ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు**

మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాల బ్లాక్‌లో 25 మంది సీఆర్పీ ఈపీలను నియమించనున్నట్లు తెలుస్తోంది. ఎన్ఆర్ఎల్ఎం ద్వారా సీఆర్పీ ఈపీలు మహిళల ఆర్థిక ఎదుగుదలకు పని చేయాల్సి ఉంటుంది. మహిళలు ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న, కొత్తగా ఏర్పాటు చేసే సూక్ష్మ పరిశ్రమలను విస్తృతపర్చడం, వ్యాపార నిర్వహణపై అవగాహన పెంపొందించి అవసరమైన రుణాలు ఇప్పించి సాంకేతిక సహకారం అందించాల్సి ఉంటుంది.మొదట మూడు మండలాలను ఎంపిక చేసి కార్యక్రమం అమలు చేసి మహిళా సంఘాల సభ్యుల ఆదాయాభివృద్ధికి తోడ్పాటునందించే దిశగా అడుగులు వేస్తున్నారు.

# మరో 39 మురుగు నీటి శుద్ధి కేంద్రాలు



హైదరాబాద్: నగరంలో మురుగునీటి శుద్ధికి భారీ కార్యాచరణ చేపట్టనున్నారు. ఓఆర్ఆర్ లోపల 972 ఎంఎల్‌డీల సామర్థ్యంలో మరో 39 ఈ శుద్ధి కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. అమృత్ 2.0లో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ ఎస్టీపీల టెండర్ ప్రక్రియ తుదిదశకు చేరింది. త్వరలోనే శంకుస్థాపనకు జలమండలి ఏర్పాట్లు చేస్తోంది. మూసీ ప్రక్షాళనలో భాగంగా వందశాతం మురుగునీటి శుద్ధి లక్ష్యంగా జలమండలి ముందుకెళ్తోంది. హైబ్రీడ్ యాన్యూటీ మోడల్ (హ్యాం) విధానం నిర్మించనున్న ఈ ఎస్టీపీల టెండరు ప్రక్రియపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి సమీక్షించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**నేరుగా చెరువుల్లోకి మురుగు**

ఎస్టీపీల ఏర్పాటుతో పాటు ఓఆర్ఆర్ లోపల అనేక ప్రాంతాల్లో సరైన మురుగునీటి వ్యవస్థ లేదు. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నేరుగా చెరువుల్లోకి మురుగంతా చేరేలా వ్యవస్థలున్నాయి. చెరువులు మురుగుతో నిండిన తరువాత మూసీలోకి చేరుతోంది. మూసీ ప్రక్షాళన నేపథ్యంలో ఈ 39 ఎస్టీపీలు అందుబాటులోకి వస్తే వందశాతం మురుగు నీరు శుద్ధి అవుతుంది.

**ఉస్కబావి వద్ద పెద్దది**

కొత్తగా నిర్మించనున్న వాటిలో ఉస్కబావి ఎస్టీపీ పెద్దది. తిమ్మక్క చెరువు వద్ద 98.5 ఎంఎల్‌డీల సామర్థ్యం, పీర్జాదిగూడ 61, నార్సింగి ఓఆర్ఆర్ 34.5, నాగారం 47.5, కుంట్లూరు 31.5, తెల్లాపూర్ 31 ఎంఎల్‌డీలు, నల్లచెరువు వద్ద మరొకటి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, హైదర్‌షా కోట వద్ద 36.5 ఎంఎల్‌డీ సామర్థ్యం గల మూడు, బాపూఘాట్ సంగం వద్ద 31 ఎంఎల్‌డీల ఎస్టీపీలు నిర్మించనున్నారు. ఇవికాకుండా అమీన్‌పూర్, ఇక్రిశాట్, గండిగూడెం, యమ్నంపేట, ఈదుల చెరువు, ఉమ్దాసాగర్, సందానచెరువు, ఫతేనగర్, చిత్రపురికాలనీ తదితర ప్రాంతాల్లో కొత్త ఎస్టీపీలు రానున్నాయి.

వివరాలు (రూ.కోట్లలో..)

ప్రాజెక్టు వ్యయం 3,849
నిర్మాణ సంస్థ వాటా 1,028
కేంద్ర వాటా 645
రాష్ట్రం వాటా 897
పదేళ్లపాటు నిర్వహణ అంచనా వ్యయం 1,279

# ఉపాధి.. మరింత పారదర్శకం



దౌల్తాబాద్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న పనులపై మరింత పారదర్శకత తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. గ్రామస్థాయిలో నిర్వహించే పనులపై ఊరూరా నిఘా కమిటీలను వేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధిలో మొట్టమొదటిసారిగా గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో గ్రామాల్లో జరిగే పనులపై ఈ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారు. తద్వారా అవినీతికి అడ్డుకట్ట పడి పనులపై స్పష్టత ఉండేందుకు వీలు కలుగుతుంది. ఉపాధి హామీ పథకంలో ఏటా కోట్ల రూపాయలతో పనులు సాగుతున్నాయి. వీటిపై ఏడాదికోమారు సామాజిక తనిఖీ చేసి అవినీతిని గుర్తిస్తున్నారు. కానీ అవినీతి సొమ్మును రికవరీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. కానీ ఈ కమిటీలతో అవినీతిని మొదటనే అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

**వారానికోసారి పరిశీలిస్తారు**

ఉపాధి పనులను కమిటీలు వారానికోసారి పరిశీలించి పనులు జరుగుతున్న తీరు, మంజూరు, కూలీల హాజరు, చెల్లింపులు తదితర వివరాలను గుర్తించి మండల పరిషత్ అధికారులకు వివరాలు అందజేస్తారు. ఇక నుంచి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సామాజిక తనిఖీలు నిర్వహిస్తారు. ప్రతి నెలా మొదటి వారంలో తనిఖీలు నిర్వహించాలని పనుల వివరాలను అందజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే తనిఖీల్లో వెల్లడైన రికవరీ నిధులను తాత్సారం చేయకుండా రాబట్టాలని తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది. ఈ కమిటీలలో మండల ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, మహిళా అధ్యక్షురాలు, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు, ఒక ఉపాధి కూలీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ గ్రామాల్లో జరిగే ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో వారానికోమారు పరిశీలిస్తాయి. ఈ నివేదికను మండల పరిషత్ అధికారికి అందజేస్తారు. వారు జిల్లా అధికారులకు పంపిస్తారు.

**జవాబుదారీతనం పెరుగుతుంది**

ఉపాధిహామీ పథకంలో గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయం లాభదాయకం. దీంతో గ్రామస్థాయిలో నిర్వహించే పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుంది. మొదట్లోనే అవినీతికి అడ్డుకట్ట పడుతుంది. త్వరలోనే అన్ని గ్రామాల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశాం. సరళ, ఏపీడీ, వికారాబాద్.

జిల్లాలో కూలీల వివరాలు

మొత్తం జాబ్ కార్డులు.. 2.41 లక్షలు
పనులు చేస్తున్న కూలీలు.. 1.60 లక్షలు
నిత్యం పనులకు వస్తోంది.. 70,330 మంది

# చెప్పేవారే లేరు.. చదువులెలా..!

బషీరాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ బోధన ఉండాలనే ఉద్దేశంతో గతేడాది జిల్లాలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ కళాశాలను ప్రారంభించారు. విద్యార్థులకు బోధించేందుకు లెక్చరర్లను మాత్రం నియమించలేదు. ఫలితంగా గత విద్యా సంవత్సరం కళాశాలలో చేరిన విద్యార్థులు కొందరు ప్రైవేటు కళాశాలలకు వెళ్లిపోగా.. మిగిలిన విద్యార్థులను సమీప ప్రభుత్వ కళాశాలకు పంపించి బోధన చేయించాల్సి వచ్చింది. ఈఏడాదైనా పూర్తి స్థాయి లెక్చరర్లను నియమించి బోధన సవ్యంగా సాగేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**తాత్కాలిక భవనాలు కేటాయించారు**

జిల్లాకు మారుమూలన ఉన్న బషీరాబాద్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ కళాశాల మంజూరు చేసి తాత్కాలిక భవనాలు కేటాయించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాళ్లను నియమించారు. పదోతరగతి పరీక్ష ఫలితాలు కాగానే ప్రకటనలు చేసి విద్యార్థులను కళాశాలలో చేర్పించుకున్నారు. మొదటి సంవత్సరం కావడంతో ఒక్కో కళాశాలలో 50-60 మంది వరకు ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ వంటి కోర్సుల్లో ప్రవేశం పొందారు. కొత్తగా ప్రారంభించిన నాలుగు ప్రభుత్వ కళాశాలలో మొదటి ఏడాది బోధన సక్రమంగా సాగలేదు.

**50 శాతానికి పైగా బాలికలే..**

మండలానికి దూరంలో ఉండే పట్టణాలకు వెళ్లలేని బాలికలు ప్రభుత్వ కళాశాలలో చేరారు. నాలుగు కళాశాలల్లో 50శాతానికి పైగా మహిళలే ప్రవేశం పొందారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని కళాశాలలో 42 మంది విద్యార్థులు గతేడాది ప్రవేశం పొందితే 30 మంది బాలికలే ఉన్నారు. రెండు నెలల పాటు వేచి చూసిన విద్యార్థులు కొందరు ప్రైవేటుకు వెళ్లిపోయారు. మిగతావారు తాండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదిలో కూర్చొని పాఠాలు విని 80శాతం




విద్యార్థులు పాసయ్యారు. ముగ్గురు బాలికలు 90శాతం మార్కులు సాధించడం గమనార్హం.

**బోధించేవారు లేకపోతే ఏంలాభం**

రవాణా సౌకర్యం ఇబ్బందిగా ఉంటుందని స్థానికంగా ఏర్పడిన ప్రభుత్వ కళాశాలలో మా కూతుర్ని చేర్పించాం. లెక్చరర్లను నియమించలేదని, తాండూరుకు పంపించారు. పాఠాలు చెప్పేవారు లేకపోతే కళాశాల ప్రారంభించి ఏంలాభం.. శ్రీనివాస్, రైతు, బషీరాబాద్.

లెక్చరర్లు వస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది

గతేడాదే కళాశాల ప్రారంభమైంది. ఈఏడాది లెక్చరర్లను నియమిస్తారని ఉన్నతాధికారులు వివరించారు. తద్వారా మరింత సంఖ్య పెరిగే అవకాశం ఉంది. 25కిలోమీటర్ల దూరంలో ఉన్న తాండూరుకు వెళ్లలేని వారు ఇక్కడ చదువుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.నర్సింహారెడ్డి, ప్రిన్సిపల్, ప్రభుత్వ కశాశాల, బషీరాబాద్

# పెద్దాసుపత్రికి నూతన హంగులు

జగిత్యాల : ఎన్నో ఏళ్లుగా ఆధునికీకరణకు నోచుకోకపోయిన జనరల్ ఆసుపత్రి ఎట్టకేలకు నూతన హంగులు సంతరించుకుంది. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని రూ.29 లక్షలతో ఆధునికీకరించారు. మూడు నెలలుగా ఆసుపత్రిలో చేపట్టిన పనులు ముగింపు దశకు చేరాయి. జిల్లా ఆవిర్భావం తరువాత ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కేంద్ర ఆసుపత్రిగా.. ఆ తరువాత ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో అనుబంధంగా సాధారణ ఆసుపత్రిగా హోదాలు మారినా సదుపాయాలు విస్తరించలేకపోయారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఆసుపత్రి వైద్యులతో సమీక్ష నిర్వహించి రూ.1.50 లక్షలు మంజూరు చేశారు. ఆసుపత్రి నిధులు రూ.29 లక్షలు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టారు.

**అత్యాధునిక సేవలు..**

ఆసుపత్రిలో కొన్నేళ్లుగా ఆక్సిజన్ ప్లాంటు నిర్వహణ లేక పనిచేయడం లేదు. సాంకేతిక నిపుణులతో మరమ్మతు చేపట్టడంతో పూర్తిస్థాయిలో రోగులకు ఆక్సిజన్ కొరత తీర్చడమే కాకుండా ప్రతినెలా కొనుగోలు వ్యయం రూ.లక్ష ఆదా అవుతోంది. ఆసుపత్రిలో 9 వెంటిలేటర్లున్నప్పటికీ తరచూ సాంకేతిక సమస్యలుండేవి వాటిని సైతం పూర్తిస్థాయిలో బాగు చేయించారు. రెండు జనరేటర్లలో ఒకటి మరమ్మతుకు గురికాగా ఆధునిక సాంకేతిక వినియోగించి రెండింటిని సరిచేసి రోగులకు నిరంతర విద్యుత్తు అందజేస్తున్నారు. కొత్తగా 7 వీల్‌చైర్లు, 5 స్ట్రెచర్లు కొనుగోలు చేశారు.ఆసుపత్రి భవనంలోపల వెలుపల రంగులు వేశారు. వరండాల్లో స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారగా మరమ్మతు చేశారు. గదులు, వార్డుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ)తో తీర్చిదిద్దారు.



ఆసుపత్రిలో ప్రధాన సమస్య పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోగా ప్రత్యేక మురుగుకాల్వలు నిర్మించారు. మూత్రశాలల పైపులైనుకు మరమ్మతు చేశారు. రోగులకు తాగునీరందించే శుద్ధజల యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చారు.

**90 శాతం పూర్తి: డాక్టర్ సుమన్‌రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్**

మూడు నెలలుగా ఆసుపత్రిలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. 90 శాతం మేరకు పూర్తయ్యాయి. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపడంతో పాటు ఆసుపత్రి నిధులు వెచ్చించి మరమ్మతు పనులు చేపట్టాం. అన్ని విభాగాల్లోనూ వైద్యులున్నారు. వైద్య కళాశాలలో 50 పడకల ఆసుపత్రి పూర్తయితే సేవలు అక్కడికి తరలించే అవకాశం ఉంది.

**సేవలు వినియోగించుకోవాలి: డాక్టర్ విజయ్, ఆసుపత్రి ఆర్ఎంవో**

ఆధునికీకరణ తరువాత రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చాయి. సాధారణ వైద్యం, శస్త్రచికిత్సలు, ఫిజియోథెరపీ అన్నింట్లోనూ సేవలందిస్తున్నాం. క్యాజువాలిటీలో ఇన్‌ఫెక్షన్లు రాకుండా అధునాతన యంత్రం ఏర్పాటు చేశాం. వేసవి తీవ్రత దృష్ట్యా ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు, కూలర్లు సైతం అందుబాటులో ఉంచాం.

# లీకేజీల 'పురం' పర

సూర్యాపేట : పురపాలికల్లో ఇంటింటికీ శుద్ధజలం అందిస్తామని మిషన్ భగీరథ పైపులైన్లు వేసి నల్లా కనెక్షన్లు ఇచ్చారు. వచ్చేదే తక్కువ.. దానికి తోడు లీకేజీలతో నీరంతా వృథా అవుతోంది. వెరసి పట్టణవాసులు నీటిపాట్లు పడుతున్నారు. ఇక శివారు కాలనీల బాధలు చెప్పలేకుండా ఉన్నాయిజిల్లాలోని పురపాలికల్లో పరిశీలించింది..

**డిమాండ్ మేరకు సరఫరా లేక**

హుజూర్‌నగర్ పురపాలిక పరిధిలో పలు కాలనీలకు 20 రోజులకోసారి నీరు రాని పరిస్థితి. పట్టణానికి 50 ఎంఎల్‌డీలు అవసరం కాగా 30 ఎంఎల్‌డీ మాత్రమే గ్రిడ్ నుంచి సరఫరా జరుగుతోంది. లీకేజీలతో అన్ని ప్రాంతాలకు సరిపోవటం లేదు. హుజూర్‌నగర్ పురపాలికలో 7,350 నల్లా కనెక్షన్లున్నాయి. ఇతర వనరులతో మరో 2,627 కనెక్షన్లకు నీరు అందజేస్తున్నారు. సీతారాంనగర్, అంబేద్కర్ కాలనీ ఇంకా పలు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారానైనా నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

**అల్లాడుతున్న శివారు కాలనీలు**

సూర్యాపేట పట్టణంలోని బాషానాయక్‌తండాలో ఐదేళ్ల కిందట పైపులైన్ నిర్మించినా నేటికీ నీటి సరఫరా జరగటం లేదు. స్థానికంగా బోరునీటిని వినియోగించుకుంటున్నారు. తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. మానసనగర్, అంజనాపురి కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్ తదితర శివారు కాలనీకు నీటి సరఫరా సరిగా జరగటం లేదు. మిషన్ భగీరథ అధికారులు నిత్యం 19 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు. బాషానాయక్‌తండాలో కనెక్షన్ అనుసంధానం చేయించి సరఫరా చేయిస్తామని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

**పైపులైన్లు దెబ్బతిని..**

నేరేడుచర్ల పురపాలికలో విలీన గ్రామాలైన రామగిరి, నర్సయ్యగూడెంలకు నీటి సరఫరా జరగడం లేదు. రామగిరి వద్ద పైప్‌లైన్‌లు దెబ్బతిన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తేనే నీటి సరఫరా జరిగే అవకాశం లేదు. పైప్‌లైన్ పగిలిపోవడంతో నర్సయ్యగూడెంకి చాలాకాలం మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో బోరు నీటితో ట్యాంకు నింపి నీరు సరఫరా చేస్తున్నారు. నర్సయ్యగూడెం పైప్‌లైన్ మరమ్మతులు చేస్తామని భగీరథ ఏఈ శ్రీనాథ్, పురకమిషనర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

**కోదాడలో రోజు విడిచి రోజు**

పట్టణంలో రోజు విడిచి రోజు నీటిని ఇంటింటికి ఇస్తున్నారు. పట్టణానికి మొత్తం 12.55 ఎంఎల్‌డీ నీరు డిమాండ్ ఉన్నప్పటికి కేవలం 6.5 ఎంఎల్‌డీ మాత్రమే వస్తోంది. నీరు సరిపోక బోరు నీటిని కూడా అధికారులు ఇంటింటికి ఇస్తున్నారు. అవి భగీరథ, బోరు, బావుల నీరా అర్థం కావట్లేదని జనం వాపోతున్నారు.

**నీటి లీకేజీలతో తిప్పలు**

తిరుమలగిరి పురపాలికకు మిషన్‌భగీరథ రావాల్సిన నీటి కంటే తక్కువగా వస్తున్నాయి. లీకేజీలు, పైపులైన్ పగుళ్లతో సుందరయ్యకాలనీ, అనంతారంలోని జంగాలకాలనీ, బీసీకాలనీలకు తరచూ నీటి సమస్యలు తలెత్తున్నాయి. వలిగొండ-తొర్రూరు రోడ్డువెడల్పు పనులతో పైపులైన్లు పగిలి బీసీకాలనీకి నీరు రావడం లేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. మార్కెట్ యార్డు ఎదుట, మల్లీశ్వరి థియేటర్, తహసీల్దార్ కార్యాలయం వెళ్లేదారుల్లో లీకేజీలతో నీరు వృథాగా పోతుంది. మిషన్ భగీరథ సిబ్బందితో త్వరలో లీకేజీలు సరిచేస్తామని పురకమిషనర్ బి.యాదగిరి చెప్పారు.

చురకలు



## ఉద్యానం.. నిర్వహణ అధ్వానం

పెద్దపల్లి : ఆహ్లాదకర వాతావరణం కోసం వెళ్లే ఉద్యానవనాలు అధ్వానంగా మారాయి. పట్టణాల్లో ఇళ్ల మధ్యన ఉన్న పార్కులను అభివృద్ధి చేసినప్పటికి నిర్వహణ లేక అఘ్లోరం కరవవుతోంది. రూ.లక్షలు ఖర్చు చేసినా ఆట పరికరాలు, వస్తువులు పాడయ్యాయి. కొన్ని పురపాలికల్లో ఇప్పటికీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వేసవి సెలవుల్లో పిల్లలను టీవీలు, చరవాణులకు అతుక్కుపోకుండా సాయంత్రం పూట పార్కులకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తుండగా అవి నిర్వహణ లేక ఇబ్బందికరంగా ఉంది.

**ఇదీ పరిస్థితి** రామగుండం నగరపాలిక పరిధిలో రూ.3.5 కోట్ల వ్యయంతో గౌతమినగర్, దుర్గానగర్, గంగానగర్, ఇందిరమ్మ కాలనీ, ప్రీకే రామయ్య కాలనీల్లో ఉద్యానవనాలు ఏర్పాటు చేసినప్పటికీ దుర్గా నగర్, గౌతమి నగర్, టీచర్స్ కాలనీల్లో పూర్తి చేయగా ఇందిరమ్మ కాలనీ, ప్రీకే రామయ్య కాలనీల్లో నిరుపయోగంగా మారాయి. కొన్నింటిలో ఆట వస్తువులు శిథిలం కాగా, పచ్చదనం కనిపించదు. నిర్వహణ కోసం రూ.10 లక్షలు ఖర్చు చేసినా నీటి వసతి లేదు. టీచర్స్ కాలనీలో చెట్లు పెరగడంతో పాములు తిరుగుతున్నాయి. పెద్దపల్లిలో మూడు పార్కులు ఉండగా మినీ ట్యాంక్ బండ్, చిల్డ్రన్ పార్కు బాగున్నాయి. క్రిస్టియన్ కాలనీలోని పిల్లల పార్కు 8 ఏళ్ల కిందట రూ.6 లక్షలతో నిర్మించారు. దీనిని ప్రారంభించకుండానే శిథిలమైంది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 18 పార్కులు ఉన్నాయి. వీటికి రూ.7 కోట్లు కేటాయించారు. పద్మానగర్, బుట్టి రాజారాం కాలనీ, జ్యోతినగర్ శివ థియేటర్ దగ్గర అసంపూర్తి పనులు చేశారు. కొన్ని చోట్ల ఆట పరికరాలు విరిగిపోగా, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. న్యూశ్రీనగర్ కాలనీ, అలకాపురి, బ్యాంకు కాలనీ, జ్యోతినగర్, వావిలాలపల్లి, సప్తగిరి కాలనీ, మంకమ్మతోట, హౌసింగ్ బోర్డు కాలనీ, ఏవోనీ కాలనీ, జడ్పీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో నిర్వహణ వదిలేశారు.

హుజూరాబాద్‌లో లవ్ హుజూరాబాద్ సెల్ఫింగ్ పాయింట్, మున్సిపల్ పార్కులో ఆడుకునే వస్తువులు పాడయ్యాయి. ఫౌంటెయిన్, కొలను పని చేయడం లేదు.జమ్మికుంటలో మొత్తం మూడు పార్కులుండగా పాత మున్సిపల్ ఉద్యానవనంలో విగ్రహాలు, బొమ్మలు, ఊయలలు విరిగిపోయాయి. జగిత్యాల పట్టణంలో రెండు పార్కులు ఉండగా రోటరీ పార్కుకు ఐదేళ్లలో రూ.కోటి వెచ్చించినా ఆట వస్తువులు పాడయ్యాయి. హౌసింగ్ బోర్డులో రూ.50 లక్షలు ఖర్చు చేసి ప్రహరీ, మొక్కలు ఏర్పాటు చేయగా జారుడు బల్ల తప్ప పిల్లలకు వేరే ఆట వస్తువులే లేవు.కోరుట్ల పట్టణంలో రెండు పార్కులుండగా పిల్లల పార్కును రూ.25 లక్షలతో అభివృద్ధి చేశారు. రూ.40 లక్షలతో వాగు స్థలంలో నాలుగేళ్ల కిందట పనులు ప్రారంభించగా మధ్యలో వదిలేశారు. ప్రస్తుతం పిల్లలు ఆడుకోవడానికి జూనియర్ కళాశాల మైదానం ఒక్కటే అందుబాటులో ఉంది.పరిశీలించిన నగరాలు: 2

పట్టణాలు : 7

మొత్తం పార్కులు : 46

అధ్వానంగా ఉన్నవి : 19

## భౌగోళిక గుర్తింపు దక్కేనా?

కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలో ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాలకు ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లాలో తువ్వాలలు, దుప్పట్లు, చీరలు, ధోవతులు, షర్టింగ్ వస్త్రాలు చేనేత సహకార సంఘాల్లో తయారీ అవుతున్నాయి. ఇక్కడ ఉత్పత్తి అయ్యే వస్త్రాలను టెస్కోతోపాటు ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తారు. ముఖ్యంగా ప్రతి శనివారం కరీంనగర్ నేతబజారులో విక్రయిస్తుంటారు.

జిల్లాలో ఉత్పత్తి అయ్యే డబుల్ క్లాత్ దుప్పటికి ప్రత్యేకత ఉంది. కరీంనగర్‌లోని రెండు ఆదర్శ సహకార సంఘాలు కొత్తపల్లి, హుజూరాబాద్ చేనేత సహకార సంఘాల్లో వీటిని ఉత్పత్తి చేస్తున్నారు. వీటిని చెద్దర్లుగా కూడా పిలుస్తారు. ఒక్కోటి అరకిలో బరువు ఉంటాయి. ఎక్కువ కాలం మన్నుతాయి. దాదాపు 12 ఏళ్ల వరకు వీటిని వినియోగించుకునే అవకాశముంది. మేలు రకమైన పత్తితో తయారు చేస్తుండటంతో మెత్తగా, నాణ్యతగా ఉంటాయి.

ఇవి రెండు వైపులా వస్త్రంతో తయారవుతాయి. వీటికి భౌగోళిక గుర్తింపు ట్యాగ్‌ను ఇవ్వాలని చెన్నైలోని కార్యాలయంలో దరఖాస్తు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పలు రకాల ఉత్పత్తులకు ట్యాగ్ కావాలని దరఖాస్తు చేయగా, అందులో కరీంనగర్ కూడా ఉంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే ఈ దుప్పటి తెలంగాణలోని ఏ జిల్లాలోనూ ఉత్పత్తి కావడం లేదు.జీఐ ట్యాగ్ ఇవ్వాలని జిల్లా చేనేత శాఖ ద్వారా మూడు నెలల కిందట ఒక నివేదికతో కూడిన దరఖాస్తులను సమర్పించినట్లు జిల్లా చేనేత శాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్ తెలిపారు. ట్యాగ్ వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## ఉపాధి కూలీలకు గిట్టుబాటు

సారంగాపూర్ : జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేశారు. 380 పంచాయతీల్లో పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూలీల వేతనాన్ని రూ.307కు పెంచడంతోపాటు కూలీలు తప్పకుండా పనులకు వెళ్లాలన్న నిబంధనలతో జాబ్ కార్డు కలిగినవారంతా పనులకు వెళ్తున్నారు. వారికి కూలి గిట్టుబాటు అయ్యేలా చూడాలని అధికారులు ఉపాధి సిబ్బందిని ఆదేశిస్తున్నారు.

పెరిగిన సంఖ్య గ్రామాల్లో ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లే వారి సంఖ్య పెరిగింది. జిల్లాలో 1,65,700 కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉండగా ఆయా కుటుంబాలలో 1,97,962 (పురుషులు–1,33,822, మహిళలు–1,64,140) మంది కూలీలు ఉన్నారు. ఆయా కుటుంబాలకు ఏడాదిలో 100 రోజులు తప్పకుండా పనులు కల్పించేందుకు ఇప్పటి నుంచే అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 15 రోజుల్లోనే 5.07 కుటుంబాలకు పనులు చూపించారు. ఆయా కుటుంబాలలో సగటున ప్రస్తుతం రూ.249.49 వేతనం చెల్లించారు. 10 పనులు ఇప్పటికే పూర్తి చేయగా, 12,465 పనులు కొనసాగుతున్నాయి. అత్యధికంగా మేడిపల్లి మండలంలో రూ.297.21 వేతనాన్ని చెల్లించగా, అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో రూ.164.49 మాత్రమే చెల్లించారు. కనీస గిట్టుబాటు కల్పించేలా ఉపాధి సిబ్బంది కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామం నుంచి అయిదు కిలోమీటర్ దూరం వెళ్లిన కూలీలకు అదనంగా చేసిన కూలీకి అదనంగా 10శాతం చెల్లిస్తున్నారు. దీనివల్ల కొడిమ్యాల మండలంలో ఒక్కో కూలీకి ప్రభుత్వం అందించే కూలీ కలుపుకుని రూ. 320.63 రావడం విశేషం. వివరాలకు ప్రత్యేక యాప్ కేంద్రం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టినప్పటికీ ఎక్కడో ఓచోట అవకతవకలు జరుగుతూనే ఉన్నాయి. కూలీలు, పనుల వివరాలు, వేతనాలు జమ తెలుసుకునేందుకు నానావస్థలు పడాల్సి వస్తోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కేంద్రం కూలీల కోసం ప్రత్యేకంగా 'జన్‌మన్‌రేగా' అనే యాప్‌ను అందుబాటులో ఉంచింది. ఈ యాప్ తెలుగుతోపాటు ఇతర భాషల్లోనూ ఉంటుంది. రాష్ట్ర, జిల్లా, పంచాయతీ, కుటుంబం, జాబ్ కార్డు సంఖ్య నమోదు చేసుకోవాలి. దీనిద్వారా ఎన్ని పనిదినాలు చేశారు.. ఏ బ్యాంకులో నగదు జమ అయిందో వివరాలు కనిపిస్తాయి. ప్రస్తుతం ఆత్మీయ భరోసాకు కనీసం 20 రోజుల పనిదినాలు పూర్తి చేయాలన్న నిబంధన ఉండడంతో కూలీ దినాలు పూర్తి చేసిన వివరాలు తెలుసుకునేందుకు ఎంతగానో యాప్ ఉపయోగ పడనుంది.

## మధ్య మానేరులో 7.17 టీఎంసీల నిల్వ



బోయినపల్లి : రాజరాజేశ్వర జలాశయం(మధ్యమానేరు) నుంచి నీటి విడుదల నిలిచిపోయింది. యాసంగిలో పంటల సాగు కోసం మధ్యమానేరు జలాశయం నుంచి దిగువన ఎల్ఎండీ, కుడి, ఎడమ కాలువతోపాటు, మల్కపేట రిజర్వాయర్‌కు నీటిని తరలించారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడం, పంట కోతలు ప్రారంభం కావడంతోపాటు మిషన్ భగీరథ తాగు నీటి అవసరాల దృష్ట్యా నీటి విడుదలను నిలిపివేశారు. జలాశయంలో ప్రస్తుతం నీటి నిల్వ 7.17 టీఎంసీలకు చేరింది. బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 27.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రాజరాజేశ్వర జలాశయం పంటల సాగులో అన్నదాతలకు ప్రధాన ఆదరువుగా మారింది. జలాశయం నుంచి దిగువన ఎల్ఎండీ జలాశయం, కుడి, ఎడమ కాలువలతోపాటు అన్నపూర్ణ జలాశయం, మల్కపేట రిజర్వాయర్, వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం గుడి చెరువు, మిషన్ భగీరథకు నీరు వెళ్తుంది. జలాశయానికి ప్రధానంగా ఎస్సారెస్పీ, కాళేశ్వరం, ఎల్లంపల్లి, మానేరు, మూలవాగుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారం. యాసంగిలో ఎల్ఎండీ జలాశయం, మధ్యమానేరు జలాశయం కుడి కాలువ కింద ఆయకట్టు పంటలకు నీరు అందించాలని అధికారులు నిర్ణయించారు. ఎల్ఎండీ జలాశయానికి 16 టీఎంసీలు, కుడి కాలువకు 6 టీఎంసీల నీటిని వదలాలని అక్కడి అధికారులు కోరారు. వరి నాట్లు, ఇతర పంటల సాగు ప్రారంభమైననాటి నుంచి రైతుల అవసరాల మేరకు నీటి విడుదల ప్రారంభించారు. కుడి కాలువ కింద సుమారు 60 వేలు, ఎడమ కాలువ కింద సుమారు 4 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని అధికారులు పేర్కొన్నారు.

**71.082 టీఎంసీల ఇన్‌ఫ్లో 69.315 అవుట్‌ఫ్లో**

జలాశయానికి 1 జూన్ 2024 నుంచి 71.082 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఇందులో ఎల్లంపల్లి నుంచి 23.816 టీఎంసీలు, ఎస్సారెస్పీ 31.266, మానేరు మూలవాగు నుంచి 16.040 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఇదే సమయంలో జలాశయం నుంచి దిగువన ఎల్ఎండీ జలాశయానికి 40.245 టీఎంసీలు అన్నపూర్ణ జలాశయానికి 20.766, మల్కపేట రిజర్వాయర్‌కు 0.160, కుడి కాలువకు 3.905 ఎడమ కాలువకు 0.018, మిషన్ భగీరథ (ఈవీపీ కలిపి) 4.221 టీఎంసీల నీరు వదిలారు.

**తాగునీటి అవసరాలకు**

పంట కోతలు ప్రారంభం కావడంతో జలాశయం నుంచి నీటి విడుదలను నిలిపివేశాం. జలాశయంలో ప్రస్తుతం 7.17 టీఎంసీల నీరు నిల్వ ఉంది. యాసంగిలో పంటలకు ఎల్ఎండీ, కుడి కాలువతో పాటు ఎడమ కాలువ, మల్కపేట రిజర్వాయర్‌కు నీటిని తరలించాం. మిషన్ భగీరథ తాగు నీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. జలాశయానికి ఇన్‌ఫ్లో ప్రారంభమైతేనే నీటి విడుదల ఉంటుంది.

జగన్, ఈఈ మధ్యమానేరు

## రెండో వంతెన పూర్తయ్యేనా!



వేములవాడ : వేములవాడ మూలవాగులో అసంపూర్తి రెండో వంతెన నిర్మాణం పనులకు గత నెలలో తిరిగి భూమి పూజ చేసినప్పటికీ ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ఎప్పుడు మొదలవుతాయనే అనుమానాలను పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం ఆరంభంలో పనులు మొదలు పెడితే భారీ వర్షాలకు గతంలో లాగే మళ్లీ కొట్టుకు పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఈ వంతెన నిర్మాణం పనులు గత రెండేన్నరేళ్లుగా వివిధ కారణాలతో అసంపూర్తిగా నిలిచి పోయాయి. ఇరువైపులా భూసేకరణ చేసి పరిహారం అందించేందుకు రూ.6.96 కోట్లతో పాటు వంతెన నిర్మాణ పనులకు మరో రూ.3 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మూలవాగుపై రెండు వంతెనల నిర్మాణాలతో పాటు ఇరువైపులా సుందరీకరణ పనులు చేపట్టడానికి అప్పటి ప్రభుత్వం 2015 సంవత్సరంలో రూ.28 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో వంతెనల నిర్మాణానికి రూ.12 కోట్లను కేటాయించారు. దీంతో పనులు చేపట్టిన గుత్తేదారు మూలవాగుపై పడమరవైపు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. రెండో వంతెన నిర్మాణం పనులు మొదలు పెట్టినప్పటికీ భారీ వర్షాల కారణంగా, ఇతర బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా వంతెన నిర్మాణంలో పనులు ఆగుతూ సాగుతూ చివరికి నిలిచి పోయాయి. రెండో వంతెన నిర్మాణం చేపట్టినప్పటి నుంచి మూడు సార్లు భారీ వర్షాలకు సెంట్రింగ్ కొట్టుకుపోయి నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడింది.

**మళ్లీ ఇబ్బందులు తప్పవా..**

మూలవాగులో చేపట్టిన రెండు వంతెనల నిర్మాణం పనులు అగ్రిమెంట్ ప్రకారం 2018 సంవత్సరంలోనే పూర్తి కావాల్సి ఉంది. మొదటి వంతెన సకాలంలో పూర్తయినప్పటికీ రెండో వంతెన నిర్మాణంలో ప్రతి ఏటా అంతరాయం ఏర్పడింది. రెండో స్టాండ్ భీమ్‌ల నిర్మాణం సమయంలో భారీ వర్షాలకు కుంగి పోయాయి. ఆ తరువాత రెండు సార్లు భారీ వర్షాలకు సెంట్రింగ్ కొట్టుకుపోయింది. తరువాత సెంట్రింగ్ పైపులు కొట్టుకు పోయి భీములు వంగి పోయాయి. దీంతో గుత్తేదారు పెద్ద ఎత్తున నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. తిరిగి ఆయా పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇటీవల భూమిపూజ చేశారు. వర్షాకాలం రాక ముందే అధికారులు పనులు మొదలు పెట్టి నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

**వినూత్న డిజైన్**

వేములవాడ మూలవాగుపై రెండు వంతెనల నిర్మాణాలు ఆధ్యాత్మికత ఉట్టి పడేలా డిజైన్ చేశారు. 12 మీటర్ల వెడల్పు, 190 మీటర్ల పొడవుతో రెండు వంతెనల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో పడమర వైపు వంతెన నిర్మాణం పూర్తయి వినియోగంలోకి రాగా రెండో వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**త్వరలోనే మొదలు**

మూలవాగులోని రెండో వంతెన నిర్మాణ పనులు త్వరలోనే మొదలవుతాయి. నిర్మాణ పనుల యంత్రాలు గుజరాత్ నుంచి రావాల్సి ఉంది. అవి రాగానే ప్రారంభిస్తాం. భారీ వర్షాలు కురిసినా పనులకు ఎలాంటి ఆటంకాలు ఉండవు. అగ్రిమెంట్ ప్రకారం వంతెన నిర్మాణం పనులు పూర్తవుతాయి. ఈమేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. శాంతయ్య, డీఈ ఆర్అండ్‌బీ

## 'తలలు పట్టు'కొంటున్నారు

హైదరాబాద్: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా పోచారం పురపాలక సంఘం పరిధిలో ఓ ప్రముఖ వ్యక్తి వేసిన లేఅవుట్‌లో ఒక చిరుద్యోగి సుమారు 200 గజాల స్థలం కొనుగోలు చేశారు. లేఅవుట్‌కు అనుమతి లేకపోవడంతో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. పరిశీలించిన సిబ్బంది రిజిస్ట్రేషన్ ఛార్జీలు, 14 శాతం ఓపెన్ స్పేస్ రుసుములు అన్నీ కలిపి రూ.3.36 లక్షలు చెల్లించాలని, 25 శాతం రాయితీ మినహాయిస్తే రూ.2.78 లక్షలు అవుతుందని నోటీసులు జారీ అయ్యాయి. రంగారెడ్డి జిల్లా జల్‌పల్లి పురపాలక సంఘం పరిధిలో ఒక వ్యక్తి 1000 గజాల స్థలం కొనుగోలు చేశారు. దీనికి అన్నీ కలిపి రూ.1.88 లక్షలు చెల్లించాలని, 25 శాతం రాయితీ మినహాయిస్తే రూ.1.46 లక్షలు చెల్లిస్తే సరిపోతుందని నోటీసులు ఇచ్చారు. అయితే ఈ రుసుములు.. 1000 గజాల స్థలానికి తక్కువ వేయడం.. 200 గజాల స్థలానికి ఎక్కువ వేయడంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ గడువు ఈనెల 30 వరకు పెంచింది. 25 శాతం రాయితీ ప్రకటించినా ప్రభుత్వానికి ఆశించిన ఆదాయం రావడం లేదు. మొత్తం మీద రూ.2,230 కోట్ల వరకు ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తే ఇప్పటివరకు రూ.306.30 కోట్లే వచ్చాయి. రిజిస్ట్రేషన్



రుసుములతోపాటు 14 శాతం ఓపెన్ స్పేస్ రుసుములు కలిపి రూ.లక్షల్లో ఉంటున్నాయి.


**సిబ్బంది హస్తలాఘవం**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో కొంతమంది సిబ్బంది హస్తలాఘవం ప్రదర్శిస్తున్నారు. ఎక్కువ శాతం ఒప్పంద ఉద్యోగులు వీటిని పరిశీలిస్తున్నారు. ఎమ్మార్వోలు, పురపాలకశాఖ కమిషనర్ల లాగిన్‌లు వీరి చేతుల్లోనే ఉండటమే కారణం. ఇష్టానుసారం నోటీసులు పంపి పునఃసమీక్ష కోరిన వారితో బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిసింది.

## రాయితీ విత్తనాలపై రైతుల ఆశలు

జగిత్యాల : విత్తన రాయితీని పునరుద్ధరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నా గడిచిన వానాకాలం, యాసంగిల్లో అమలు చేయలేదు. వచ్చే వానాకాలం నుంచి విత్తనాలను ఇస్తామని తాజాగా వ్యవసాయ శాఖామంత్రి ప్రకటించటం రైతులకు ఆశగా మారింది. ఐతే వానాకాలం సీజన్‌కు విత్తనాలను ఇవ్వాలంటే ఇప్పటి నుంచే మేలైన వంగడాలను ప్రభుత్వం సేకరించి సరఫరాకు సిద్ధం చేయాల్సి ఉంటుంది.ఇప్పటి నుంచి చర్యలు చేపడితేనే లబ్ధి

రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల పంటల విత్తనాలను 50 శాతం రాయితీపై ఇవ్వగా ఏడేళ్ల క్రితం అన్నిపంటల విత్తనాల సరఫరాను నిలిపివేసి కేవలం జనుము, జీలుగ విత్తనాలను మాత్రమే అత్యంత పరిమితంగా రాయితీపై ఇస్తోంది. దీంతో రైతులు బయటి మార్కెట్లో ప్రైవేటు విత్తనాలను పూర్తి ధరకు కొని ఆర్థిక భారానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా కూరగాయలు సహా అన్నిరకాల పంటలను రాయితీపై అందిస్తే రైతులకు ఆర్థిక ఆసరాగా ఉంటుంది. జిల్లాలో వానాకాలంలో 4.32 లక్షల ఎకరాల్లో రైతులు అన్నిరకాల పంటలను సాగు చేస్తారు. ఇందులో వరిసాగే 2.92 లక్షల ఎకరాలుగా ఉండనుండగా గతంలో మాదిరిగా తెలంగాణ విత్తన, జాతీయ విత్తన



కంపెనీ ద్వారా, జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా విత్తనాలను రాయితీపై ఇవ్వాల్సి ఉంది. ఇందుకు ఇప్పటి నుంచే రైతుల నుంచి విత్తనాలను సేకరించి నిల్వ చేస్తేనే వానాకాలంలో రాయితీపై సరఫరా సాధ్యపడుతుంది.జిల్లాలో అన్నిపైర్ల సాగు విస్తీర్ణాన్నిబట్టి రూ.100 కోట్ల వరకు వెచ్చిస్తుండగా గతంలో మాదిరిగా ప్రభుత్వం 50 శాతం రాయితీని పునరుద్ధరిస్తే రూ.50 కోట్ల వరకు జిల్లా రైతులకు ఆర్థిక లబ్ధి కలుగుతుంది. సర్కారు సరఫరాతో మేలైన విత్తనాలు తక్కువ ధరలు అందుబాటులోకి వస్తాయి, ప్రైవేటు కంపెనీల విత్తనాల ధరలు కూడా దిగివస్తాయి కాబట్టి సర్కారు విత్తన రాయితీపై రైతులు ఆశగా ఉన్నారు. కంపెనీలను బట్టి 5 కిలోల మొక్కజొన్న విత్తన ప్యాకెట్‌కు రూ.350 నుంచి రూ.2,500 వరకు ధరుండటంతో రైతులు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అలాగే మిరప, కూరగాయల ధరలు కిలోకే రూ.వేలల్లో ఉంటున్నాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వ సరఫరా లేనందున విత్తనాల ధరల నిర్ణయం కంపెనీల ఇష్టానుసారం మారి విత్తనాల ధరలు నాలుగింతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాయితీపై విత్తనాలిస్తే కంపెనీలు కూడా ధరను తగ్గిస్తాయి.

## మూలకు పడి.. మూడేళ్లు..!

నల్గొండ: జిల్లాలోని కనగల్ మండలంలో ఉన్న తేలకంటి గూడెం, జి.యడవెల్లి తాగునీటి ప్రాజెక్టులు.. దశాబ్దాల క్రితం వేలాది గొంతుకల దాహార్తిని తీర్చాయి. రూ.20 కోట్లు వెచ్చించి ఇంటింటా శుద్ధ నీటిని అందించిన ఈ తాగు నీటి కేంద్రాలు నేడు నిరుపయోగంగా మారాయి. మూడేళ్ల నుంచి ఈ రెండు ప్రాజెక్టులు నిరుపయోగంగా మారడంతో ప్రస్తుతం నల్గొండలోని పానగల్ తాగునీటి శుద్ధి కేంద్రం నుంచి నీటిని ఈ మండలాలకు అందించాల్సిన పరిస్థితి వచ్చింది. ఫ్లోరైడ్ పీడిత గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

2007వ సంవత్సరంలో రూ.10 కోట్లతో నిర్మించిన తేలకంటి గూడెం నీటి శుద్ధి కేంద్రం ద్వారా నిడమనూరు, హాలియా, పెద్దవూర, కనగల్, నల్గొండ మండలాలకు తాగు నీటిని సరఫరా చేసే వారు. మరో రూ.10 కోట్లతో జీ.యడవెల్లి ప్రాజెక్టును అదే సమయంలో నిర్మించారు. ఈ ప్రాజెక్టు నుంచి కనగల్, చండూరు, మర్రిగూడ మండలాల పరిధిలో 73 గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత రక్షిత మంచినీటిని అందించే వారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం–నాబార్డు ఆర్థిక సాయంతో సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకాలను 2006లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది.

కనగల్ మండలంలోని తేలకంటిగూడెం ప్రాజెక్టు పరిధిలో ఐదు మండలాల్లోని 110 గ్రామాలకు, జి.యడవల్లి ప్రాజెక్టు మూడు మండలాల్లోని 73 గ్రామాలకు తాగు నీటిని అందించాయి. తేలకంటి గూడెం వద్ద ఉన్న మహిళ సముద్రం చెరువు, జి.యడవల్లి వద్ద ఉన్న యడవల్లి చెరువుల్లో నీటి లభ్యత లేకపోవడం ప్రధాన కారణమని



సంబంధిత అధికారులు చెబుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ కింద ఇంటింటా పైప్‌లైన్లు వేయడం, నల్గొండ నుంచి నేరుగా ఈ గ్రామాలకు నీళ్లు రావడంతో ఈ ప్రాజెక్టు నిర్వహణను ప్రభుత్వ యంత్రాంగం గాలికి వదిలేసింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇందులో ఉన్న మోటార్లు, పంపులు, ఇతరత్రా వస్తు సామగ్రిని దొంగలు అపహరించి సొమ్ము చేసుకుంటున్నారు. మిషన్ భగీరథ పథకం రాకతో ఈ రెండు ప్రాజెక్టుల వద్ద నీటిని తోడే పంపులు ఫిల్టర్ బెడ్స్ వద్ద వృథాగా మారాయి. దీంతో కొందరు దొంగలు వీటిని అపహరించారు. పలుమార్లు తేలకంటి గూడెం ఫిల్టర్ బెడ్‌లలో మూడు మోటార్లతో పాటు సామగ్రి కూడా మాయమయ్యాయి. ట్యాంకు పరికరాలు, ఇతర వస్తువులను సైతం మాయం చేశారు.ఇటీవలే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కనగల్ మండల కేంద్రంలో పర్యటించినప్పుడు ఈ ప్రాజెక్టుల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు అతీగతీ లేకుండా పోయింది.

# కరవు తీర్చేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళిక

తిరుపతి: సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పురోగతిపై సమీక్షిస్తున్నారు. గాలేరు- నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సన్నద్ధమయ్యారు. తక్కువ ఖర్చుతో చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించారు. సంబంధిత అంచనాలు, డిజైన్లను ఉన్నతాధికారులకు పంపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తూర్పు ప్రాంతాలకు జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ముఖ్యం. తిరుపతి నగరం, తిరుమలతో కలిపి ఐదు లక్షల మందికి తాగునీరు అందించవచ్చు. అదేవిధంగా వెంకటగిరి, శ్రీకాళహస్తి, నగరి నియోజకవర్గాల్లోని 1.05 లక్షల ఎకరాలు సస్యశ్యామలమవుతాయి. గతంలో ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట జలాశయం నుంచి నీరు తీసుకోవాలని ప్రణాళికలు రూపొందించినా అటవీ శాఖ అనుమతుల్లో జాప్యం జరిగింది. ఈ క్రమంలోనే ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కండలేరు రిజర్వాయర్ నుంచి తరలించాలని భావించారు.



వైకాపా హయాంలో పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి జలాశయానికి ప్రత్యేకంగా అంచనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకు తగ్గట్టుగానే జీఎన్ఎస్ఎస్ అధికారులు రూ. వెయ్యి కోట్లతోప్రతిపాదనలు పంపారు. మూడు రిజర్వాయర్లు పూర్తయిన తర్వాత నగరి నియోజకవర్గంలోని వేణుగోపాలసాగర్, వేపగుంట, అడవికొత్తూరు రిజర్వాయర్లకు నీటిని తరలిస్తారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు సంబంధించి 52 ఎకరాల అటవీ భూమి సమస్య తేలాలి.

జీఎన్ఎస్ఎస్‌తో సాగుకానున్న ఆయకట్టు 1.05 లక్షల ఎకరాలు
తాగునీరు 5 లక్షల మందికి
మల్లెమడుగు రిజర్వాయర్ అంచనా వ్యయం రూ.280 కోట్లు
బాలాజీ రిజర్వాయర్ అంచనా వ్యయం రూ.320 కోట్లు

# బాడుగకు ఇచ్చేలా... భారం తొలగించేలా!

విజయనగరం : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్‌లు)కు బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు గుదిబండగా మారాయి. నిరుపయోగంగా మారడంతో వీటిపై తీసుకున్న రుణాలు చెల్లించడం సొసైటీలకు భారమవుతోంది. ఈ నేపథ్యంలో వీటిని అద్దె లేదా లీజుకిచ్చేందుకు సహకార అధికారులు సన్నద్ధమవుతున్నారు. మార్క్‌ఫెడ్, పౌర సరఫరాల శాఖల అవసరాలకు వినియోగించే విషయమై సంబంధిత అధికారులతో ఇప్పటికే చర్చించారు. తక్కువ పరిమాణం కావడంతో ప్రైవేటు సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నారు. ఇప్పటికే రిలయన్స్, టాటా వంటి సంస్థల ప్రతినిధులతో చర్చించారు.

**నెలకు రూ.40-50 వేలు**

జిల్లాలో 44 సొసైటీలకు గోదాములు మంజూరయ్యాయి. 500, 1000 టన్నుల పరిమాణంలో నిర్మాణం చేపట్టారు. ఇందులో గుషిణి, తమ్మాపురం, వేపాడ-2 వెయ్యి టన్నులవి. మిగిలినవి 500 టన్నుల పరిమాణం కలవి. ఇప్పటివరకు 24 మాత్రమే పూర్తయ్యాయి. 500 టన్నుల గోదామును రూ.40 లక్షల వ్యయంతో చేపట్టారు. ఇందులో రూ.36లక్షలు రుణం, మిగిలినది రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. వెయ్యి టన్నుల గోదామును రూ.70 లక్షలతో చేపట్టగా, రూ.63లక్షలు రుణం, మిగిలిన రూ.7లక్షలు ప్రభుత్వం ఇస్తుంది. వీటికి రెండేళ్ల మారటోరియం ఉంటుంది. ఆ తర్వాత నుంచి రుణంపై వడ్డీ, అసలు చెల్లించాలి. అయిదేళ్లలోపు రుణం తీర్చాలి. ఇప్పటికే నిర్మించి రెండేళ్లవుతున్నందున రుణం చెల్లించాలి. నెలకు ఒక సొసైటీ రూ.40-50 వేలు చెల్లించాల్సి ఉంది. నిరుపయోగంగా మారడంతో సొసైటీలకు ఆర్థిక భారం కానున్నాయి.



**భారం పడకుండా ..**

రైతులు పంటలను గోదాముల్లో నిల్వచేసుకుని, రుణం పొందొచ్చనే ఉద్దేశంతో ఈ నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలో పంటలను వెంటనే కొనుగోలు చేయడంతో నిల్వ చేయడం లేదు. గోదాములు నిరుపయోగంగా మారాయి. రుణాలు చెల్లించేందుకు సొసైటీలపై భారం పడకుండా ప్రైవేటు సంస్థలకు అద్దె లేదా లీజుకిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 6-7 సంస్థల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి.

**ఇదీ పరిస్థితి...**

మంజూరైన గోదాములు : 44
నిర్మాణం పూర్తయినవి : 24
పనులు జరుగుతున్నవి : 14
ప్రారంభించనవి : 06

**ఎక్కడెక్కడ ఎలా..**

జొన్నవలస సొసైటీ పరిధిలో కోరుకొండ, లక్కిడాం సిరిపురం, గంట్యాడ కొత్తవెలగాడ, పీఎస్ఆర్‌పురం బురదపాడు, బొబ్బిలి దిబ్బగుడివలస, బాడంగి, తెర్లాం, కొట్టక్కి, వేపాడ సొసైటీ పరిధిలో జాకేరు-2, రాజాం పొగిరి, తెట్టంగి అచ్యుతాపురం, గూడేం, సోమలింగాపురం గాతాడ, బొండపల్లి సొసైటీల పరిధిలో గోదాములు నిర్మాణ దశలో ఉన్నాయి. బొండపల్లి మండలం బిల్లలవలస-2, అన్నమరాజుపేట అట్టాడ-2, సతివాడ సీతారామునిపేట-2, కె.ఎం.పురం ముషిడిపల్లి-2, కెల్ల వల్లాపురం-2, గూడేం గోషాడ-2 స్థల సమస్యతో ప్రారంభానికి నోచుకోలేదు. పి.రమేష్, జిల్లా సహకార అధికారి, విజయనగరం

# 'తెల్ల'బోతున్న తనిఖీలు



మార్కాపురం : అటవీ, ప్రభుత్వ భూముల్లోని తెల్లరాయిని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. అనుమతుల్లేని ప్రాంతాల్లోనూ తవ్వుతూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాయల్టీ ఎగవేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. తాము మాత్రం జేబులు నింపుకొంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు బెల్లం కొట్టిన రాళ్లలా ఉండిపోతున్నారు. పట్టుకోవాల్సిన చెక్ పోస్టుల వద్దేమో కళ్లకు గంతలు కట్టుకుంటున్నారు.

**46 క్వారీలకే అనుమతులు**

వైట్ క్వార్జ్(తెల్లరాయి) ఖనిజం పశ్చిమ ప్రకాశంలో ఎక్కువగా లభిస్తోంది. ప్రధానంగా కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, పామూరు, సీఎస్‌పురం, పీసీపల్లి, నెల్లూరు జిల్లా కందుకూరు తదితర ప్రాంతాల్లో అధికం. విదేశాల్లో ఈ రాతికి డిమాండ్ ఉండటంతో పశ్చిమ ప్రకాశంలోని 26 మండలాల్లో 46 చోట్ల తవ్వకాలకు కొందరు అనుమతులు పొందారు. అదే సమయంలో అనధికారికంగా వంద ప్రదేశాల్లో విచ్చలవిడిగా అక్రమార్కులు తవ్వకాలు సాగిస్తున్నారు. కనిగిరి మండలం ముద్దపాడు, అయ్యన్నకోట, లింగనపాలెం, తక్కెళ్లపాడు, లక్ష్మక్కపల్లి, చీర్లదిన్నె వెలిగండ్ల మండలం బల్లిపల్లి, విశ్వనాథపురం, జమ్ములమడక, అడ్డరోడ్డు, సీఎస్‌పురం మండలం చల్లగిరగల తదితర ప్రాంతాల్లో వెలికి తీస్తున్నారు.

**కన్ను గప్పి విదేశాలకు ఎగుమతులు**

తెల్లరాయికి చైనా, జపాన్, మలేషియా, సింగపూర్ తదితర దేశాల్లో డిమాండ్ ఉంది. టన్ను రూ. 30 వేల నుంచి నాణ్యమైనదైతే రూ. 60 వేల వరకు పలుకుతోంది. దీంతో అక్రమార్కుల కళ్ల ఖనిజంపై పడ్డాయి. కేవలం కొన్ని క్వారీలకు అనుమతి పొంది అనధికారికంగా అంతకు రెట్టింపు ప్రాంతాల్లో తవ్వేస్తున్నారు. కృష్ణపట్నం, తమిళనాడు రాష్ట్రంలోని ఓడరేవులకు చేర్చి అక్కడి నుంచి సముద్ర మార్గాన విదేశాలకు తరలించి జేబులు నింపుకొంటున్నారు.

**సెలవు రోజుల్లో తరలింపులు**

ఖనిజం తరలింపునకు ప్రతి శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు, సెలవు దినాలను అక్రమార్కులు ఎంచుకుంటున్నారు. ఆయా రోజుల్లో ఖనిజాన్ని కొనకనమిట్ల మండలంలోని పెదారికట్ల, తర్లుపాడు మండలంలోని తాడివారిపల్లె చెక్‌పోస్టుల మీదుగా బిల్లులు లేకుండా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. తీవ్ర విమర్శలు వెల్లువెత్తినప్పుడు మాత్రం అడపాదడపా తనిఖీలు చేసి కొన్నింటిని పట్టుకున్నట్లు చూపుతూ మమ అనిపిస్తున్నారు. ఈ విషయమై భూగర్భ, గనులు, ఖనిజాభివృద్ధి సంస్థ మార్కాపురం డివిజనల్ అధికారి విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా తరలిస్తున్న తెల్లరాయితో పాటు గ్రానైట్ లారీలను పట్టుకుని జరిమానాలు విధిస్తున్నామన్నారు. తమతో పాటు విజిలెన్స్ విభాగం కూడా దాడులు చేస్తోందని,తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# గుట్టల్లో 'బయో'బాంబు



కర్నూలు : " రోగులకు వాడిన సూదులు.. బ్లేడ్లు బయట పడేస్తే ఇతరులకు అవి గుచ్చుకొని రోగాలు సోకే ప్రమాదం ఉంది. చీము తుడిచిన దూదిలోని ఫంగస్ ఇతరులకు వ్యాపిస్తుంది.. వ్యర్థాల్లోని బ్యాక్టీరియా, వైరస్ ఇతరులకు త్వరగా వ్యాపించి వ్యాధులు ప్రబలుతాయని" వైద్య నిపుణులు చెబుతున్నారు.

'బయో'బాంబులాంటి జీవ వ్యర్థాల (బయో మెడికల్ వేస్ట్) నిర్వహణ గాడితప్పింది. శుద్ధి కేంద్రాలకు తరలించకుండా చెత్తలో కలిపేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. చెట్ల మల్లాపురంలో గుట్టలుగా పేరుకుపోయాయి.

**చెత్తలో కలిపేస్తున్నారా?**

ఆసుపత్రుల వ్యర్థాల నిర్వహణకు కామన్ మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీస్ కేంద్రాలను నివాసితులకు దూరంగా ఏర్పాటు చేయాలి. ఆసుపత్రుల నుంచి వ్యర్థాలు సేకరించినందుకు ప్రతి పడకకు కొంత మొత్తం చెల్లించాలి. ఆసుపత్రులు నిబంధనలు పాటిస్తున్నాయంటూ ఆయా కేంద్రాల నిర్వాహకులు ధ్రువీకరణ పత్రం జారీ చేయాలి. సమాచారాన్ని కాలుష్య నియంత్రణ మండలికి సమర్పించాలి. ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగడం లేదని.. నిత్యం 5 నుంచి 10 శాతం వ్యర్థాలను చెత్తలో కలిపేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**48 గంటల్లో తరలించాలి**జీవ వ్యర్థాలను వివిధ రంగులు కలిగిన డబ్బాల్లో నిల్వ చేయాలి. వాటిని ఏజెన్సీలకు 48 గంటల్లో పంపించాలి.

పసుపు: మానవ శరీర అవయవాలు, రక్తంతో కూడిన భాగాలు, ప్రయోగశాలల వ్యర్థాలు

ఎరుపు: రక్తంతో ఉన్న సామగ్రి, కాటన్ డ్రెస్సింగ్ మెటీరియల్, ప్లాస్టర్లు, సిరంజిలు, ప్లాస్టిక్ వ్యర్థాలు.

నలుపు: కాలం చెల్లిన ఔషధాలు, సూదులు, బ్లేడ్లు, ఇతర పదునైన వస్తువులు.

నేరేడు: క్యాన్సర్ కారక మందులు, దీని వ్యర్థాలు.

**నిత్యం 1.1 టన్నులు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు, నంద్యాల సర్వజన వైద్యశాలలు, శాంతిరామ్, విశ్వభారతి వైద్య కళాశాలలు, ఆదోని ప్రాంతీయ ఆసుపత్రి, 89 పీహెచ్‌సీ, 18 సీహెచ్‌సీలు, ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. వీటి నుంచి నిత్యం 1.1 టన్నుల మేర బయో వ్యర్థాలు వెలువడుతుంటాయి. ఇందులో మానవ అవయవాలు, సూదులు వంటి వాటిని అధిక ఉష్ణోగ్రత దగ్గర వేడిచూసి బూడిద చేయాలి. ప్లాస్టిక్ సీసాలు, సిరంజీలను రీ-సైక్లింగ్ చేయాల్సి ఉంటుంది. రీ-సైక్లింగ్ చేయాల్సి ఉంటుంది.

**నెల్లూరుకు తరలిస్తున్నాం: పీవీ కిశోర్‌రెడ్డి, పర్యావరణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు**

కర్నూలు బి.క్యాంపు: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆసుపత్రుల్లో వెలువడే జీవ వ్యర్థాలను శుద్ధి చేయడానికి నగర పరిధిలో కేంద్రం ఉంది.. అందులో బయో వ్యర్థాలను శుద్ధి చేసే యంత్రాన్ని నిర్వాహకులు మారుస్తున్నారు. గత మూడు నెలలుగా నెల్లూరుకు తరలిస్తున్నారు. వారంలో రెండు రోజులు తనిఖీ చేసి రాష్ట్ర కార్యాలయానికి నివేదికలు పంపుతున్నాం.

# 20 ఏళ్లుగా.. కలగానే కాలువ

యర్రగొండపాలెం : కరవు కాటకాలకు పెట్టింది పేరు వై.పాలెం నియోజకవర్గం. ఈ ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్టు ఓ వరప్రదాయని. ప్రాజెక్టు ఎడమకాలువ (తీగలేరు) నుంచి ఈ నియోజకవర్గంలోని 66 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టు మొదటి విడత పూర్తిచేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు మార్కాపురం పర్యటనలో భరోసా ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. నియోజకవర్గం చివర్లో ఉన్న పుల్లలచెరువు మండలంలోని రైతులకు వెలిగొండ నీళ్లు వస్తాయనే భరోసా ఇచ్చేవారు కరవయ్యారు. **11,500ఎకరాలకు సాగు..** : ప్యాకేజీ-2లోని తీగలేరు కాలువ వై.పాలెం మండలం వీరాయపాలెం సమీపంలో 48.15కి.మీ వద్ద ముగుస్తుంది. ప్రాజెక్టు మొదటి అలైన్‌మెంట్ ప్రకారం ఇక్కడి నుంచి (48.15కి.మీ) మొదలయ్యే టి5 కాలువ పుల్లలచెరువు సమీపంలోని చిన్నకండ్లేరు చెరువులో కలవాల్సి ఉంది. కాలువ కింద 11,500 ఎకరాల ఆయకట్టు కేటాయించారు. మల్లపాలెం సమీపంలో అటవీప్రాంతం మీదుగా కాలువ తవ్వాల్సిరావడంతో అప్పట్లో సాంకేతిక కారణాలు చూపించి అలైన్‌మెంట్ మార్చి నిర్మాణమే నిలిపేశారు. దాని ఆయకట్టును మాత్రం వై.పాలెం, త్రిపురాంతకం మండలాల్లో చూపించి చేతులు దులుపుకున్నారు. దీంతో తమకు అన్యాయం చేశారంటూ పుల్లలచెరువు మండల రైతులు 20ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నారు. దీని ప్రాధాన్యత దృష్ట్యా గత తెదేపా ప్రభుత్వం కాలువ నిర్మాణ సర్వే, అంచనా రూపొందించేందుకు నిధులు మంజూరు చేయగా.. డీపీఆర్ తయారు చేసిన ఓ ప్రైవేటు సంస్థ నివేదికను ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఇచ్చింది. అనంతరం ఎన్నికలు రావడంతో ప్రక్రియ నిలిచింది. 2019లో జరిగిన ఎన్నికల ప్రచారంలో వైకాపానాయకుడు మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ టి5 నిర్మాణంపై హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకున్న పాపాన పోలేదు. **కూటమి ప్రభుత్వంపై ఆశలు**

నమ్మి ఓట్లేసిన వైకాపా ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడంతో కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వమైనా తమ చిరకాల కోరిక నెరవేర్చుతుందని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. కాలువ నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరుతూ నెల రోజులుగా ఈప్రాంత రైతులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు.

# తక్షణం మొదలెడితేనే.. మొండిగోడలకు మోక్షం

తిరుపతి : 'నాడు- నేడు'తో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పింది. ఐదేళ్లలో వాటి ముఖచిత్రమే మారిపోతుందని ఆర్భాటంగా ప్రకటించిన ఈ కార్యక్రమానికి సరిపడా నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడికక్కడ మొండిగోడలే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'మనబడి- మన భవిష్యత్తు' పేరుతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించింది. ప్రస్తుత వేసవి సెలవుల్లో పనులు పునఃప్రారంభిస్తేనే వచ్చే విద్యాసంవత్సరం నాటికి విద్యార్థుల అవస్థలు తీరుతాయి.

మూడు విడతలుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని నాటి ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. 2019 నవంబరులో తొలివిడతలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,533 బడులు ఎంపిక చేశారు. రూ.314 కోట్లతో అదనపు గదులు, మరుగుదొడ్లు, వంట గదులు, ప్రహరీ నిర్మాణం, విద్యుదీకరణ, ఆర్వో ప్లాంట్లు, గ్రీన్‌బోర్డు వంటి సౌకర్యాలు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. ఐదేళ్లు గడిచినా ఇప్పటికీ 57 బడుల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయంటే గత పాలకులు ఏమాత్రం శ్రద్ధ చూపారో అర్థమవుతోంది.

బైరెడ్డిపల్లె మండలం తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాలలో 265 మంది



విద్యార్థులు చదువుతున్నారు. వైకాపా హయాంలో అదనంగా నాలుగు గదులు మంజూరు చేయగా కొంతకాలానికి వాటిలో రెండు గదులు రద్దు చేశారు. ఈలోపే మౌల్డింగ్ దశకు పనులు చేరాయి. ఇప్పుడు నాలుగు గదులూ అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇదే మండలంలోని కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలోనూ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో రెండోవిడత 'నాడు- నేడు'కు ఎంపికైన పాఠశాలలు 1,209

అంచనా వ్యయం రూ.448.06 కోట్లు
చేసిన ఖర్చు రూ.236.65 కోట్లు

**నిధులివ్వడంతో...**

ఏప్రిల్ 24 నుంచి విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించారు. జూన్ 12న పునఃప్రారంభం కానున్నాయి. తక్షణం పనులు మొదలుపెడితే బడులు తెరుచుకునే నాటికి సింహభాగం గదులు అందుబాటులోకి వస్తాయి. ఇటీవల చిత్తూరు జిల్లాలో 30 పాఠశాలలకు నిధులు విడుదలయ్యాయి. ఇదేవిధంగా మిగతాచోట్లా నిధులు విడుదల చేయాలి. ముందస్తుగా 30-40 శాతం నిధులు సమకూర్చి తర్వాత పురోగతిని బట్టి నిధులు విడుదల చేసినా పనులు కొలిక్కి వచ్చే వీలుంటుంది.

**సగంలోపే ఖర్చు**

రెండోవిడత నాడు- నేడు పనులను 2021 ఆగస్టు 16న ప్రారంభించారు. 2022 డిసెంబరులోగా పూర్తి చేస్తామని అప్పటి సీఎం జగన్ హామీ ఇచ్చారు. అనంతర కాలంలో ఈ గడువు పెంచుకుంటూ వచ్చారు. చివరకు 2024 జనవరిలోగా కొలిక్కి తేవాలని నిర్ణయించారు. అయినా ఫలితం లేకుండాపోయింది. పనులన్నిటికీ కలిపి రూ.817.56 కోట్ల అంచనాలు ఉండగా వైకాపా అధికారం కోల్పోయే నాటికి దాదాపు 30 నెలలకుగాను రూ.408.74 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

# సాయంత్రం నాలుగు దాటితే యాతనే

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మాతాశిశు విభాగంలో సాయంత్రం నాలుగు దాటితే గర్భిణులు, బాలింతలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఓపీ, ఐపీ, రక్త పరీక్షలు, మందులు వంటి వాటికి మాతాశిశు విభాగం నుంచి జీజీహెచ్ ప్రధాన భవనంలోకి రావాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లో రోగులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మాతాశిశు విభాగంలో ఉన్న ల్యాబ్‌లో ఓపీ రోగులకు కొన్ని రక్త పరీక్షలు చేయకపోవడంతో వారు ఆసుపత్రి ప్రధాన భవనంలోని సెంట్రల్ ల్యాబ్ నమూనాల సేకరణ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో గర్భిణులు అక్కడి నుంచి ఎండైనా.. వానైనా.. రాత్రైనా.. పాత భవనానికి వచ్చి నమూనాలు ఇవ్వాల్సిందే. దీంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ గర్భిణి మధుమేహం పరీక్షకు పాత భవనంలోని సెంట్రల్ ల్యాబ్‌కు పంపారు. అక్కడకు వెళ్లి నమూనా ఇచ్చే సమయంలో అక్కడే ఆమె ప్రసవించడం కలకలం రేపింది.

**రక్త పరీక్షలకూ ఇబ్బందే**

మాతాశిశు విభాగానికి రోజుకు 150 మందికి పైగా ఓపీ ఉంటుంది. రాత్రి సమయాల్లో 25 మంది వరకు రోగులు వచ్చి సేవలు పొందుతారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎంసీహెచ్ బ్లాకులో ఉండే ల్యాబ్‌ను ఆ తరువాత నిర్వహించకపోవడంతో ఎంత అత్యవసర పరిస్థితుల్లోనైనా నమూనాలు పాత భవనంలోని సెంట్రల్ ల్యాబ్‌కు తీసుకెళ్లాల్సిన పరిస్థితి. రాత్రి సమయాల్లో పుట్టే బిడ్డలను ఎస్ఎన్‌సీయూలో పెట్టాల్సి వస్తే వారిని ఎత్తుకుని క్యాజువాలిటీ వద్ద ఓపీ, ఐపీ నమోదు చేయించుకుని శిశు సంరక్షణ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పలుమార్లు ఆసుపత్రి ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఓపీ కోసం వచ్చే గర్భిణులు, బాలింతలకు ఎంసీహెచ్‌లోని ల్యాబ్‌లో కొన్ని పరీక్షలు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**అత్యవసరమైనా అంతే సంగతులు**

మాతాశిశు భవనం నుంచి సాయంత్రం నాలుగు దాటిన తరువాత వచ్చే అత్యవసర కేసులన్నింటినీ ఓపీ చీటీలు, అడ్మిషన్, రక్త పరీక్షలకు ప్రధాన భవనంలోని క్యాజువాలిటీకి వెళ్లాల్సి వస్తోంది. రోగితోపాటు వచ్చే సహాయకులు వారిని వదిలేసి చీటీలు రాయించుకునేందుకు తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహాయకులు లేకుంటే ఇక అంతే సంగతులు. మందుల కోసం సైతం ప్రధాన భవనంలోని డిస్పెన్సరీకి రావాల్సి వస్తోంది. గతంలో మాతాశిశు విభాగంలోనే అన్ని సమయాల్లో ఓపీ, ఐపీ నమోదు, రక్త పరీక్షలు చేసేవారు. ప్రస్తుతం ఇబ్బందుల దృష్ట్యా తిరిగి అన్ని సమయాల్లో ఆ సేవలు ఎంసీహెచ్‌లో అందుబాటులో ఉండేలా చూడాలని అంతా కోరుతున్నారు.

# నాళం భూములకు నామం

కాకినాడ : అవి సత్రం భూములు.. చౌకగా కొట్టేయడానికి వేలం పాట జరిగిన ప్రతిసారీ రాజకీయ దన్నుతో కొందరు వాలిపోతున్నారు. నామమాత్రపు కౌలుతో వాటిని దక్కించుకుంటారు. కౌలు సవ్యంగా చెల్లిస్తున్నారా అంటే అదీ లేదు. ఇదీ కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని రాజమహేంద్రవరం 'నాళం వారి సత్రం' భూముల పరిస్థితి ఇది. ఈనెల 29న వీటికి వేలం జరగనుంది. ఈసారైనా వేలం ప్రక్రియ సవ్యంగా సాగుతుందా..? లేదా..? అనే చర్చ నడుస్తోంది.

**సామాజిక సేవ లక్ష్యంతో..** రాజమహేంద్రవరానికి చెందిన నాళం రామలింగయ్య 1879లో 'నాళం వారి సత్రం' స్థాపించారు. రూ.కోట్ల విలువైన భూముల ద్వారా వచ్చే ఆదాయం సత్రం నిర్వహణ, సేవా కార్యక్రమాలకు ఉపకరిస్తుందనుకుంటే.. కొందరి స్వార్థ చింతన దాత లక్ష్యానికి అడ్డుతగులుతోంది. ఈ సత్రానికి శృంగవృక్షంలో సర్వే నంబరు 314/ఏ, 314/బీ, 314/సీ, 314/డీ, 314/బీలలో 268.64 ఎకరాల భూమి ఉంది. 13 బిట్లుగా విభజించి మూడేళ్లకోసారి బహిరంగ వేలం వేస్తారు. 2025–26 నుంచి 2027–28 వరకు తాజాగా కౌలు హక్కు కల్పించేందుకు సిద్ధమవుతున్నారు.

**అక్కడికీ.. ఇక్కడికీ ఎంత తేడా..?**

పంపా కాలువ పరిధిలో ఏటా రెండు పంటలు పండే సారవంతమైన భూములు నాళం వారి సత్రానివి. ఎకరం ధర రూ.30 లక్షల నుంచి



రూ.40 లక్షలు పలుకుతోంది. విలువైన ఈ భూములు తక్కువ కౌలుతో ప్రతిసారీ పరాధీనం అవుతున్నాయి. ఇప్పటివరకు ఎకరాకు కనిష్ఠ ధర రూ.5,700 నుంచి గరిష్ఠంగా రూ.9,500 వరకు కౌలు ఆదాయం దక్కినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికి సమీపంలో శ్రీసంస్థాన్ భూములకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం దక్కుతోంది. దీన్నిబట్టి లోగుట్టు ఇట్టే అర్థమవుతోంది.

గత వేలం పాటల తీరు చూస్తే ఓసారి రూ.18 లక్షలు.. మరోసారి రూ.18.50 లక్షలు.. ఇంకోసారి రూ.19 లక్షలు వచ్చింది. రాజకీయ జోక్యం లేకుండా బహిరంగ వేలం నిర్వహిస్తే ఎకరా రూ.15 వేలకు పైనే పాట వెళ్తుందనే వాదన వినిపిస్తోంది. ఈ లెక్కన చూస్తే ఏటా రూ.40 లక్షల వరకు ఆదాయం సమకూరే వీలుంది.

రూ.1.35 కోట్ల బకాయిలు

సత్రం భూములను వేలం పాటలో దక్కించుకున్న కొందరు.. కౌలు సొమ్ము చెల్లించడం లేదు. రాజకీయ దన్ను ఉండటంతో వసూళ్లకు, చర్యలకు అధికారులు వెనకాడుతున్నారు. గత రెండు దశాబ్దాలుగా 52 మంది పాటదారులు రూ.1.35 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మొండి బకాయిల జోలికి వెళ్లకుండా.. మళ్లీ వారికే భూమి కట్టబెట్టేందుకు కొందరు పావులు కదుపుతున్నారు. **బకాయిలు ఉంటే.. వేలంలో పాల్గొనివ్వం**

బకాయిలు చెల్లించనివారు వేలంలో పాల్గొనే అవకాశం ఇవ్వం. తొలి ఏడాది కౌలు మొత్తం.. వేలం జరిగినవెంటనే పాటదారుడు చెల్లించాలన్న నిబంధన పెట్టాం. వేలం ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తాం.

చందక దారబాబు, ఈవో, నాళం వారి సత్రం

# ప్రతిపాదనలతో సరి.. పనులెప్పుడో మరి!

ఆత్రేయపురం: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తప్ప కార్యాచరణ కొరవడుతోంది. ప్రతినెలా హుండీల ద్వారా రూ కోటి, దర్శనాలు, ప్రసాదాల అమ్మకాలు, తదితరాల ద్వారా రెండు కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. సిబ్బంది జీతాలకు సుమారు రూ. 30 లక్షలు, క్షేత్ర నిర్వహణకు దాదాపు రూ.50 లక్షలు చొప్పున నెలకు రూ. 80 లక్షల వరకు ఖర్చవుతోంది. ఏటా భక్తుల రాక పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా సదుపాయాలు కల్పించడంలో దేవాదాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు.

దూరప్రాంతాల నుంచి క్షేత్రానికి విచ్చేసిన భక్తులు దర్శనం అనంతరం విశ్రాంతి తీసుకునేందుకు కనీసం డార్మెటరీ కూడా లేదు. ఆలయ పరిసరాల్లో దుకాణాలు ఉండటంతో ఎక్కడా కూర్చోడానికి కూడా



వీల్లేని పరిస్థితి. ఆలయం దక్షిణం వైపు పార్కింగ్ ప్రదేశంలో చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవనం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. భక్తులు నిలుచుని అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. పార్కింగ్‌కు స్థలం ఉన్నా ఆలయ పరిసరాల్లోనే వాహనాలు నిలిపివేస్తుంటారు. ఏటిగట్టు వద్ద ఉన్న పార్కింగ్ వర్షం వస్తే బురదమయంగా తయారవుతోంది. మరుగుదొడ్లు తగినన్ని లేకపోవడంతో భక్తులు పడరాని పాట్లు పడుతున్నారు. ఆలయం లోపల, వెలుపల తాగునీటి సౌకర్యం పక్కాగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రథం భద్రతకు షెడ్ నిర్మిస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదు.

**దశల వారీగా చేపడుతున్నాం..**

అభివృద్ధి పనులన్నీ దశలవారీగా చేస్తున్నాం. ప్రస్తుతం భక్తులకు ఇబ్బందుల్లేకుండా దర్శనాలు కల్పిస్తున్నాం. అన్నదాన భవనం, రథం షెడ్ నిర్మాణ పనులు త్వరలో చేపడతాం. పార్కింగ్ స్థలం మెరక పనులు చేసేందుకు రూ.70 లక్షలతో ప్రతిపాదనలు చేసి ఆమోదం కోసం పంపాం. ప్రస్తుతం మాడ వీధుల్లో భక్తులకు నీడ కోసం పందిళు ఏర్పాటు చేస్తున్నాం.

నల్లం సూర్యచక్రధరరావు, దేవస్థానం ఈవో, వాడపల్లి

# సహకార గొప్పలు.. గట్టెక్కలేని తిప్పలు



అనంతపురం : మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు ఉంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిస్థితి.. ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయిన వీటిపై బకాయిల వసూళ్లు సవాల్‌గా మారాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో రాజకీయ సిఫార్సులతో ఎడాపెడా రుణాలు మంజూరు చేసిన సొసైటీలు వసూలు చేసుకోవడంలో అంత ఆసక్తి చూపడం లేదు. ఇదే అదనుగా అప్పు చెల్లించే స్థోమత ఉన్న రైతులు సైతం రుణాలు చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారు. ఫలితంగా సొసైటీలన్నీ లాభాల నుంచి నష్టాల ఊబిలోకి కూరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో నియమించిన సహకార కేంద్ర బ్యాంకు, సొసైటీల పాలకవర్గాలను రద్దు చేసింది. ఇటీవల వాటికి ఛైర్మన్లను నియమించింది. ఇంకా జీఓలు రాకపోవడంతో ఛైర్మన్లు ప్రమాణ స్వీకారాలు చేయలేదు. బ్యాంకులు, సొసైటీలకు పూర్తిస్థాయి పాలకవర్గాలను నియమిస్తే రుణాల వసూళ్ల వేగం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**గత ప్రభుత్వంలో వసూళ్లపై తాత్సారం..**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 107 సొసైటీలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు అనుబంధంగా ఉన్నాయి. ఈ సొసైటీలకు సహకార బ్యాంకు అప్పులు ఇస్తుంది. సొసైటీలు తిరిగి రైతులకు అప్పులు ఇచ్చి వసూలు చేస్తుంటాయి. వాటిపై వచ్చే వడ్డీలో కొంత శాతం సొసైటీల నిర్వహణకు, సిబ్బంది జీతాలకు ఇస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా రుణాలు ఇచ్చి వసూలుపై తాత్సారం చేశారు. ఫలితంగా మొత్తం బకాయిలు రూ.206.70 కోట్లకు చేరాయి.

**పీకల్లోతు నష్టాలు..**

కొందరు సొసైటీల సీఈఓలు అక్రమాలకు పాల్పడటంతో నష్టాల శాతం పెరిగింది. మొత్తం సొసైటీల్లో 90 వరకు నష్టాల్లో ఉన్నట్లు అధికారులు తేల్చారు. కనగానపల్లి సొసైటీకి రూ.10.89 కోట్లు రైతుల నుంచి రావాలి. ఇక్కడ అనేక అక్రమాలు జరగడంతో పీకల్లోతు నష్టాల్లో ఉంది. తలుపుల, మడకశిర, ఉరవకొండ, కూడేరు, గాండ్లపెంట, బీకే సముద్రం, ఇస్లాపురం, సైదాపురం తదితర సొసైటీల్లో బాకీల నిధి పేరుకుపోయింది. ఎన్‌పీఏ శాతం పెరిగితే సొసైటీలను మూసివేయాల్సిన దుస్థితి ఏర్పడింది. బకాయిలు చెల్లించని రైతుల జాబితా బహిర్గతం చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటేనే ఎన్‌పీఏ శాతం తగ్గించడానికి అవకాశం ఉంటుంది.

వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాం– సురేఖరాణి, సీఈఓ, సహకార కేంద్ర బ్యాంకు

సహకార సంఘాల నుంచి రూ.206 కోట్ల వరకు బ్యాంకుకు చెల్లించాలి. పాత బకాయిలన్నీ త్వరగా వసూలు చేయాలని ఆదేశాలిచ్చాం. సొసైటీల వారీగా బకాయిలున్న రైతుల పరిస్థితి గుర్తించి వసూలు చేయాలని సూచించాం.

# విత్తన పంపిణీ ఎప్పుడు?



అనంతపురం : జూన్ ఒకట్నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. జిల్లాలో గత ఏప్రిల్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. రైతులు భూములు దుక్కులు చేసుకున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా వస్తున్నాయని భారత వాతావరణ విభాగం చల్లని కబురు అందించింది. వ్యవసాయశాఖ ఇప్పటికే ఖరీఫ్ ప్రణాళిక ప్రకటించింది. అయితే వేరుసెనగ విత్తనకాయల సేకరణ గుదిబండగా మారింది. ఏటా రైతులు పండించిన వేరుసెనగ విత్తనకాయలను సేకరించేవారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పద్ధతికి స్వస్తి పలికారు. వ్యాపారుల నుంచి సేకరించేందుకు శ్రీకారం చుట్టారు. నేటికీ అదే పద్ధతిని కొనసాగిస్తున్నారు. కిలో రూ.88 చొప్పున కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసింది. జిల్లాకు 50 వేల క్వింటాళ్ల విత్తనం కేటాయించారు. అయితే ఇంతవరకు రాయితీ ధర ఖరారు కాలేదు. దీంతో విత్తన సేకరణలో టెండర్‌దారులు జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**పచ్చిరొట్ట ఎరువు పంపిణీకి ఆటంకం**

జిల్లాకు 207 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు కేటాయించారు. అందులో జీలుగ 190 క్వింటాళ్లు, పిల్లిపెసర 15, జనుము 2 క్వింటాళ్ల చొప్పున కేటాయించారు. అన్ని రకాల ఎరువులు 50 శాతం రాయితీతో ధరలు ఖరారు చేశారు. బకాయిలు ఉండటంతో సరఫరాదారులు ముందుకు రాలేదు. **రూ.90 కోట్ల బకాయిలు**

ఉమ్మడి అనంతపురం జిల్లాకు గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో విత్తన ఏజెన్సీలకు, 10 ప్రాసెసింగ్ యూనిట్లలో వేరుసెనగ కాయలు శుద్ధి చేశారు. మొత్తం రూ.90 కోట్లు బకాయిలున్నాయి. ఇప్పటికీ ప్రభుత్వం చెల్లించలేదు. ఆ సొమ్ము చెల్లిస్తే గాని ఈసారి చేయలేమని నిర్వాహకులు చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. వేరుసెనగకాయలు శుద్ధి చేసే నిర్వాహకులు కూడా ముందుకు రావడం లేదు.

**కేటాయింపులు సరే..**

ఖరీఫ్ విత్తన సరఫరా బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్)కు అప్పగించారు. ఉమ్మడి జిల్లాకు 1.10 లక్షల క్వింటాళు కేటాయించారు. జిల్లాలో ఆరు వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో అన్ని రకాల పంటలు కలిపి మొత్తం 8.48 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించారు.

**సకాలంలో సరఫరాకు చర్యలు**

– సుబ్బయ్య, జిల్లా మేనేజర్(ఏపీసీడ్స్)

ఖరీఫ్ సీజన్‌కు ఇంకా 20 రోజులు సమయం ఉంది. ఇప్పటికే వేరుసెనగ విత్తనకాయలకు టెండర్లు పూర్తయ్యాయి. ధరలు నిర్ణయించారు. అయితే రాయితీ ధర ఖరారు కాలేదు. జిల్లాలో ఈసారి 14 ప్రాసెసింగ్ యూనిట్లు ఎంపిక చేశాం. ఒక్కో దాంట్లో రోజుకు 3,600 క్వింటాళ్లు చొప్పున ప్రాసెసింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో రైతుసేవా కేంద్రాలకు తరలిస్తాం.

# ఉపాధి ఎర చూపి.. భూములు కాజేసి!

అనంతపురం : భూములిస్తే పరిశ్రమలు పెడతామంటూ వచ్చారు.. ఇంటికో ఉద్యోగం అని నమ్మించారు. తమ బతుకులు బాగుపడతాయని ఆశించిన రైతులు తరాలుగా సాగు చేసుకుంటున్న పొలాలను తక్కువ ధరకే రాసిచ్చేశారు. భూములు దక్కించుకున్న యాజమాన్యం పర్యటనలు, పరిశీలన పేరుతో కాలయాపన చేసింది. 19 ఏళ్లుగా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు. మడకశిర, పరిగి మండలాల్లో రసాయి ప్రాపర్టీస్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ చేతిలో మోసపోయిన రైతుల దీనగాథ ఇది. మడకశిర మండలం సి.కొడిగేపల్లి, కేతేపల్లి, పరిగి మండలం శ్రీరంగరాజులపల్లి, పరిగి, హొన్నంపల్లి, ధనాపురం గ్రామాలకు చెందిన 1,220 మంది రైతుల నుంచి రసాయి కంపెనీ 2006లో 2,200 ఎకరాలు కొనుగోలు చేసింది. ప్రభుత్వ ధర ప్రకారం ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.లక్ష మాత్రమే చెల్లించింది. భూములిచ్చిన రైతులకు ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీపత్రం కూడా ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు పరిశ్రమల కోసం పునాది రాయి కూడా వేయలేదు. సుమారు రెండు దశాబ్దాలుగా భూములు నిరుపయోగంగా మారాయి.

**నగరాలకు వలస బాట** పరిశ్రమల కోసం భూములిచ్చిన రైతులు ఉపాధికి దూరమయ్యారు. పొట్ట చేతపట్టుకుని బెంగళూరు, తూముకూరు, చెన్నై, కోయంబత్తూరు నగరాలకు వలస వెళ్లారు. అక్కడ భవన నిర్మాణ కార్మికులుగా, సెక్యూరిటీ గార్డులుగా, టెక్స్‌టైల్ కంపెనీల్లో దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూముల పక్కనే 127 ఎకరాల అసైన్డ్ భూమిని ఏపీఐఐసీ కోసం సేకరించడంతో పరిశ్రమలు వస్తాయని నమ్మి రసాయి కంపెనీకి భూములిచ్చామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీడుగా మారిన భూములను ఇటీవలే కొందరు రైతులు దుక్కిదున్ని వర్షాధార పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ భూముల్లో రీసర్వే చేస్తున్నారు. తమ భూముల్ని వెనక్కి ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మడకశిర మండలం సి.కొడిగేపల్లికి చెందిన ఆదినారాయణకు నలుగురు



ఆడపిల్లలు. రసాయి కంపెనీకి తన తల్లిదండ్రులకు ఉన్న ఐదెకరాలు ఇచ్చేశారు. పరిశ్రమలు రాక.. వ్యవసాయం చేసేందుకు పొలమూ లేకపోవడంతో బెంగళూరుకు వలస వెళ్లారు. బేల్దారీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పొలం ఉంటే ఊరిలోనే వ్యవసాయం చేసుకుని పిల్లలను చదివించుకునేవాళ్లమని ఆదినారాయణ వాపోయారు.

పరిగి మండలం శ్రీరంగరాజులపల్లికి చెందిన నరసింహప్ప తనకున్న 3.36 ఎకరాల భూమిని రూ.1.9 లక్షలకే రసాయి కంపెనీకి ఇచ్చేశారు. పరిశ్రమలు స్థాపించి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీపత్రం కూడా ఇవ్వడంతో నమ్మి మోసపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ భూముల్ని ఇప్పించాలని కోరుతున్నారు.

# నిర్మించారు.. వదిలేశారు

పుత్తూరు: రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని శీతల గిడ్డంగి(కూలింగ్ ఛాంబర్) నిర్మించాలని కేంద్రం ప్రభుత్వం 2015లో నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో పుత్తూరు, పాకాల, బంగారుపాళ్యం, వి.కోట, పలమనేరు, పుంగనూరు మార్కెట్ యార్డులలో కూలింగ్ ఛాంబర్లు నిర్మించారు. ఈ పనులను బెంగళూరు చెందిన గుత్తేదారుడు దక్కించుకున్నారు. అయితే అతని నుంచి అనంతపురానికి చెందిన వారు సబ్‌లీజు తీసుకుని నిర్మాణం చేపట్టారు. పుత్తూరు, బంగారుపాళ్యం మార్కెట్‌యార్డుల్లో నిర్మాణం చేపట్టిన నాటి నుంచి నిరుపయోగంగానే ఉన్నాయి. దీంతో ఇక్కడ పండ్లు మాగబెట్టేందుకు గానీ, ఆపిల్ పండ్లు నిల్వ చేసేందుకు వీలుకాని పరిస్థితి. దీంతో అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ ఆశయానికి గండిపడింది. ఒక్కో ఛాంబర్‌లో 20 టన్నుల వరకు నిల్వ చేసుకోవచ్చు. పండ్లు మాగబెట్టేలా వీటిని



నిర్మించారు. పుత్తూరు ఛాంబర్ రూ.40 లక్షలు, బంగారుపాళ్యం కూలింగ్ ఛాంబరుకు రూ.33 లక్షలు, పాకాల యార్డులో రూ.40 లక్షలతో నిర్మాణం చేపట్టారు. ఈ మూడు శీతల గిడ్డంగులు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ఈ ఛాంబర్లలో ఇథలిన్ గ్యాస్‌తో మామిడి, అరటి, సపోటా మాగబెట్టుకోవచ్చు. కూలింగ్‌తో ఆపిల్ పండ్లు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలో మిగిలిన చోట్ల నిర్మించిన కూలింగ్ ఛాంబర్లలో చింతపండు, టమాటాలు నిల్వ చేస్తున్నారు.

**ప్రజల ఆరోగ్యం కోసమే**

గతంలో కార్బైడ్ వినియోగించి పండ్లు మాగబెడుతున్నట్లు ఆకస్మిక దాడుల్లో గుర్తించారు. ఈ పండ్లు తిన్న ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నట్లు విచారణలో తేలింది. డాక్టర్లు, శాస్త్రవేత్తలు సైతం ఇథలిన్ గ్యాస్‌తో మాగబెట్టిన పండ్లు తినవచ్చని సూచించారు. ఈ నేపథ్యంలో కేంద్రం నిధులు మంజూరు చేసింది. వాటితో కూలింగ్ ఛాంబర్లు నిర్మించారు. అయితే ప్రభుత్వం శీతల గిడ్డంగులను స్థానిక మార్కెట్‌యార్డుల్లో నిర్మించి అద్దెకు ఇవ్వడం ద్వారా అటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు, ఇటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చనేది ప్రభుత్వ ఉద్దేశం. ప్రస్తుతం మామిడి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వాటిని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

# నాణ్యతకు గోరీ.. నామమాత్రం రికవరీ

నంద్యాల : పల్లె పనుల్లో నాణ్యత తప్పింది.. నాణ్యతా విభాగం అధికారులు వందల కేసులు నమోదు చేశారు.. పనులు చేపట్టిన గుత్తేదారుల వద్ద డబ్బులు వసూలు చేయాలని ఆదేశించారు.. కానీ పంచాయతీ రాజ్ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన–3, నాబార్డు, ఈఏపీ, ఏఐఐబీ పనులు, ఉపాధి హామీ పథకం కింద అంతర్గత రహదారులు, పల్లె పండగలో భాగంగా సీసీ రోడ్లు, జడ్పీ జనరల్ ఫండ్స్, 15 శాతం ఎస్సీ ఈఎంఎఫ్, 23 శాతం జడ్పీ జనరల్ ఫండ్స్, పీఆర్ రోడ్ల పునర్నిర్మాణం, ఏపీఆర్‌ఆర్‌పీ, పీఎంజీఎస్‌వై నిధులతో వివిధ రకాల పనులు చేపట్టారు. వీటిలో తారు రహదారులు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, భవనాలు, అంతర్గత రహదారులు, పంట కాల్వలు ఉన్నాయి. వాటిలో నాణ్యత లోపించినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు.

**పట్టించుకోని ఏఈలు**

కర్నూలు, ఆదోని, పత్తికొండ, కోడుమూరు, ఆలూరు, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, బనగానపల్లిలో పంచాయతీరాజ్ నాణ్యతా నియంత్రణ విభాగం సబ్ డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతి సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న పనులను ఏఈలు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. పనుల నమూనాలు సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలి. నాణ్యత లేనట్లు తేలితే ఆ పనులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి డబ్బుల రికవరీకి ఆదేశించాలి. రికవరీ చేసే బాధ్యత ఏఈలపై ఉండగా వారు పట్టించుకోవడం లేదు. పర్యవేక్షించాల్సిన డీఈలు శ్రద్ధపెట్టడం లేదు. 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,594 కేసులు నమోదు చేస్తే ఇప్పటి వరకు 1323 కేసులకు సంబంధించి మాత్రమే రికవరీ జరిగింది. మరోవైపు ఆ పనులకు బిల్లులు చకాచకా చేస్తున్నారు. కేసులతో సరి పెట్టారు. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో గోస్పాడు,



నంద్యాల మండలాల్లో 32 కేసులు నమోదు చేశారు. రూ.2.25 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు రూ.25 వేలు వసూలైంది. మహానంది మండలం గోపవరం, అబ్బీపురం, మహానంది, గాజులపల్లెలో 12 పనులపై కేసులు నమోదు చేసినా రికవరీ జరగలేదు. గోస్పాడు మండలంలో ఆరు నెలల కిందట గ్రామ పంచాయతీల తీర్మానం లేకుండానే కొన్ని ఉపాధిహామీ పనులు ఏకపక్షంగా చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకుండానే ఈ పనులు జరిగిపోయాయి. ఇటీవల పనులు పరిశీలించిన నాణ్యతా విభాగం అధికారులు నాలుగు పనుల్లో అక్రమాలు జరిగినట్లు నివేదించారు. ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదు.

డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల మండలంలోని యంబాయి, రామళ్లకోట, రుద్రవరం, సిమెంట్ నగర్‌లో జరిగిన పనుల్లో మూడింటిపై కేసులు నమోదు చేశారు. రికవరీ చేసింది 10 శాతం లోపే. కొత్తపల్లి మండలంలో 12 కేసులకు 9, వెలుగోడులో 16కు 2, ఆత్మకూరు మండలంలో 14కు గాను 3 కేసుల్లో గత ఆర్థిక సంవత్సరంలో రికవరీ జరిగింది. మహానందిలో ఈ రోడ్డును నాసిరకంగా నిర్మించారని నాణ్యతా విభాగం అధికారులు తేల్చారు.

# ప్రాణాలు నిలిపే ప్రణాళికే కీలకం

విశాఖపట్నం : గతేడాది ఆగస్టులో అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడ్డారు. మరో 24 మందికి అనకాపల్లి, విశాఖ, అచ్యుతాపురంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. అందులో అధిక శాతం క్షతగాత్రులకు ప్రైవేటు ఆసుపత్రుల్లోనే చికిత్స అందించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో జరిగిన బాణాసంచా పేలుడు ఘటనలో గాయపడిన బాధితుల్లో ఆరుగురిని కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. వారిలో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఫార్మా, ఇతర పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా దుర్ఘటనల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ముందుగా కేజీహెచ్‌కు తీసుకొస్తున్నారు. వారి పరిస్థితి విషమంగా మారినా, కాలిన గాయాలు ఎక్కువగా ఉన్నా ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సి వస్తుంది. రసాయన, జీవసంబంధ, రేడియోలాజికల్, న్యూక్లియర్ (అణు) సంబంధిత ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు మెరుగైన వైద్యమందించేందుకు స్థానికంగా ప్రత్యేక సదుపాయాలు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశాఖలో సెకండరీ లెవెల్ కెమికల్ బయోలాజికల్ రేడియోలాజికల్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. పెరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా కేంద్రం ఏర్పాటును వేగవంతం చేయాలని వైద్య నిపుణులు కోరుతున్నారు.

గతేడాది వైద్యులకు శిక్షణ: సీబీఆర్ఎన్ సెంటర్ కోసం విమ్స్‌లో



రెండెకరాల స్థలం కేటాయించారు. 2024 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, నిపుణులు స్థలాన్ని పరిశీలించారు. గతేడాది అక్టోబరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. విమ్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులకు తమిళనాడులోని కుడంకుళం అణువిద్యుత్తు ప్లాంటులో శిక్షణ అందజేశారు. తర్వాత ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. కేంద్రం పూర్తయ్యాక అందులో పనిచేసేందుకు పూర్తి సిబ్బందిని కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. చికిత్సకు వినియోగించే ప్రత్యేక సామగ్రి, పరికరాలు కూడా కేటాయిస్తుంది.

**ఏర్పాటైతే ప్రయోజనాలు..**

కేంద్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హెల్త్ సెక్టర్ డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ అండ్ రెస్పాన్స్, ఆయుష్మాన్ భారత్ పథకాల కింద ఈ కేంద్రం నిర్మించాలని భావించారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) తదితర సంస్థల సహకారంతో దీన్ని నిర్మించనున్నారు. రియాక్టర్ పేలుళ్లు, గ్యాస్ లీకేజీలు, రసాయనాల విస్ఫోటనాలు జరిగినప్పుడు తీవ్రంగా గాయపడిన వారికి అత్యాధునిక వైద్యం అందించేలా రెండంతస్తుల్లో తీర్చిదిద్దుతారు. ఎల్జీ పాలిమర్స్‌లో స్టైరీన్ గ్యాస్ లీకేజీ, అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లోని ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు, ఇతర పేలుళ్లు తరహా ఘటన లు జరిగితే బాధితులకు ఒకేచోట మెరుగైన వైద్యం అందించొచ్చు. క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సిన అవసరం లేకుండా తక్షణ, ప్రత్యేకమైన వైద్యం అందించేందుకు వీలుంటుంది. బాధితులకు అత్యవసర చికిత్స చేయడానికి 20 పడకల ఐసీయూ, ఐసోలేషన్ పడకలు తదితర ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

# అమ్మలకు అండగా.. వసతులు మెండుగా

నర్సీపట్నం : నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రి ప్రసూతి విభాగంలో ఒకప్పుడు నెలకు 400 నుంచి 500 వరకు ప్రసవాలు జరిగేవి. రాష్ట్రంలో అత్యధిక ప్రసవాలు జరిగే ఆసుపత్రుల్లో ముందు వరసలో ఉండి అవార్డులు అందుకున్న ఘనత ఈ ఆసుపత్రిది. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఈ ప్రతిష్ఠ మసకబారింది. నెలకు 300 ప్రసవాలు జరగడం గగనమైపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా ఉన్న స్థానిక ఎమ్మెల్యే, సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రసూతి సేవల మెరుగుకు చర్యలు చేపట్టారు. గడిచిన నాలుగు నెలల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వెయ్యి సాధారణ ప్రసవాలు, 300 శస్త్రచికిత్సలు చేశారు. గతంతో పోలిస్తే శస్త్రచికిత్సలు 30 శాతం తగ్గాయి. శస్త్రచికిత్స అవసరమైతే సీనియరు వైద్యులను సంప్రదించి ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటున్నారు. గతంలో ఇక్కడి నుంచి అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి కొన్ని కేసులను పంపేవారు. ఇప్పుడిలా తరలించడం లేదు. అర్ధరాత్రి అయినా అప్పటికప్పుడు వైద్యులు వచ్చి అవసరమైతే శస్త్రచికిత్సలూ చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఆసుపత్రి నుంచి ఒక్క గర్భిణినీ బయటకు పంపలేదు. వైద్యుల సేవలు మెరుగుపడ్డాయి. శస్త్రచికిత్సలు జరిగిన బాలింతలను వైద్యులు రోజుకు రెండు మూడుసార్లు పలకరిస్తున్నారు. ఆసుపత్రిలోనే అవసరమైన ఫొటోథెరఫీ యూనిట్లు అందుబాటులో ఉ



న్నాయి. కామెర్లు ఉన్న పిల్లలను గతంలో ప్రైవేటు ఆసుపత్రులకు పంపేవారు. కుటుంబ సభ్యులు అక్కడ రూ.3 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక్కడే ఉంచుతున్నారు. బరువు తక్కువ పిల్లల కోసం ఎస్ఎన్‌సీయూలో వార్మర్లు ఉన్నాయి. పీజీ వైద్య విద్యార్థులతో కలిసి ముగ్గురు పిల్లల వైద్యులు, నలుగురు ప్రసూతి వైద్య నిపుణులు ఆసుపత్రిలో ఉన్నారు. మందులు కొరత తలెత్తకుండా అవసరమైతే ఆసుపత్రి నిధులతోనే బయటి నుంచి కొనుగోలు చేసి ఇస్తున్నారు.

ఓపీ విభాగంలో సీనియర్ గైనకాలజిస్టు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుధాశారద రోగులను పరీక్షిస్తున్నారు. తాజాగా ఓపీ విభాగంలో ఏసీ సదుపాయం కల్పించారు. ప్రసూతి విభాగం వద్ద శుద్ధజలం అందుబాటులో ఉంచారు. డాక్టర్ సుధాశారద మాట్లాడుతూ.. 'నాలుగు నెలలుగా వైద్యులందరి సమష్టి కృషితో ప్రసవాల సంఖ్య పది నుంచి 40 వరకు పెరిగాయి. నెలకు నాలుగైదు వందల ప్రసవాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రస్తుతం 150 పడకలు ఉన్న ఆసుపత్రిని 200 పడకలకు పెంచేందుకు ప్రతిపాదనలున్నాయి. త్వరలోనే ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడే అవకాశముంద'న్నారు.

# జగనన్న ఇళ్లకు 'కూటమి' సొమ్ములు



హిందూపురం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో 'అందరికీ ఇళ్లు.. జగనన్న కాలనీలు' అంటూ ప్రచారం హోరెత్తించారు. ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల్లో అంతా వైకాపా వారే అయినా బిల్లులు మాత్రం మంజూరు చేయలేదు. అష్టకష్టాలు పడి నిర్మాణాలు చేసుకొన్న వారు అప్పులపాలయ్యారు. ఇళ్లు అవసరం లేని వారు అరకొరగా నిర్మించుకొని వదిలేశారు. గతంలో 2014-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఇళ్లు నిర్మించుకొన్న వారంతా తెదేపా మద్దతుదారులని వారికి గత ఐదేళ్లలో బిల్లులు మంజూరు కాలేదు. కాని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పోకుండా జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడమే కాకుండా, నిర్మాణాలకు మంజూరు చేసిన రూ.1.80 లక్షల సొమ్ము చాలదని అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు మంజూరు చేసింది. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందితో సంప్రదించకుండా నేరుగా రాష్ట్ర స్థాయి నుంచే లబ్ధిదారుల ఖాతాల్లో ఉగాది పండగకు వారం రోజుల ముందు రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.15 వేల చొప్పున జమ చేశారు. పండగ సమయంలో డబ్బులు రావడంతో చాలా మంది సొంత అవసరాలకు ఖర్చు పెట్టేశారు.

**అధికారులకు తలనొప్పులు**

డబ్బులు జమ అయిన వారి వివరాలను తీసుకొని గృహ నిర్మాణ శాఖ అధికారులు ఇంటింటికీ తిరుగుతున్నారు. లబ్ధిదారుల్లో కొందరు మాత్రమే స్పందిస్తున్నారు. మిగిలిన వారు ముందుకు రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అనేకమంది వైకాపా కార్యకర్తలకు ఇప్పటికే ఒక్కో ఇల్లు ఉండగా, ఇది రెండోది కావడంతో పూర్తిచేసేందకు ఇష్టపడటం లేదు.

**ఇష్టారాజ్యంగా జమ!**

ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల్లో చనిపోయిన వారి ఖాతాల్లోనూ సొమ్ము జమ చేశారు. హిందూపురం మండలంలో కొటిపి, గోళ్లాపురం తదితర గ్రామాల్లో ఇలాంటి వారి సంఖ్య ఆరుకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. హిందూపురం- గోరంట్ల జాతీయ రహదారికి, సోమందేపల్లి రైల్వే లైన్ నిర్మాణానికి పోయే స్థలాల్లోనూ గతంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో గతంలో ఇచ్చిన సొమ్మే వృథా అయింది. రహదారి ఏర్పాటు విషయం తెలుసుకొని హిందూపురం మండలం బాలంపల్లి తదితర గ్రామాల్లో ఇప్పటికే ఇళ్ల నిర్మాణం ఆపివేశారు. అలాంటి వారికి ఒక్క గ్రామంలోనే ఐదుగురికి జమ అయింది. మిగిలిన గ్రామాల్లో వివరాలు సేకరిస్తే, మరింత మందికి జమ అయిన విషయం బయట పడే అవకాశం ఉంది.

హిందూపురం మండలంలో 211 మందికి సొమ్ము జమ అయితే, కేవలం నలుగురు మాత్రమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవడానికి ముందుకు వచ్చారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

జులై నాటికి పూర్తయ్యేలా చూస్తాం

– వెంకటనారాయణ, పీడీ, గృహనిర్మాణ శాఖ.

జిల్లాలో 4,788 ఇళ్ల నిర్మాణాలను జులై ఆఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకొంటాం. నేరుగా ఖాతాల్లో సొమ్ము జమ కావడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని అధిగమించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

జిల్లాలో అదనపు సొమ్ము మంజూరు వివరాలు

మొత్తం లబ్ధిదారులు: 4,788 మంది

బీసీలు: 2137

ఎస్సీలు: 1356

ఎస్టీలు: 1295

జమ అయిన సొమ్ము: రూ.10.64 కోట్లు

# శివం.. భక్తజన సుందరం



శ్రీకాళహస్తి : వైకాపా హయాంలో ఐదేళ్లు అదిగో.. ఇదిగో అంటూ కాగితాలకు.. హామీలకు పరిమితమమైన 'శివం టు శివం' రోడ్డు కూటమి ప్రభుత్వం వచ్చాక కార్యాచరణలోకి వచ్చింది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం, ట్రాఫిక్ సమస్యల నియంత్రణ ప్రధానాంశంగా గతంలో తెదేపా హయాంలోనే రోడ్డు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. వైకాపా హయాంలో పట్టిన గ్రహణం వీడి రూ.29 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి.

వైకాపా అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి అలైన్‌మెంట్ మార్చారు. తొలుత రామసేతు వంతెన నుంచి బైపాస్ వంతెన వరకు రూ.25 కోట్లతో ప్రతిపాదనలు ఉండగా.. దాన్ని గత పాలకులు అర్ధనారీశ్వరస్వామి ఆలయం వరకు పెంచారు. దీంతో నిర్మాణ వ్యయం రూ.40 కోట్లకు చేరింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి.

**కూటమి నియంత్రించిందిలా..**

కూటమి ప్రభుత్వం వచ్చాక దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఈ అంశాన్ని ఆర్అండ్‌బీ విభాగానికి మళ్లించారు. వారు పలు దఫాలు పరిశీలించి 2.75 కిలోమీటర్లు పొడవుతో రూ.29 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి ఆమోదం ఇచ్చారు. ఆర్అండ్‌బీ, ఆలయ ఉన్నతాధికారుల పరిశీలనలతో దాదాపు రూ.11 కోట్లు నిధులు మిగిలినట్లయింది. ప్రస్తుతం టెండర్ పూర్తికావడంతో పనులు ప్రారంభమయ్యాయి. సువర్ణముఖి ఆనకట్ట వద్ద మాత్రం వంతెన ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక జలవినాయకుని ఆలయం నుంచి అర్ధనారీశ్వరస్వామి ఆలయం వరకు నదికి కుడివైపున ఈ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఇక్కడున్న పురాతన కాలం నాటి హస్తితీర్థం ఆనవాళ్లు దెబ్బతినకుండా పనులు నిర్వహణ చేపట్టాలంటూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించడం జరిగింది.

**ప్రయోజనాలు మెండు** సువర్ణముఖి నదిని ఆనుకుని ఏర్పాటయ్యే ఈ రోడ్డు ద్వారా శ్రీకాళహస్తి పట్టణానికి కొత్త హంగులు సంతరించుకోనున్నాయి. భక్తులు పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు పడకుండా నేరుగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకోవచ్చు. రోడ్డు నిర్మాణం పూర్తయితే సువర్ణముఖి మరింత సుందరంగా కన్పించే అవకాశాలున్నాయి. ఇన్ని ప్రయోజనాలున్న రోడ్డు పనులు ప్రారంభం కావడంతో పట్టణ ప్రజలతో పాటు ముక్కంటి భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మాన్యం సొమ్ము మాయం

కర్నూలు : తుగ్గలి మండలం పగిడిరాయిలో చెన్నకేశవ స్వామి మాన్యం సొమ్మును కొందరు మాయం చేశారు.. విషయం తెలిసినా దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.. ఆలయానికి సర్వే నంబరు 171లో 31.67 ఎకరాల పొలం ఉంది. ఆ భూమిని కౌలుకిచ్చి వచ్చిన ఆదాయంతో ఆలయ నిర్వహణ చేపట్టాలి. ఆ భూములు ఏళ్లుగా కొందరి ఆధీనంలోనే ఉన్నాయి. గ్రామ పరిసర ప్రాంతాల్లో బంగారం గనులున్నాయని భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు గతంలో తేల్చారు. ఈ నేపథ్యంలో బంగారం గనులు తవ్వడానికి వీలుగా 'జియో మైసూర్' సంస్థ ఆ భూమిని లీజుకు తీసుకుంది. సదరు సంస్థ ఎకరానికి ఏటా రూ.15 వేల చొప్పున లీజు చెల్లిస్తోంది. ఆ లెక్కన ఆలయానికి ఏటా రూ.4.75 లక్షల ఆదాయం రావాలి. గత పదేళ్లలో రూ.47.50 లక్షలు ఆదాయం సమకూరాలి... నేటికీ ఒక్క రూపాయి ఆలయ ఖాతాలో జమకాలేదు.

**పెద్దలు పంచేసుకొన్నారు**

సంస్థ ఇచ్చిన లీజు సొమ్మును గ్రామ పెద్దలు కొందరు కలిసి స్వాహా చేసినట్లు తెలుస్తోంది. లీజు సొమ్మును సదరు సంస్థ అధికారిక ఖాతాలో జమ చేయాలి.. ఈ విషయంపై సంస్థకు అధికారికంగా లేఖలు రాశారు. లీజు సొమ్మును ఏ ఖాతాకు చెల్లించాలో వివరాలు పొందు పరిచారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. 31.67 ఎకరాల భూములున్నా ఆలయం శిథిలావస్థలో ఉంది. చిన్న గదిలో కొనసాగుతోంది.



**అనధికారికంగా వేలంపాటలు**

జియో మైసూర్ సంస్థ తవ్వకాల్లో భాగంగా అక్కడక్కడా డ్రిల్లింగ్ చేస్తుంటారు. ఆ ప్రాంతం మినహా మిగిలిన భాగం ఖాళీగానే ఉంటుంది. మిగిలిన భూములను కొందరు అనధికార వ్యక్తులు వేలం వేశారు. ఆ ఆలయ భూములకు ఏటా రూ.1.50 లక్షల కౌలు చెల్లించేందుకు ఇద్దరు ముందుకొచ్చారు. ఆలయ భూములను అడ్డంపెట్టుకుని అనధికార వ్యక్తులు లబ్ధి పొందుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

# ఆపత్కాలం.. విద్యుత్తుతో జరభద్రం

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు, వీస్తున్న ఈదురుగాలులకు విద్యుత్తు స్తంభాలు, తీగలు, నియంత్రికలు నేల వాలుతుండటంతో తరచూ విద్యుత్తు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు శాఖాధికారులు సూచిస్తున్నారు. తడిసిన స్తంభాలు, స్టేవైర్లు, సపోర్టింగ్ తీగలు, ఇతర పరికరాలను తాకితే ప్రాణాపాయం కలుగుతుందని చెబుతున్నారు. ఇళ్లల్లో వేలాడుతున్న తీగల కారణంగా పైపులకు, గోడలకు విద్యుత్తు సరఫరా జరిగి మరణాలు సంభవిసున్నాయంటున్నారు. రైతులు మెలకువలు పాటించకపోవడంతో వ్యవసాయ మోటార్లు, పొలాలకు రక్షణగా ఉంచిన విద్యుత్తు తీగల్ని తాకి మూగజీవాలు పెద్దఎత్తున మృత్యువాత పడుతున్నాయి. కొద్దిపాటి జాగ్రత్తలు, మెలకువలతో ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

**ఇవిగో సూచనలు**

వర్షాలు కురిసే సమయంలో స్తంభాలు, స్టేవైర్లు, సపోర్టింగ్ తీగలు, ఇతర విద్యుత్తు పరికరాలను చేతితో ముట్టుకోరాదు. తడిసిన, తక్కువ ఎత్తులో వేలాడుతున్న తీగలు శరీరానికి తగలకుండా జాగ్రత్త పడాలి. ఇళ్ల ముందు, ఇళ్ల పైన బట్టలు ఆరవేసేందుకు ఇనుప తీగల బదులు నైలాన్ తాళ్లను ఉపయోగించుకుంటే మంచిది. ఇళ్లలో ఐఎస్ఐ నాణ్యత గల తీగలను, పరికరాలను వాడుకుంటే మంచిది. ఇళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలకు ఇన్సులేషన్(పైపొర) దెబ్బతిన్నట్లు గుర్తిస్తే.. తక్షణమే వాటిని మార్చుకోవాలి. రైతులు తమ పొలాల్లోని వ్యవసాయ మోటార్లకు ఎర్తింగ్ చేయించుకుంటే మంచిది. ఒకవేళ మోటార్లు మరమ్మతులకు గురైతే నైపుణ్యం గల ఎలక్ట్రీషియన్లతో మరమ్మతులు చేయించుకోవాలి. పశువులను మేతకు తీసుకెళ్లేప్పుడు అవి నియంత్రికలు, స్తంభాల దగ్గరకు వెళ్లకుండా చూడాలి. ఈదురుగాలులకు ఎక్కడైనా స్తంభాలు, తీగలు తెగిపడి ఉంటే అటువైపు వెళ్లకుండా చూసుకోవాలి.

వ్యవసాయ మోటార్లు, స్టాటర్లను నేరుగా చేతితో ముట్టుకోవద్దు. మోటారు, ఫుట్‌వాల్వ్‌లకు సర్వీసువైర్లు తగలకుండా చూసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు మార్చడం, ఏబీ స్విచ్‌లు నియంత్రించడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం. సమస్యలు ఏర్పడినప్పుడు స్థానిక లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వాలి.

ఎవరైనా, ఎక్కడైనా విద్యుదాఘాతానికి గురైతే వెంటనే అప్రమత్తమై ప్లాస్టిక్ పైపు లేదా ఎండిన కర్రతో రక్షించే ప్రయత్నం చేయాలి. చేతులతో పట్టుకోరాదు.

**అప్రమత్తత అవసరం :** ఎం.ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్తుశాఖ, కర్నూలు

అకాల వర్షాలు కురిసేటప్పుడు విద్యుత్తు వినియోగదారులు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి విద్యుత్తు సమస్యలు ఉన్నా వినియోగదారులు, రైతులు సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దు. ఏపీఎస్పీడీసీఎల్ వారి 1912 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారమివ్వాలి. విద్యుత్తు విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం తగదు. ముఖ్యంగా అకాల వర్షాలు కురిసినప్పుడు, ఈదురు గాలులు వీచినప్పుడు ఏమాత్రం ఏమరపాటుగా వ్యవహరించినా ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉంది. ఎక్కడ విద్యుత్తు సమస్యలు తలెత్తినా సంబంధిత లైన్‌మెన్‌కు, ఏఈ, ఏడీఈలకు సమాచారమివ్వాలి. స్థానిక ఎలక్ట్రీషియన్లతో ఎల్‌సీ(లైన్ క్లియర్) తీసుకోకుండా సొంత ప్రయోగాలను ఎట్టిపరిస్థితుల్లోనూ చేయొద్దు.

# కస్తూర్బాలో సీటు.. దొరికితే అదృష్టం

కర్నూలు : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో చేరేందుకు అమ్మాయిలు పోటీ పడుతుండటంతో 'సీటు' దక్కడం కష్టంగా మారింది. నాణ్యమైన భోజనం, విద్య, స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ, స్వీయరక్షణకు పెద్దపీట వేస్తుండటంతో చేరే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించడంతో మరింత ఆసక్తి పెరిగింది. రాష్ట్రస్థాయి సన్‌షైన్ స్టార్ పురస్కారానికి ఏడుగురు ఎంపికైతే..ఇందులో ముగ్గురు కర్నూలు జిల్లాకు చెందిన వారే కావడం విశేషం. ఆరోతరగతిలో ప్రవేశానికి సంబంధించిన సీట్ల సంఖ్యను రెట్టింపు చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఏటా మూడు వేల మంది పోటీ**

కర్నూలు జిల్లాలోని 26 కస్తూర్బాల్లో 1040 సీట్లున్నాయి. ఒక్కో దాంట్లో 40 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఏటా 3 వేల మంది విద్యార్థినులు కస్తూర్బాల్లో చేరేందుకు పోటీపడుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 3,123 దరఖాస్తులు వచ్చాయి. నంద్యాల జిల్లాలో 27 కేజీబీవీలు ఉండగా, 1080 సీట్లు ఉన్నాయి. ఇప్పటికి 2800 దరఖాస్తులు వచ్చాయి. చాలాచోట్ల రక్షణ గోడలు లేకపోవడంతో రాత్రిపూట ఆకతాయిల బెడద ఎక్కువగా ఉందని కేజీబీవీ ప్రిన్సిపాళు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కొన్నింటిలో మరుగుదొడ్లు, నీటి సమస్య వేధిస్తోంది. వాటిని పరిష్కరిస్తే మరింత బాగుంటుందని విద్యార్థినులు విన్నవిస్తున్నారు. సమస్యలు పరిష్కరించి విద్యార్థినులకు



నాణ్యమైన బోధన అందిస్తామని సమగ్ర శిక్షా ఏపీసీ శ్రీనివాసులు పేర్కొన్నారు.

**స్ఫూర్తి నింపిన ఇంటర్ ఫలితాలు**

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా కస్తూర్బాల్లో బోధిస్తుండటంతో విద్యార్థినులు 900కు పైగా మార్కులు సాధించారు. అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్‌లో 17 మంది, బైపీసీలో 26 మంది, సీఈసీలో 8, ఎంఈసీలో ఒకరు, ఎంఎల్‌టీలో ఇద్దరు, ఎంపీసీలో 18, రిటైల్ మేనేజ్‌మెంట్లో ఇద్దరు అమ్మాయిలకు 900 మార్కులకు పైగా వచ్చాయి. నంద్యాల జిల్లాలో అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్‌లో 16 మంది, బైపీసీలో 17, సీఈసీలో ఒకరు, ఎంపీసీలో ముగ్గురు విద్యార్థినులు 900 పైగా మార్కులు సాధించారు. గూడూరు నుంచి ఎంపీసీ విద్యార్థిని ఉప్పరి సునీత 983 మార్కులు, ఓర్వకల్లు నుంచి బోయ హరిత 913 మార్కులు, కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల నుంచి టి.మానస ఒకేషనల్‌లో 992 మార్కులు సాధించారు.

చురకలు



# హామీలు నెరవేర్చేలా.. కుప్పానికి కృష్ణాజలాలు

చిత్తూరు : చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఏటా కరవు కరాళ నృత్యం చేస్తోంది.. చెరువులు నిర్జీవంగా కనిపిస్తాయి.. పొలాలు బీడువారి ఆశగా ఆకాశం వైపు చూస్తుంటాయి.. పంటలు బతికించుకునేందుకు అన్నదాతలు వెయ్యి- 1,500 అడుగుల లోతు వరకు పదుల సంఖ్యలో బోర్లు వేసినా పాతాళం నుంచి గంగ పైకి వస్తుందన్న నమ్మకం లేదు.. హంద్రీ- నీవా సుజల ప్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు ఒక్కటే ఈ దుర్భర పరిస్థితిని తప్పించగలదని భావించి 2014- 19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం కృష్ణా జలాలను వి.కోట మండలం కృష్ణాపురం వరకు తెప్పించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హెచ్ఎన్ఎస్ఎస్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మే నెల చివరికి లేదంటే జూన్ నాటికి పనులు పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పట్టుదలగా ఉన్నారు.

**కూటమి ఆచరణ ఇలా..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అంటే ఖరఫ్ నాటికి చివరి ఆయకట్టుగా ఉన్న కుప్పానికి సాగునీరు అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. చెప్పినట్టుగానే పది నెలల్లో లైనింగ్, పలుచోట్ల విస్తరణకు కలిపి రూ.650 కోట్లు ఖర్చు చేసి ఈ ప్రాజెక్టుపై చిత్తశుద్ధి చాటుకున్నారు.



**వైకాపా నాటకాలిలా..**

వైకాపా హయాంలో ఐదేళ్లలో పుంగనూరు బ్రాంచ్ కాలువ (పీబీసీ), కుప్పం బ్రాంచ్ కాలువ (కేబీసీ)కి కలిపి రూ.60 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు డ్రామాకు తెరలేపారు. కుప్పానికి నీరు అందిస్తున్నామంటూ గతేడాది ఫిబ్రవరి 26న నాటి ముఖ్యమంత్రి జగన్ అట్టహాసంగా కార్యక్రమం చేపట్టారు. ఆయన అటు వెళ్లగానే షట్టర్లు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అరకొరగా వదిలిన కృష్ణా జలాలను ఆపేసి నవ్వులపాలయ్యారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత పలుమార్లు అధికారులతో సమీక్షించారు. పనులు పూర్తయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే 0.8 టీఎంసీల నీటితో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 110 చెరువులను నింపేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందుకు దాదాపు నెల రోజులు పట్టే అవకాశం ఉంది. తద్వారా వచ్చే ఖరీఫ్‌లో 6,300 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. ఇవి జలకళ సంతరించుకున్న తర్వాత పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని చెరువులకు కృష్ణా జలాలు వదులుతారు. కేబీసీ సామర్థ్యం 216 క్యూసెక్కులు కాగా వైకాపా హయాంలో కేవలం 10- 15 క్యూసెక్కులే ప్రవహించాయి. ప్రస్తుతం 200 క్యూసెక్కులు ప్రవహించేలా పనులు చేస్తుండటం గమనార్హం.

**బోర్లు వేసే బాధ తప్పుతుంది**

గతంలో తెదేపా హయాంలో ఒకసారి మా ప్రాంతానికి కృష్ణా జలాలు వచ్చాయి. అప్పట్లో భూగర్భ జలమట్టం పెరిగింది. వైకాపా హయాంలో ఎన్నికలకు ముందు అరకొరగా వదిలారు. ప్రస్తుతం వేగంగా లైనింగ్ పనులు జరుగుతున్నాయి. వీలైనంత త్వరగా నీరు విడుదల చేస్తే లక్షలాది రూపాయలు వెచ్చించి బోర్లు వేసే బాధ తప్పుతుంది.

సుబ్రహ్మణ్యం, రైతు, రామసముద్రం గ్రామం, బైరెడ్డిపల్లె మండలం

# చేసుకోండిలా ఈకేవైసీ

చిత్తూరు : ఈకేవైసీ చేయించుకోవాలి.. లేకుంటే బియ్యం పంపిణీ నిలుపుదల చేస్తారు. ఇది రెండు నెలలుగా ఎక్కడ విన్నా వినపడుతున్న మాటలు. అయితే అసలు తాము ఈకేవైసీ చేయించుకోవాలో లేదో.. లేకపోతే ఎక్కడ చేయించుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 30 వరకు ఉన్న గడువును ఈ నెలాఖరు వరకు పెంచారు. జిల్లాలో 1379 చౌక దుకాణాలుండగా.. అందులో 5.36 లక్షల కార్డులు, 16.70 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీటిలో ఇంకా 1.12 లక్షల మంది 8-9 శాతం మంది వరకు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఇలాంటి వారు ఆన్‌లైన్‌లో ఈకేవైసీ స్టేటస్ సొంతంగా తెలుసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

**ఆన్‌లైన్‌లో ఇలా:** గూగుల్ వెబ్ బ్రౌజర్‌లో ఈపీడీఎస్-1 అని నమోదు చేసి ఎంటర్ నొక్కాలి. అప్పుడు 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్స్యూమర్ ఎఫైర్స్ అండ్ సివిల్ సప్లయిస్ ఏపీ' అనే వెబ్‌సైటు తెరుచుకుంటుంది. దానిలో డాష్ బోర్డు ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకోవాలి. దానిలో బియ్యం కార్డు విభాగంలో ఆరు రకాల ఆప్షన్లు 'న్యూ' అనే పేరుతో కనిపిస్తాయి. ఈపీడీఎస్ అప్లికేషన్ సెర్చ్ లేదా రైస్ కార్డు సెర్చ్ అనే ఐచ్ఛికాల్లో ఒకదానిని క్లిక్ చేసి బియ్యం కార్డు నంబరు నమోదు చేస్తే అందులో ఉన్న పేర్లు వస్తాయి. ఆయా పేర్ల ఎదురుగా సక్సెస్ లేదా ఎస్ అని ఉంటే ఈకేవైసీ అయినట్లే అలా కాకుండా ఇంకా ఏమైనా ఉంటే ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. డీలరు లేదా ఎండీయూ వాహనం వద్ద ఈపోస్ యంత్రంలో వేలిముద్ర వేసి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్ తెలిపారు. అయిదు సంవత్సరాల లోపు, 80 ఏళ్లు పైబడినవారికి ఈకేవైసీ అవసరం లేదన్నారు. మిగిలిన వారంతా విధిగా చేసుకోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. **ఈ నెల 30 వరకే గడువు**

జిల్లాలో బియ్యం కార్డులు : 5.36 లక్షలు

సభ్యుల(యూనిట్లు) సంఖ్య : 16.70 లక్షలు

ఈకేవైసీ పూర్తికాని సభ్యులు : 1.12 లక్షలు

# గ్రాసం అందేనా..కడుపు నిండేనా?



అనంతపురం : పశుసంపదకు సరిపడా గ్రాసం దొరకడం లేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే ఖరీఫ్ దాకా ఎలా నెట్టుకురావాలన్నది రైతులకు, ప్రభుత్వానికి సవాలుగా మారింది. గతంలో రైతులు ధాన్యంతోపాటు ఎండుగడ్డిని భద్రపరుచుకునేవారు. ఒక ప్రాంతంలో కొరత ఏర్పడినా సమీప ప్రాంతంలో అందుబాటులో ఉండేది. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. వెరసి పశు గ్రాస కొరతకు దారి తీస్తోంది. ఎండుగ్రాసం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

**సాంకేతికత అందుబాటులోకి..**

వరికోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో నూర్పిళ్లు చేయడానికి ఎక్కువ సమయం పట్టడంతో రానురాను రైతులు ఆ పద్ధతికి స్వస్తి పలికారు. తక్కువ ఖర్చు, కొద్దిపాటి సమయంలో ధాన్యం ఇంటికి చేరిపోతుందనే భావనతో వరికోత యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఏ ప్రాంతంలో చూసినా 80 శాతానికిపైగా యంత్రాల సాయంతోనే కోతలు కోస్తున్నారు. యంత్రంతో కోత కోసేటప్పు ఓడు గడ్డి ముక్కలుగా అవడం వల్ల దాన్ని పొలంలోనే వదిలేస్తున్నారు. మిగిలిన 20 శాతం మాత్రమే నూర్పిళ్లు అవకాశం ఉంటోంది. దీంతో రైతుకు నామమాత్రంగానే ఎండుగడ్డి లభ్యమవుతోంది. జిల్లాలో ఈసారి తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడంతో కొరత మరింత తీవ్రంగా ఉంది.

**ప్రత్యామ్నాయం..**

ఒక పశువుకు రోజుకు కనీసం 15-20 కిలోల ఎండుగడ్డి అవసరం. పచ్చిగడ్డి అయితే 20-40 కిలోలు వరకు కావాలి. వరిగడ్డిలో ఫైబర్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల అరుగుదల బాగుంటుంది. పశువుకు మేత సంతృప్తిగా తిన్న భావన కలుగుతుంది. వరిగడ్డి బండి అయితే రూ.6 వేలు, ట్రాక్టర్ అయితే రూ.12 వేలు ధర పలుకుతోంది. అయితే గడ్డికొని పశువులకు మేపలేని పరిస్థితి.

పాతరగడ్డి :- ఎండుగడ్డి కొరతను అధిగమించడానికి గతంలో సైలేజ్ (పాతరగడ్డి)ను బేళ్ల రూపంలో తయారు చేసి తెదేపా ప్రభుత్వం రాయితీతో కిలో రూ.2 చొప్పున అప్పట్లో రైతులకు సరఫరా చేసింది. మందం ఉంటే పాలిథిన్ కవరులో గాలి దూరకుండా గడ్డిచుట్టి ఉంచుతారు. దాన్ని మూడేళ్ల వరకు వాడుకోవచ్చు.

వీటితోపాటు రాయితీ గడ్డి విత్తనాలు ప్రభుత్వం ఇస్తోంది. నీటి ఆధారం ఉన్న రైతులు కొంత పొలంలో పచ్చిగడ్డి పెంచుకుంటే కొరత తీరుతుంది. 1,39,630 మెట్రిక్ టన్నులు అవసరం

ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల కాలానికి గడ్డి కొరత ఉందని గుర్తించింది. అందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించింది. జిల్లాలో మొత్తం పశువుల యూనిట్లు సంఖ్య 9,47,618 ఉన్నాయి. 1,39,630 మెట్రిక్ టన్నుల గడ్డి కొరత ఉందని గుర్తించారు. పాతరగడ్డి (సైలేజ్) 3 వేల మెట్రిక్ టన్నులు, దాణా 6 వేల మెట్రిక్ టన్నులు, గడ్డి విత్తనాలు 100 మెట్రిక్ టన్నులు, గడ్డి కత్తిరించే యంత్రాలు 300 కావాలని నివేదికలు ప్రభుత్వానికి పంపామని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వెంటస్వామి తెలిపారు.

# ఇసుక దిబ్బల్లో ఉద్యాన పంటలు



అనంతపురం : సాధారణ నేలల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తుంటారు. ఇందుకు భిన్నంగా ఇసుక దిబ్బల్లో పండిస్తున్నారు కొందరు రైతులు. ప్రభుత్వ చేయూతను అందిపుచ్చుకుని దిగుబడులు సాధిస్తున్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని దర్గాహొన్నూరు, గోవిందవాడ, మీనహళ్లి, గరుడచేడు, తుంబిగనూరు, మాల్యం, కళేకుర్తి, బొల్లనగుడ్డం, కల్‌హొళ తదితర గ్రామాల పరిధి.. వేదవతి హగరి పరివాహక ప్రాంతంలోని 4,500 ఎకరాల్లో ఇసుక దిబ్బలు విస్తరించాయి. ఇక్కడ ఖరీఫ్‌లో మాత్రం వేరుసెనగ, కంది అతికష్టం మీద పండిస్తారు. ఈ నేపథ్యంలో 2018-19లో తెదేపా ప్రభుత్వం... రెండు మండలాల్లోని ఇసుక దిబ్బల్లో ఉద్యాన పంటల సాగుకు చేయూత అందించింది. ఉపాధి హామీ పథకం కింద సపోటా, మామిడ, మునగ మొక్కలను అందజేయడంతోపాటు బోర్లను తవ్వించింది. దీంతో కొందరు రైతులు సపోటా, మామిడి...అంతర్ పంటగా మునగ సాగు చేపట్టారు. ప్రధానంగా దర్గాహొన్నూరు చెందిన రైతులు 12 ఎకరాల్లో సపోటా సాగు చేసి అధిక దిగుబడి సాదిస్తున్నారు. బోర్లకు ఆయిల్ ఇంజన్లను ఏర్పాటు చేసుకుని నీరందిస్తున్నారు. పంటను వారాంతపు సంతలకు తరలించి కిలో రూ.30 నుంచి రూ.40 వరకు అమ్ముకుంటున్నారు. ఎకరానికి 10 టన్నుల వరకు దిగుబడి రావచ్చు అంచనా వేస్తున్నారు. ఆరేళ్లు కష్టపడితే ప్రస్తుతం పంట చేతికి వస్తున్నట్లు చెబుతున్నారు.

**విద్యుత్తు సౌకర్యం కల్పించాలి** పార్వతి, దర్గాహొన్నూరు, రైతు

బోరు వేయించి... ఆయిల్ ఇంజన్ ద్వారా సపోటా మొక్కలకు నీరు అందించి కాపాడుకున్నాం. ప్రస్తుతం కోతకు వచ్చాయి. పండ్ల తోటలను పెంచే రైతులకు ఉచితంగా మోటార్లు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలి.

**మార్కెట్ సదుపాయం లేక అవస్థలు: కొత్తపల్లప్ప**

సపోటా పంటను అమ్ముకోవడానికి మార్కెట్ సదుపాయం కల్పించాలి. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటలను విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఇసుక నేలల్లో పంటలు సాగు చేసే రైతులకు వంద శాతం రాయితీతో బిందు, తుంపర సేద్య పరికరాలు పంపిణీ చేయాలి.

# కబ్జాలు కనిపించవా?

ధర్మవరం : ఇది ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవపురం కాలనీలో పురపాలక రిజర్వ్ స్థలంలో ఏర్పాటు చేసిన షెడ్డు. వైకాపా నాయకుడు తన ఇంటి ముందు ఉన్న రిజర్వ్ స్థలాన్ని ఆక్రమించేశాడు. ఇక్కడ సెంటు స్థలం విలువ రూ.10 లక్షల పైమాటే. పురపాలక అధికారులకు తెలిసినా కనీసం నోటీసులు ఇచ్చేందుకు సాహసం చేయలేదు. స్థానిక వార్డు సచివాలయ ఉద్యోగి ఒకరు ఆక్రమణపై ప్రశ్నించి నోటీసు ఇవ్వడంతో ఏకంగా సచివాలయంలోకి వెళ్లి సదరు ఉద్యోగిపై ఆక్రమణదారుడు దాడి చేశాడు. అప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ధర్మవరం పట్టణంలో రూ.కోట్ల విలువ చేసే పురపాలిక రిజర్వ్ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. కబ్జాదారులు ఏకంగా నిర్మాణాలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు వైకాపా నాయకులు ఎక్కడ రిజర్వ్ స్థలాలు కనిపించినా వాటిలో పాగా వేశారు. కొత్తగా ఏర్పాటైన కాలనీలను వదల్లేదు. పురపాలక శాఖకు చెందిన ఐదెకరాల రిజర్వ్ స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి విలువ రూ.50 కోట్లకు పైగానే ఉంటుంది. వైకాపా పాలనలో వాటిని కాపాడే యత్నం అప్పటి అధికారులు ఏమాత్రం చేయలేదు. కనీసం నోటీసులు ఇచ్చేందుకు వెనుకాడారు. నేటికీ వాటిని స్వాధీనం చేసుకునేందుకు యంత్రాంగం ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా రాజేంద్రనగర్, లక్ష్మీచెన్నకేశవపురం, ఇందిరమ్మ కాలనీ, సుందరయ్యనగర్, పోతులనాగేపల్లి కాలనీల్లో కబ్జాకు గురయ్యాయి. ఆక్రమించిన స్థలాల్లో ఇంటి నిర్మాణాలు, షెడ్లు, ఇటుకల తయారీ యూనిట్లు పెట్టారు.



**ఆక్రమణ స్థలాలను స్వాధీనం చేసుకుంటాం**

– ప్రమోద్‌కుమార్, పురపాలిక కమిషనర్, ధర్మవరం

రిజర్వ్ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. వాటిని గుర్తించి కంచె ఏర్పాటు చేయిస్తాం. అవసరమైన నిధులను కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. కబ్జాకు గురైన వాటిని స్వాధీనం చేసుకుంటాం.

# పనుల్లో వేగమే మహా'ప్రసాదం'

విశాఖపట్నం : చందనోత్సవం నిర్వహణకు సింహాచలం దేవస్థానం ముస్తాబవుతోంది. పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా. వీఐపీ, వీవీఐపీల తాకిడి అధికంగానే ఉండనుంది. ప్రత్యేక దర్శన టికెట్లకు డిమాండు ఉండొచ్చంటున్నారు. ఈ నేపథ్యంలో కొండమీద చేపడుతున్న 'ప్రసాద్' పథకం పనులు కొంత ఆటంకంగానే కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటిగా జరుగుతున్న కార్యక్రమం కావడంతో ప్రాధాన్యంగా తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా కనీసం చివరి దశలో ఉన్న పనులైనా పూర్తి చేస్తే మేలని పలువురు పేర్కొంటున్నారు. **ప్రాజెక్టు పనులతో..:** కేంద్ర పర్యాటక శాఖ నిధులు రూ.54 కోట్లతో సింహాచలం కొండ మీద, దిగువన ప్రసాద్ పథకం పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. అయితే కొన్నిచోట్ల పనులు నత్తనడకన సాగడంతో భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

గతంలో ప్రొటోకాల్ వాహనాలు, విధులకు హాజరయ్యే అధికారుల వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ కోసం వినియోగించే స్థలంలో ప్రస్తుతం వాణిజ్య దుకాణాలను తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. బస్టాండ్ వద్ద నిలిపేందుకు కూడా పూర్తిగా ఖాళీ స్థలం లేదు. కొత్తగా నిర్మిస్తున్న వాణిజ్య దుకాణ సముదాయం చివరి దశలో ఉన్నా.. ఈ నెలాఖరులోగా దాన్ని అందుబాటులోకి తీసుకురావడం అనుమానంగానే ఉంది. దీంతో పార్కింగ్ సమస్య వెంటాడుతోంది.



**క్యూలైన్ల కోసం..:** ఉచిత దర్శనాలకు గతంలో నృసింహ మండపం లోపల నుంచి క్యూలైన్లను వదిలేవారు. ప్రస్తుతం ఆ మండపాన్ని కొన్నిచోట్ల కూలగొట్టి పనులు చేపడుతుండటంతో దీని లోపల నుంచి క్యూలైన్లను పంపించడం ఈసారి కుదరదు. ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం నిర్మించిన క్యూకాంప్లెక్సు భవనాన్ని వినియోగించుకోవాలని చూస్తున్నారు. అయితే దీనికి తుది మెరుగులు దిద్దాల్సి ఉంది.

**నకిలీ పాసులతో బురిడీ..**

గతంలో కొందరు భక్తులు నకిలీ పాసులతో వచ్చినట్లు గుర్తించి గతేడాది క్యూఆర్ కోడ్‌తో పాసులను ఇచ్చారు. అలాగే కొందరు భక్తుల వద్ద టికెట్లు చించకపోవడంతో వాటినే మళ్లీమళ్లీ కొందరు వినియోగించారు. ఇటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కలప కలిపేశారు.. కలిసి దోచేశారు!

అచ్యుతాపురం : రహదారి పొడవునా ఉన్న భారీ వృక్షాలు, విలువైన చెట్లను తొలగించి, సొమ్ముచేసుకునేలా ఆ రహదారి పనుల గుత్తేదారుకే కారుచౌకగా కట్టబెట్టేశారు. వైకాపా హయాంలో ఈ రోడ్డు విస్తరణకు టెండర్లు పిలవగా అందులోనే చెట్ల కలప అంశాన్ని చేర్చి గుత్తేదారుకే మేలు చేకూర్చేలా అప్పటి నాయకులు వ్యవహరించారు. మార్కెట్‌లో కలప ధర కంటే అతితక్కువ ధరకే అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. పనులు ఆలస్యమైనప్పుడు వాటి అంచనా విలువలు పెంచుతుంటారు. ఈ చెట్ల విషయంలో కూడా ప్రస్తుత ధరలను లెక్కగట్టి ఆ మేరకు సొమ్మును కూటమి సర్కారు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**కోల్పోయింది.. రూ.కోటి పైనే**

అనకాపల్లి జాతీయ రహదారిని అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిని (సెజ్) అనుసంధానించేలా 13.75 కిలోమీటర్ల పొడవైన రహదారిని వంద అడుగుల మేర విస్తరించనున్నారు. ఈ పనులకు 2023లో టెండర్లు పిలిచి రెండేళ్లలో రూ. 243 కోట్లతో రెండు చిన్న వంతెనలు, 47 కల్వర్టులను నిర్మించే బాధ్యతను విజయవాడకు చెందిన ఓ సంస్థకు అప్పగించారు. ఇంతవరకు బాగానే ఉన్నా రోడ్డుకు ఇరువైపులా పెరిగిన 407 భారీ వృక్షాలను తొలగించి వాటిని అమ్ముకునే అవకాశాన్ని పని ఒప్పందంలో కలిపి గుత్తేదారు సంస్థకే అప్పగించారు. అటవీశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి వందల సంఖ్యలోని చెట్ల విలువ కేవలం రూ. 12.5 లక్షలుగానే లెక్కగట్టించారనే ఆరోపణలున్నాయి. మార్కెట్‌లో ఎందుకు పనికిరాని చెట్లు, కొమ్మల కలప టన్ను రూ. 3,500 పైనే పలుకుతుంది. ఆ లెక్కన ఒక్కో చెట్టు నుంచి కనీసం ఆరు నుంచి ఎనిమిది టన్నులు కలప దిగుబడి వచ్చినా వీటి విలువ రూ. కోటి పైనే దాటుతుందని కర్రల మిల్లు నిర్వహకులు చెబుతున్నారు. ఈ రోడ్డులో వందేళ్ల వయస్సు దాటిన వృక్షాలే అధికంగా ఉన్నాయి. వీటితోపాటు విలువైన టేకు, నల్లమద్ది, వేప, నేరేడు చెట్లు అధికంగా కనిపిస్తున్నాయి. తక్కువ ధర నిర్ణయించడం వల్ల ఆ మేరకు ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోనుంది.



**వేలం వేస్తే పోటీ పెరిగేది..**

సాధారణంగా ఏదైన రహదారి నిర్మాణంలో చెట్లను తొలగించాల్సి వస్తే ప్రత్యేకంగా వాటి కోసం బహిరంగ ప్రకటన జారీచేయాలి. తొలగించిన కలపను వేలం వేసి వచ్చిన సొమ్ము సర్కారు ఖజానాకు జమచేయాలి. అప్పుడే పోటీ పెరిగి కలప ద్వారా వచ్చే ఆదాయం పెరగడానికి అవకాశం ఉంటుంది. ఈ రోడ్డు విస్తరణ విషయంలో అవేవీ పట్టించుకోలేదు. గుత్తేదారుకు తక్కువ ధరకే అప్పగించడానికి ఆసక్తి చూపించారు నాటి ప్రభుత్వ పెద్దలు. వారి చర్యలు తెలిసినా కూటమి పెద్దలు మౌనం దాల్చడం విశేషం. **ప్రాజెక్టు త్వరగా పూర్తిచేయాలనే....**

ప్రాజెక్టును త్వరగా పూర్తిగా చేయాలనే ఉద్దేశంతోనే గుత్తేదారునికే ఈరోడ్డులో ఉన్న చెట్లును తొలగించే బాధ్యతను అప్పగించారు. అప్పట్లో అటవీశాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగానే రూ. 12.5 లక్షల ధరను నిర్ణయించారు. ఇప్పుడు ఎంతధర ఉందో తెలియదు. రాధాకృష్ణ, డీఈ, ఆర్అండ్‌బీ, ఎలమంచిలి

## అర్జున్ రెడ్డి భామకి ఆ ఛాన్స్ ఉందా..?

ఒక సినిమా సూపర్ హిట్ అయితే అందులో నటించిన హీరోకి స్టార్డం వస్తే.. అందులో నటించిన హీరోయిన్ కి కూడా అదే రేంజ్ క్రేజ్ వస్తుందని అనుకుంటారు. కానీ కొన్ని సినిమాలకు మాత్రమే అలా జరుగుతుంది. కొందరు హీరోయిన్స్ కి మాత్రం అలా జరగదు. ముఖ్యంగా ఒక సెన్సేషనల్ సినిమాలో హీరోయిన్ గా నటించినా సరే పెద్దగా క్రేజ్ తెచ్చుకోలేదు. ఇంతకీ ఇక్కడ ప్రస్తావిస్తున్న సినిమా ఏది.. ఆ హీరోయిన్ ఎవరు అంటే ఆ సినిమా అర్జున్ రెడ్డి అయితే ఆ హీరోయిన్ షాలిని పాండే. విజయ్ దేవరకొండ హీరోగా సందీప్ వంగ రెడ్డి డైరెక్షన్ లో తెరకెక్కిన సినిమా అర్జున్ రెడ్డి. ఈ సినిమాలో షాలిని నటించింది. సినిమాలో విజయ్, షాలిని పెయిర్ అలరించింది. ఐతే ఈ సినిమా సూపర్ హిట్ కాగా విజయ్ దేవరకొండకు సూపర్ స్టార్ డం వచ్చింది. ఒక కొత్త అబ్బాయి ఇలా చేయగలడా అని ఆడియన్స్ మైండ్ బ్లాక్ అయ్యేలా చేశాడు. అర్జున్ రెడ్డితోనే విజయ్ దేవరకొండ అసలు కెరీర్ మొదలైంది. అంతేకాదు కెరీర్ టర్న్ కూడా ఆ సినిమా నుంచే మొదలైంది. ఐతే ఆ సినిమాలో నటించిన హీరోయిన్



షాలిని పాండేకి మాత్రం పెద్దగా కలిసి రాలేదు. ఆ సినిమా తర్వాత మహానటి, ఎన్ టీ ఆర్ కథానాయకుడు, 118 సినిమాల్లో నటించింది షాలిని పాండే. అర్జున్ రెడ్డి తర్వాత అమ్మడు కథల ఎంపికల్లో చేసిన తప్పుల వల్లే ఆమె కెరీర్ అలా అయ్యింది. తెలుగులో వర్క్ అవుట్ అవ్వట్లేదని తమిళ్ లో ప్రయత్నాలు చేసింది అమ్మడు. అకడ కూడా పెద్దగా క్లిక్ అవ్వలేదు. ఇక బాలీవుడ్ లో కూడా షాలిని సినిమాలు చేస్తూ వచ్చింది. సినిమాలు, సీరీస్ లతో బీ టౌన్ ఆడియన్స్ ని మెప్పించాలని చూస్తుంది షాలిని పాండే. అందం అభినయం రెండు ఉన్నా షాలిని ఎందుకో ఆశించిన స్థాయి క్రేజ్ తెచ్చుకోలేదు. ప్రస్తుతం అమ్మడు తమిళంలో ధనుష్ నటిస్తూ డైరెక్ట్ చేస్తున్న ఇడ్లీ కడైలో నటిస్తుంది. ఆ సినిమాతో పాటు హిందీలో రాహు కేతు సినిమా చేస్తుంది. ఐతే తెలుగులో అర్జున్ రెడ్డి సినిమాకు సూపర్ ఫ్యాన్స్ ఉన్నారు. ఆ ఫ్యాన్స్ షాలిని మీద కూడా అభిమానం కలిగి ఉన్నారు. అమ్మడికి మళ్లీ తెలుగులో ఛాన్స్ లు వస్తే బాగుంటుందని అనుకుంటున్నారు. ఐతే ఆల్రెడీ టాలీవుడ్ లో ఫెయిల్ అయిన షాలినికి మళ్లీ ఆ అవకాశం ఉంటుందా అన్నది చెప్పడం కష్టమే.

## మామ్ ధైర్యంతో ఇండస్ట్రీకి రీతూవర్మ!

సినిమా ఇండస్ట్రీకి కుమార్తెలను పంపిచాలంటే ఏతల్లైనా ఎంతో ఆలోచిస్తుంది. అందులోనూ తెలుగమ్మాయిలు రావాలంటే? మరింత ఆలోచిస్తారు. ఇండస్ట్రీ గురించి తమకున్న పరిజ్ఞానం మేరకు ఏ తల్లైనా వద్దే అంటుంది. ఎన్ని కోట్లు సంపాదించినా? సినిమా నటులు అంటే ఎక్కడో చిన్న చూపు అన్న అపవాదు ఎప్పటి నుంచే ఉంది. ఈ విషయాన్ని ఎన్నో సినిమాల్లో ఎంతో మంది ఓ పెన్ గానే చెప్పారు. పూరి జగన్నాథ్ తన సినిమా లో పాట ద్వారా కూడా చెప్పే ప్రయత్నం చేసారు. సినీ పరిశ్రమ ఎంత వృద్ధిలోకి వచ్చినా? ఇప్పటికే తెలుగింట అమ్మాయిల్నిసినిమాల్లోకి పంపించాలంటే? ఎంతో ఆలోచిస్తారు. అయితే రీతూ వర్మ మామ్ మాత్రం అందుకున్న భిన్నం. తమ కుటుంబమంతా ఉన్నత విద్యావంతులే. అందరూ ఇంజనీర్లు..డాక్టర్లు. రీతూవర్మ సినిమాల్లోకి వెళ్తానంటే అంతా విచిత్రంగా




భావించారట. కానీ తన తల్లి మాత్రం ధైర్యంగా వెళ్లి ఓ ప్రయత్నం చేయ్ అని ప్రోత్సహించిందట. అలా అమ్మ సహకారంతో రీతూ వర్మ సినిమాల్లోకి వచ్చినట్లు తెలిపింది. అమ్మ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఇప్పటికీ అలాగే కాపాడుకుంటూ వస్తున్నట్లు తెలిపింది. ఇండస్ట్రీలో జరిగే ప్రతీ విషయాన్ని అమ్మతో పంచుకుంటుందట. ఇండస్ట్రీలో సమస్యలు ఎదురైనా వాటి గురించి మామ్ కి చప్పగానే వాటికి పరిష్కారం కూడా చెప్పేవారంది. మామ్ సంగీతా వర్మ సొంతంగా ఓ స్కూల్ రన్ చేస్తున్నారట. ప్రోఫెషనల్ గా ఎంతో బిజీగా ఉన్నా తనకు మాత్రం ఎలాంటి లోటు లేకుండానే చూసుకుంటారని తెలిపింది. రీతూవర్మ గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుంది. అలాగే లిప్ లాక్ సన్నివేశాల్లోనూ అమ్మడు నటించదని తెలిసిందే.





# 'తమ్ముడు' తప్పుకోవడంతో రేసులోకి 'కింగ్ డమ్'?





2025 సమ్మర్ సీజన్‌లో టాలీవుడ్ సినిమాలు వరుసగా వాయిదా పడుతూ అభిమానులను నిరాశపరుస్తున్నాయి. 'హరిహర వీరమల్లు', 'విశ్వంభర' సినిమాల పనులు ఆలస్యం, ఇతర కారణాలతో మే నుంచి జూన్‌కు వాయిదా పడ్డాయి. ఇప్పుడు 'కింగ్‌డమ్', 'తమ్ముడు' సినిమాలు కూడా వాయిదా వార్తలతో అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నాయి. సమ్మర్ సీజన్‌లో భారీ సినిమాలు ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించేందుకు సిద్ధంగా ఉంటాయని అందరూ భావిస్తుండగా, ఈ వాయిదాలు చర్చనీయాంశంగా మారాయి. 'కింగ్‌డమ్' సినిమా కూడా పలు కారణాల వల్ల ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తోంది. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్‌లో ఆలస్యం, పోస్ట్-ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడంతో రిలీజ్ డేట్ ఎన్నోసార్లు మారింది. మొదట మే 30న విడుదల కావాల్సిన ఈ సినిమా, ఇప్పుడు మరోసారి వాయిదా పడింది. ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'కింగ్‌డమ్' యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో సితార బ్యానర్‌పై నిర్మితమవుతోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పవర్ఫుల్ పాత్రలో కనిపించనున్నాడని, భాగ్యశ్రీ బోర్సే అతని సరసన నటిస్తూ అందరినీ ఆకర్షిస్తుందని సమాచారం. అనిరుద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినిమా టీజర్, గ్లింప్స్‌లు ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ చేశాయి. లేటెస్ట్ సమాచారం ప్రకారం, 'కింగ్‌డమ్' సినిమా జులై 4 విడుదల కానుంది. మొదట ఈ తేదీన విడుదల కావాల్సిన 'తమ్ముడు' సినిమా వాయిదా పడే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది. దిల్ రాజు నిర్మాణంలో రూపొందుతున్న 'తమ్ముడు' సినిమాలో నితిన్ హీరోగా నటిస్తున్నాడు. ఈ రెండు సినిమాలు ఒకే రోజు విడుదలైతే బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ తప్పదని భావించిన నిర్మాతలు, 'తమ్ముడు'ను వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 'తమ్ముడు' సినిమా కొత్త రిలీజ్ డేట్ కోసం నిర్మాతలు చూస్తున్నారు. ఈ సినిమా సిస్టర్ సెంటిమెంట్ తో డిఫరెంట్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందుతోందని సమాచారం. ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'కింగ్‌డమ్', 'తమ్ముడు' సినిమాలు హిట్ కావడం విజయ్ దేవరకొండ, నితిన్ లకు చాలా అవసరం. ఇటీవలి కాలంలో వీరిద్దరూ పెద్దగా సక్సెస్ సాధించలేకపోయారు. విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్', నితిన్ 'రాబిన్ హుడ్' సినిమాలు నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు సినిమాలు వీరి కెరీర్‌లో కీలకంగా మారనున్నాయి. మరి ఈ సినిమాలు ఎలాంటి విజయం సాధిస్తాయో చూడాలి.

# వరుస విషాధాలు దేనికి సంకేతం?



వరుస సంఘటనలో 'కాంతారా' ప్రీక్వెల్ టీమ్ లో ఆందోళన మొదలైందా? తర్వాత ఎలాంటి దుర్ఘటన జరగబో తంది? అన్న టెన్షన్ యూనిట్ సభ్యుల్లో నెలకొందా? అంటే అవుననే కన్నడ మీడియా కథనాలు అంత కంతకు వెడెక్కిస్తున్నాయి. చిత్రీకరణ మొదలు కాగానే అడవిని నాశనం చేసారనే విమర్శలు ఎదర్కున్నారు. దీంతో కొన్ని రోజుల పాటు తాత్కాలికంగా చిత్రీకరణకు బ్రేక్ పడింది. కొత్తగా మళ్లీ ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చే వరకూ షూటింగ్ చేసే పరిస్థితి రాలేదు. అటుపై గాలి వానకు భారీ సెట్ ధ్వంసమైంది. కొట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన సెట్ అది. అలా డబ్బు నష్ట పోవాల్సి వచ్చింది. ఈఘటనలో కొంత మంది సెట్ నిర్మాణ కార్మికులు కూడా గాయపడ్డారు. అటుపై జూనియర్ ఆర్టిస్టులతో షూటింగ్ స్పాట్ కు వెళ్తోన్న బస్సు బోల్తా పడంది. ఈ ఘటన లో 20 మందికి పైగా గాయాలయ్యాయి. ఈ మొత్తాన్ని ఒక ఎపిసోడ్ లా చూస్తే? రెండవ ఎపిసోడ్ లో ఏకంగా మరణాలే సంభవించాయి. అదే సినిమాకు పని చేస్తోన్న ఓ జూనియర్ ఆర్టిస్ట్ ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో ఒక్కసారి టీమ్ అంతా షాక్ అయింది. ఏంటి ఇలా జరుగుతుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఆ ఘటన మరువక ముందే సినిమాలో కీలక పాత్ర పోషిస్తోన్న రాకేష్ పూజారి ఆన్ సెట్స్ లోనే కుప్పకూలాడు. షూటింగ్ సమయంలో గుండె పోటు రావడంతో మృతి చెందాడు. దీంతో మరోసారి టీమ్ గుండెల్లో గుబులు మొదలైంది. వరుసగా మన సినిమాకే ఇలా ఎందుకు జరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఆ మధ్య రిషబ్ శెట్టిని పంజుర్లి దేవత దర్శనానికి వెళ్లగా ప్రమాదంలో ఉన్నావ్ అని రిషబ్ ని హెచ్చరించింది. జరిగిన ఘటనలు అన్ని చూస్తుంటే పంజుర్లి చెప్పినట్లే జరిగింది. వరుస దుర్ఘటనలు..రెండు మరణాల నేపథ్యంలో చిత్రీకరణ పూర్తయ్యేలోపు ఇంకెన్ని ఘోరాలు జరుగుతాయో? నన్న ఆందోళన వ్యక్తమవుతుంది. ఈ సంఘటనలు చూసి సెట్ కార్మికులు నిర్మాణ పనులలకు రావడానికి జంకుతున్నారుట. పంజుర్లి ఆగ్రహానికి గురికావడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానిక మీడియాలో కథనాలు వెలువ డుతున్నాయి. కాంతార పంజుర్లి దేవత కథ ఆధారంగా తెరకెక్కిన సంగతి తెలిసిందే. ప్రీక్వెల్ లో కాంతార ముందు కథని చెప్పబోతున్నారు. అంటే అడవిలో మాయమైన మనిషి నుంచి కథ మొదలవుతుంది.

## బేబమ్మ తెలుగు ప్రేమ.. సక్సెస్ కోసం పాట్లు..!

ఉప్పెన సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భామ కృతి శెట్టి. ఆ సినిమాలో బేబమ్మ గా అమ్మడు సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. సినిమా రిలీజై సెన్సేషనల్ హిట్ కాగా కృతి ఎక్కడ కనిపించినా సరే బేబమ్మ అనే పిలిచారు. ఉప్పెన క్రేజ్ తో వరుస ఛాన్స్ లు రావడం వాటిలో హిట్లు ఫ్లాపులు పడటం జరిగింది. ఐతే అరడజను సినిమాలు చేశాక కృతి చేసిన సినిమాల్లో సక్సెస్ ల కన్నా ఫెయిల్యూర్స్ ఎక్కువ ఉన్నాయి. అందుకే అమ్మడికి కెరీర్ విషయంలో టెన్షన్ పట్టుకుంది. తెలుగులో లాస్ట్ ఇయర్ చివరగా శర్వానంద్ తో మనమే సినిమా చేసింది కృతి శెట్టి. ఆ సినిమా కూడా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అందుకే మరో ఛాన్స్ అందుకోలేదు. ఈ గ్యాప్ లో తమిళ్ లో రెండు సినిమాల ఆఫర్ అందుకుంది కృతి శెట్టి. జినీ, ఎల్.ఐ.కె సినిమాల్లో




నటిస్తున్న కృతి ఆ ప్రాజెక్ట్ ల మీద చాలా హోప్స్ పెట్టుకుంది. తెలుగులో మరో ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్న కృతి శెట్టి ఆ అవకాశం వచ్చే లోగా తెలుగు మీద ప్రేమ చూపించాలని ఫిక్స్ అయ్యింది. అందుకే తెలుగు లెర్నింగ్ నేర్చుకుంటుంది కృతి శెట్టి. ఈమధ్య హీరోయిన్స్ అంతా కూడా తమ డబ్బింగ్ తామే చెప్పుకుంటున్నారు. తెలుగు భాష మీద పట్టు ఉంటే కచ్చితంగా అది ఇంకాస్త ఈజీ అవుతుంది. అందుకే కృతి శెట్టి కూడా తెలుగు భాష నేర్చుకుంటుందట. సొంత డబ్బింగ్ లో చిన్న చిన్న పొరపాట్లు కూడా చేయకుండా ఉండేందుకు ఇంకా చెప్పే డైలాగ్ యొక్క ఫీలింగ్ ని అర్థం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. అంతేకాదు అసలు తెలుగు వచ్చి నటిస్తే యాక్టింగ్ కి కూడా ఎంతో హెల్ప్ అవుతుంది. బేబమ్మ వేసిన ఈ స్టెప్ ఆమె కెరీర్ కి నిజంగానే ప్లస్ అయ్యే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. కృతి శెట్టి కి మరో సూపర్ హిట్ పడితే కానీ ఆమె మళ్లీ తిరిగి ఫాంలోకి వచ్చే ఛాన్స్ కనిపించట్లేదు.

హిట్టు కాదు కనీసం ఒక సినిమా ఆఫర్ కూడా ఆమెకు రావట్లేదని టాక్. తెలుగులో అవకాశాలు రాకపోయినా వెయిట్ చేసినా మంచి ఆఫర్ కొట్టేయాలని ఫిక్స్ అయ్యింది అమ్మడు. మరి బేబమ్మ ఈ ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయన్నది చూడాలి.

## ఊర్ఫీ కేన్స్ ప్రదర్శన స్కిప్ కారణం?

ఉర్ఫీ జావేద్ పరిచయం అవసరం లేదు. ఈ భామ కొంత కాలంగా ఎలాంటి అప్ డేట్ లేకుండా సైలెంట్ గా ఉంది. సామాజిక మాధ్యమాల్లో ఫోటోషూట్ల సందడి అస్సలు కనిపించలేదు. అయితే తాను ఎందుకు సైలెంట్ గా ఉందో ఈ భామ తాజా ఇంటర్వ్యూలో వెల్లడించింది. ప్రముఖ కంటెంట్ క్రియేటర్ గా తాను ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ఉర్ఫీ వెల్లడించింది. నిజాయితీ అనే దుర్బలత్వం కారణంగా తన వీసాను పలుమార్లు తిరస్కరించారని తెలిపింది ఊర్ఫీ. వీసా కోసం ప్రయత్నించాను. కానీ తిరస్కరణలు ఎదురయ్యాయి. నా బిజినెస్ ఆగిపోయింది.. అని తెలిపింది. కేన్స్ 2025లో కనిపించడానికి అవకాశం లభించిందని, కానీ ప్రతిష్టాత్మక చలనచిత్రోత్సవానికి హాజరు కాలేకపోయానని కూడా ఊర్ఫీ ఆవేదన చెందింది. ఇండీ వైల్డ్ ద్వారా కేన్స్‌కు వెళ్లే అవకాశం వచ్చింది... కానీ విధి వేరుగా ఉంది.. నా వీసాను తిరస్కరించారు అని ఊర్ఫీ జావేద్ తెలిపింది. తిరస్కరణలు



ముగింపు కాదని, మరింత కష్టపడి పనిచేయడానికి ఒక ప్రేరణ అని ఉర్ఫీ వ్యాఖ్యానించింది. మనలో చాలా మంది మీరే తిరస్కరణలను ఎదుర్కొంటున్నవారే.. నేను మీ కథలను తెలుసుకోవాలనుకుంటున్నాను.. ఒకరినొకరు ఆదరించుకుందాం.. ఉద్ధరిద్దాం! అంటూ కొత్త వ్యాపారాన్ని ఊర్ఫీ స్టార్ట్ చేసింది. జీవితంలో చాలా తిరస్కరణల తర్వాత కూడా నేను ఆగడం లేదు.. మీరు కూడా ఆగకూడదు! అని కోరింది. ఫ్యాషన్ ఎంపికల్లో డేరింగ్ అండ్ డ్యాషింగ్ క్వీన్ గా ఊర్ఫీ జావేద్ కి మంచి గుర్తింపు ఉంది. రోజువారీ గృహోపకరణాలను ఉపయోగించి ప్రత్యేకమైన దుస్తులను సృష్టించి ధరించిన ఘనత తనకే చెల్లింది. సేఫ్టీ పిన్‌లతో తయారు చేసిన దుస్తులు అయినా... ఫోన్‌లు, పిజ్జాలతో ఫ్యాషన్ అయినా.. సృజనాత్మకత సరిహద్దులను చెరిపేసిన ఊర్ఫీకి భారీ ఫాలోయింగ్ ఏర్పడింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536